www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జూబ్లీహిల్స్‌లో ప్రచారానికి సీఎం రేవంత్

రేపు యూసఫ్‌గూడ పోలీస్‌గ్రౌండ్స్‌లో సభ

30, 31న.. నవంబరు 4, 5 తేదీల్లో రోడ్‌షోలు!

ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్న ఆయన.. స్వయంగా ప్రచారంలోకి దిగుతున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని యూసఫ్‌గూడ పోలీస్‌గ్రౌండ్స్‌లో ఈ నెల 28న తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, 24 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి అభినందన సభ జరగనుంది. ఆయనతో పాటు

మిగతా 13వ పేజీలో...

సోమవారం | 27-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 208 |
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం; శుక్లపక్షం; తిథి: షష్ఠి పూర్తి; నక్షత్రం: మూల మ.1:27 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ.11:40-1:27, రా.11:58-1:43, దుర్ముహూర్తం: మ.12:21-1:07, మ.2:39-3:25; అమృతఘడియలు: ఉ.6:20-8:07; రాహుకాలం: ఉ.7:30-9:00; సూర్యోదయం: 6:15; సూర్యాస్తమయం: 5:42 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హైదరాబాద్-విజయవాడ

స్మార్ట్ రోడ్డు

ఎన్‌హెచ్-65 ఇక హై సెక్యూరిటీ హైవే!

భద్రతే ప్రామాణికంగా రహదారి అభివృద్ధి

ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా చర్యలు

ఆరు వరసలుగా జాతీయ రహదారి విస్తరణ

అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద కిలోమీటర్‌కు ఒకటి చొప్పున స్మార్ట్ ఏఐ కెమెరాలు

సోలార్ వీధిదీపాలు.. రోడ్డు పక్కన సేఫ్టీ బారికేడ్లు

రోడ్డు మధ్యలో ప్రత్యేక మొక్కలతో పచ్చదనం

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రత్యేక చర్యలు

50 పారిశ్రామిక పార్కులు.. 4 ఆర్థిక కారిడార్లు.. 2 టెక్స్‌టైల్ క్లస్టర్లకు అనుసంధానం

'ఆంధ్రజ్యోతి'కి లభించిన ప్రాథమిక డీపీఆర్

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) జాతీయ రహదారి ఇకపై హై సెక్యూరిటీ హైవేగా మారనుంది. దారి పొడవునా ఎక్కడ ఏం జరిగిందన్నది స్పష్టంగా తెలిసేలా డిజిటల్, స్మార్ట్ రోడ్డుగా రూపుదిద్దుకోనుంది. సోలార్ వీధి దీపాలు, రహదారి పక్కన భద్రతా బారికేడ్లు, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రత్యేక ఏర్పాట్లు, రోడ్డు మధ్యలో మొక్కలతోపాటు వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు ఊతమిచ్చేలా ఈ రోడ్డు త్వరలో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం నాలుగు వరుసలతో ఉన్న ఈ రహదారిని తెలంగాణ పరిధిలోని మల్కాపూర్ వద్ద ఉన్న అందోల్ మైసమ్మ ఆలయం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పట్టణంలో ఉన్న కనకదుర్గమ్మ గుడి వరకు 231.32 కిలోమీటర్ల మేర 6 వరుసలుగా విస్తరించనున్నారు. ఈ విస్తరణ పనులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనను పూర్తిచేసేలా చర్యలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే ప్రాథమికంగా తయారైన డీపీఆర్ కాపీ 'ఆంధ్రజ్యోతి'కి

మిగతా 13వ పేజీలో...

ఎమ్మెల్యేలకూ డీసీసీ పదవులు!

అవసరమనుకున్న చోట ఇస్తాం

ఒకే కుటుంబంలో ఇద్దరికి పదవులూ తప్పు కాదు

సమన్వయ లోపంతోనే మంత్రుల మధ్య వివాదాలు

కొండా సురేఖ కుమార్తె మాట్లాడిన విధానం ఆక్షేపణీయం

కవిత యాత్రను స్వాగతిస్తున్నాం

పదేళ్ల పాపపు పాలనలో ఆమె భాగస్వామ్యాన్ని ప్రశ్నిస్తున్నాం

జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్సే

ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



న్యూఢిల్లీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష (డీసీసీ) పదవులకు ఎమ్మెల్యేలకు కూడా పోటీ పడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. అయితే స్థానిక పరిస్థితులను బట్టి వారికి ఆ పదవులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఇతర పదవుల్లో ఉన్నవారికి డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వబోమని చెప్పిన విషయం వాస్తవమేనని, కానీ.. ఆ పరిధిలోకి ఎమ్మెల్యేలు రారని అన్నారు. అన్ని అర్హతలు ఉన్నవారికే అవకాశం వస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలో

మిగతా 13వ పేజీలో...

'చిత్రపురి'పై విచారణ

ఎప్పుడో!?

హౌసింగ్ సొసైటీలో అవకతవకలు!



అధికారంలోకి వస్తే విచారణ జరిపిస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్

రంగంలోకి దిగిన ఇద్దరు ఫిల్మ్‌చాంబర్ సభ్యులు!

చిత్రపురి సొసైటీ సభ్యులను కాపాడే యత్నం

వ్యక్తిగత లబ్ధి కోసం సంస్థలను వాడుకుంటున్నారు!

ఫైనాన్షియర్ నుంచి 22 కోట్లు తీసుకున్న సొసైటీ

45 అంతస్తుల 'సఫైర్ సూట్' నిర్మిస్తున్నట్లు ప్రకటన

ఫ్లాట్ల విక్రయాలతో అప్పులు తీర్చవచ్చని యోచన

ఆ భవనానికి అనుమతులు రద్దు చేసిన హైడ్రా?

22 కోట్లకు మధ్యవర్తిగా ఉన్న ఫిల్మ్‌చాంబర్ సభ్యుడు

అతనికి ఇబ్బంది ఉండకూడదనే ఎన్నికల్లో జాప్యం?

(సినిమా డెస్క్)

చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీ.. ఇది సినీ కార్మికులు తమ కోసం ఏర్పాటు చేసుకున్న గృహ సముదాయానికి సంబంధించిన సంస్థ. ఫిల్మ్ చాంబర్.. ఇది సినీ రంగ ప్రముఖులు ఏర్పాటు చేసుకున్న స్వీయ నియంత్రణ విభాగం. అలాంటి ఈ రెండు సంస్థలకు మధ్య సంబంధం ఏంటి? వాస్తవానికి సినీ పరిశ్రమ ప్రయోజనాలు తప్ప ఈ రెండింటి మధ్య ఇతర సంబంధాలు ఉండకూడదు. కానీ, ఈ రెండు పాలక మండళ్లకు చెందిన కొందరు సభ్యుల మధ్య ఉన్న అవినాభావ సంబంధాల వల్ల చాంబర్ ఎన్నికలు జాప్యం అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అలాగే హౌసింగ్ సొసైటీ అక్రమాలపై విచారణ జరగకుండా చాంబర్ సభ్యులు కొందరు రంగంలోకి దిగారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఒకప్పటి తెలుగు సినిమాల్లో ఒక రాజకీయ నాయకుడు, ఒక న్యాయవాది, ఒక వాణిజ్యవేత్త కలిసి ముఠాగా ఏర్పడి విలనిజం చేసేవారు. సమాజాన్ని ప్రభావితం చేసే ఆయా వర్గాల ప్రముఖులందరూ కలిసిపోతే ప్రజలకు ఎలాంటి హాని జరుగుతుందో చెప్పడానికి దర్శకులు సినిమాల్లో వారి పాత్రలను చూపించేవారు. ఇప్పుడు చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీ, ఫిల్మ్ చాంబర్‌ల మధ్య నెలకొన్న సంబంధాలు కూడా ఇలాంటివేనని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు ఈ రెండు సంస్థలనూ వాడుకుంటున్నారని చెబుతున్నారు. చిత్రపురి హౌసింగ్ సొసైటీ ఒక బ్యాంకు

మిగతా 12వ పేజీలో...



రష్యా అమ్ములపొదిలో

అణు క్రూయిజ్ క్షిపణి

అణు శక్తితో అనంత దూరాలకు దూసుకెళ్లే బురే వెస్నిక్

పరీక్షలో 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణం

ప్రపంచంలో మరే దేశం వద్దా ఇలాంటిది లేదన్న పుతిన్

మాస్కో, అక్టోబరు 26: ప్రపంచంలోనే తొలిసారిగా.. అణు శక్తితో దూసుకెళ్లే క్రూయిజ్ క్షిపణిని రష్యా పరీక్షించింది! ప్రపంచంలో ఏ మూలనున్న లక్ష్యాన్నైనా ఛేదించే (అన్‌లిమిటెడ్ రేంజ్) సత్తా ఉన్న ఆ క్షిపణి పేరు.. 9ఎం730 బురే వెస్నిక్. ఈ క్షిపణిని లాంచ్ చేయడానికి సంప్రదాయ ఇంజిన్‌నే వాడతారు. అనంతరం అందులోని చిన్న అణు రియాక్టర్ ఉత్తేజితమై.. దానికి 'దాదాపు అనంత దూరం' ప్రయాణించే శక్తినిస్తుంది! దీని తుది పరీక్షను ఆదివారం విజయవంతంగా నిర్వహించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. "ప్రపంచంలో మరెవరి వద్దా లేని అద్భుతమైన సృష్టి ఇది" అని ఆయన సగర్వంగా పేర్కొన్నారు. ఈ క్షిపణిని రష్యా సాయుధ దళాల అమ్ములపొదిలో చేర్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని

మిగతా 2వ పేజీలో...

నిజాం దురాగతాలపై కుమ్రం భీమ్ పోరు

తరతరాలకూ స్ఫూర్తిదాయకం

2

'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

నిర్లక్ష్యంగా ఉంటే ఇంటికే!

మొన్న రామగుండం, నిన్న ఎంజీఎం సూపరింటెండెంట్లపై చర్యలు

అలసత్వం ప్రదర్శిస్తున్న వారిపై వేటు

ఇటీవలి కాలంలో ఏడుగురు సూపరింటెండెంట్లపై చర్యలు

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమంటూ సంకేతాలు

వణుకుతున్న సూపరింటెండెంట్లు

ఏళ్లుగా పాతుకుపోయిన ఉద్యోగులపైనా వైద్యశాఖ దృష్టి



హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సేవలందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆస్పత్రుల సూపరింటెండెంట్లపై సర్కారు సీరియస్‌గా ఉంది. ఇలాంటి వారిపై చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇటీవలి కాలంలోనే ఏకంగా ఏడుగురు బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లకు వైద్య ఆరోగ్యశాఖ షాక్ ఇచ్చింది. విధి నిర్వహణలో అలసత్వం, అవినీతి ఆరోపణలు, రోగుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, ఆస్పత్రుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వంటి కారణాలలో వారిపై చర్యలు తీసుకుంది. కొందరిని సస్పెండ్ చేయగా.. మరి కొందరికి ఎలాంటి పోస్టింగ్‌లు ఇవ్వకుండా పక్కనపెట్టింది. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమంటూ సర్కారు సంకేతాలిచ్చింది. ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే ఇంటికి పంపుతామన్న గట్టి హెచ్చరిక

మిగతా 13వ పేజీలో...

బ్యాంకాక్ టు హైదరాబాద్

హైడ్రోపోనిక్ గంజాయి

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 4.15 కిలోలు స్వాధీనం

3 నెలల వ్యవధిలో రాష్ట్రంలో ఐదు కేసులు

రూ.53 కోట్ల విలువైన 53 కిలోల గంజాయి సీజ్

జూలైలో ఓ మహిళ వద్ద 40 కోట్ల సరుకు స్వాధీనం

మహిళలను కొరియర్లుగా వాడుతున్న ముఠాలు

హైదరాబాద్, శంషాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హైడ్రోపోనిక్ గంజాయి.. మార్కెట్‌లోకి వచ్చిన కొత్త రకం గంజాయి. ఇటీవల కాలంలో విదేశాల నుంచి హైదరాబాద్‌కు అధికంగా రవాణా అవుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైడ్రోపోనిక్ గంజాయితో ప్రయాణికులు పట్టుబడుతున్న కేసులు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నుంచి శనివారం రాత్రి వరకు.. మూడు నెలల వ్యవధిలో హైడ్రోపోనిక్ గంజాయితో ఐదుగురిని శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.53.35 కోట్ల

మిగతా 14వ పేజీలో...



కుమ్రం భీమ్ జిల్లాలో పత్తి చేనులో సాగు చేస్తున్న గంజాయి(ఫైల్)

14

పత్తి చేలలో గంజాయి!

మహారాష్ట్ర సరిహద్దులోని గ్రామాల్లో అంతరపంటగా సాగు చేస్తున్న రైతులు

పోలీసుల తనిఖీలు.. 57 కేసులు

టీచర్లు 1000.. విద్యార్థులు '0'

» తెలంగాణలో 2వేల స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్

» 2024-25 విద్యా సంవత్సరం గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ప్రభుత్వ విద్య ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావాలని ఓవైపు అందరూ కోరుకుంటుంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులే చేరని పరిస్థితి మరోవైపు నెలకొంటోంది. 2024-25 విద్యా సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 7,993 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయితే ఈ పాఠశాలల్లో ఏకంగా 20,817 మంది ఉపాధ్యాయులు నియమితులైనట్లు తెలిపింది. ఇందులో విద్యార్థులు ఒక్కరు కూడా చేరని (జీరో ఎన్‌రోల్‌మెంట్) స్కూళ్లు దేశంలోనే అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 3,812 ఉండగా, ఆ తరువాత స్థానంలో తెలంగాణలో 2,245 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఉన్నాయి. ఇక ఇలాంటి స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయుల సంఖ్య కూడా అత్యధికంగా (17,965) బెంగాల్‌లోనే ఉంది. ఈ విషయంలోనూ తెలంగాణ రాష్ట్రం 1,016 మంది ఉపాధ్యాయులతో రెండోస్థానంలో ఉంది. కాగా, విద్యార్థులు చేరని స్కూళ్లలో తెలంగాణ తరువాతి స్థానాల్లో వరుసగా హరియాణా, మహారాష్ట్ర, గోవా, అసోం, హిమాచల్‌ప్రదేశ్ ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర ఉన్నాయి. అయితే 2023-24 విద్యాసంవత్సరంలో దేశవ్యాప్తంగా ఇలాంటి స్కూళ్లు 12,954 ఉండగా, 2024-25 నాటికి ఇవి సుమారు 5వేలు తగ్గిపోవడం కొంత ఊరటగా భావిస్తున్నారు. అయితే కేంద్రపాలిత ప్రాంతాల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లే లేకపోవడం గమనార్హం. ఢిల్లీలోనూ ఇలాంటి ప్రభుత్వ పాఠశాల ఒక్కటి కూడా లేదు.

దేశవ్యాప్తంగా 'సర్'పై నేడు ఈసీ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై వివరాలు వెల్లడించేందుకు సోమవారం సాయంత్రం ఎన్నికల కమిషన్(ఈసీ) విలేకరుల సమావేశం నిర్వహించనుంది. మొదటి దశలో 10-15 రాష్ట్రాలకు సంబంధించిన 'సర్' జరగనుండగా అందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రకటించనుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పాండిచ్చేరి సహా ఇతర రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. నవంబరు ఒకటో తేదీన 'సర్' ప్రారంభం కానుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, ఇతర ప్రత్యేక పరిస్థితులు ఉన్న చోట్ల ప్రస్తుతానికి ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయనుంది.

ఐదేళ్ల తర్వాత భారత్-చైనా మధ్య విమానాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఐదేళ్ల విరామం తర్వాత భారత్-చైనా మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులు ఆదివారం రాత్రి నుంచి పునఃప్రారంభం అయ్యాయి. కోల్‌కతా నుంచి చైనాలోని గ్వాంగ్‌జౌ మార్గంలో మొదటి ఇండిగో విమాన సర్వీసు ప్రారంభమైంది. నవంబర్ 9నుంచి షాంఘై-న్యూఢిల్లీ మార్గంలో చైనా ఎయిర్‌లైన్స్ విమాన సేవలు మొదలవనున్నాయి. ఈ పరిణామం రెండు దేశాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, వ్యాపార సంబంధాలను మరింత పెంచడానికి దోహద పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొవిడ్-19, అలాగే 2020జూన్‌లో జరిగిన గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించాయి. గత ఏడాదిగా ద్వైపాక్షిక సంబంధాలు క్రమంగా మెరుగుపడడంతో సరిహద్దు ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి.

మూడు మీడియా పర్యవేక్షక సంస్థల ఏకీకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 26 : మూడు మీడియా పర్యవేక్షక సంస్థలు(రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(గతంలో డీఏవీపీ), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో.. ఈ మూడింటిని ఏకీకృతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ప్రభుత్వ సమాచారం అందించడంలో మరింత బాధ్యతాయుత వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని భావిస్తోంది. మీడియాకు కచ్చితమైన సమాచారం అందించడం, అలాగే ప్రాంతీయ మీడియాకు కూడా వేగంగా సమాచారం, సందర్భోచిత వివరాలు అందించడమే ఈ వ్యవస్థ ఏర్పాటు లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన కసరత్తు 6 నెలల్లో అది పూర్తవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని మీడియాల(ప్రింట్, టీవీ, డిజిటల్) వారికి ప్రభుత్వం విడుదల చేసే పత్రికా ప్రకటనలు, విధానాల సంక్షిప్త సమాచారం, మల్టీ మీడియా కంటెంట్, ధ్రువీకరించిన గణాంకాలు అందుబాటులోకి తెచ్చే సింగిల్ విండో విధానంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందన్నారు.

దేశంలో 22 నకిలీ వర్సిటీలు: యూజీసీ


న్యూఢిల్లీ, అక్టోబరు 26: దేశంలో 22 నకిలీ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని యూజీసీ హెచ్చరించింది. ఆయా యూనివర్సిటీల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఢిల్లీలోని కోట్ల ముబారక్‌పూర్‌లో ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ సంస్థకు ఇప్పటికే పలు దఫాలు హెచ్చరికలు జారీ చేసినట్టు పేర్కొంది. 22 నకిలీ వర్సిటీల జాబితాను వెలువరించింది. వీటిలో 9 నకిలీ విశ్వవిద్యాలయాలు ఢిల్లీలోనే ఉన్నాయని, ఐదు యూపీలో ఉన్నాయని తెలిపింది. తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్(ఏపీ), కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, పుదుచ్చేరి ఉన్నట్టు వివరించింది. యూజీసీ చట్టంలోని సెక్షన్ 2(ఎఫ్), 3 కింద గుర్తింపు పొందిన సంస్థల్లోనే విద్యార్థులు చేరాలని పేర్కొంది.

ఉన్నత విద్యకు కేంద్రం పంచవర్ష ప్రణాళిక

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దేశంలోని ఉన్నత విద్యాసంస్థలను మరింతగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. దీనిలో ప్రధానంగా ఐదు లక్ష్యాలను నిర్దేశించనుంది. 1) విద్యార్థుల సంఖ్యను మరింత పెంచడం. 2) ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం. 3) అంతర్జాతీయ అనుసంధానాన్ని పెంపొందించడం. 4) విద్య నాణ్యతను మరింత పెంచడం. 5) డిజిటల్ వ్యవస్థకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం. ఈ ఐదు లక్ష్యాలను సాధించడం ద్వారా ఉన్నత విద్యాసంస్థలలో మరింత మెరుగైన అభివృద్ధిని సాధించవచ్చని కేంద్రం భావిస్తోంది. అంతేకాదు.. రాష్ట్రాల వారీగా ఈ లక్ష్యాలను సాధించిన వారికి సామర్థ్యం ఆధారిత నిధులను కూడా ఇవ్వనుంది. ఈ నిధులను భవనాల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటు, నిర్వహణ, సాఫ్ట్‌వేర్, ఫ్యాకల్టీలకు వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది.

వచ్చే నెల మొదటి వారంలో పీఎం కిసాన్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: కేంద్ర ప్రభుత్వం పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి యోజన 21వ విడత నిధులను నవంబరు మొదటి వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం ద్వారా సుమారు 8.5 కోట్ల మంది అర్హులైన రైతులకు రూ.2,000 చొప్పున అందించనుంది. ఈ డబ్బులు తమ బ్యాంకులో జమ కావాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తిచేయాలి. అంతేకాక, రైతులు తమ భూమి వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడంతో పాటు ఆధార్ నంబరును బ్యాంకు ఖాతాకు లింక్ చేయించుకోవడం తప్పనిసరి. నిధులను నేరుగా రైతుల ఖాతాలలో జమ చేయనున్నారు.



తలపై సీ స్పాంజ్‌తో ఓ మగ డాల్ఫిన్

నాకొక గర్ల్ ఫ్రెండ్ కావాలే..!

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఆడపిల్లల దృష్టిలో పడటం కోసం అబ్బాయిలు ఎన్నో పాట్లు పడినట్లే.. ఆస్ట్రేలియాలో ఆడ డాల్ఫిన్లకు నచ్చడం కోసం మగ డాల్ఫిన్లు తలపై రంగురంగుల 'విగ్గులు, నాచు కిరీటాలను' పెట్టుకొని వాటి వెంట తిరుగుతున్నాయి. చదవడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమే. ఆస్ట్రేలియాలోని ఉత్తర తీరంలో పిల్బారా, కింబర్లీ ప్రాంతాల్లో మగ డాల్ఫిన్లు తమ తలపై సముద్రపు నాచు(సీ స్పాంజ్)ను అలంకారంగా పెట్టుకొని ఆడ డాల్ఫిన్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆస్ట్రేలియా జీవ వైవిధ్య సంరక్షణ, ఆకర్షణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త హోలీ రాడినో, ఆమె బృందం గుర్తించారు. డాల్ఫిన్లలో ఇలాంటి వింత ప్రవర్తనను మరెక్కడా తాము గమనించలేదని చెప్పారు.

కుమ్రం భీమ్ పోరాటం

తరతరాలకు స్ఫూర్తిదాయకం

» 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ/ఆసిఫాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నిజాం దురాగతాలపై యోధుడు కుమ్రం భీమ్ పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. కుమ్రం భీమ్ తన ధైర్యం, త్యాగంతో లక్షలాది మంది హృదయాలపై ముఖ్యంగా గిరిజన సమాజంపై చెరగని ముద్ర వేశారన్నారు. కుమ్రం భీమ్ 40 సంవత్సరాలు మాత్రమే జీవించినా.. ఆయన జీవితం ఎన్నో పాఠాలను నేర్పుతుందని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రధాని తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 127వ ఎపిసోడ్‌లో 'జల్, జంగల్, జమీన్ హమారా' నినాదం కోసం ప్రాణాలర్పించిన ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం గురించి ప్రస్తావించి నివాళులర్పించారు. "నేను ఇప్పుడు మిమ్మల్ని గతకాలపు జ్ఞాపకాల్లోకి తీసుకెళతాను. 20వ శతాబ్ద ప్రారంభాన్ని ఊహించుకోండి! అప్పుడు స్వాతంత్ర్యం వస్తుందనే ఆశ కనుచూపు మేరలో లేదు. బ్రిటీష్ వారు భారతదేశం అంతటా అడ్డూఅదుపు లేకుండా దోపిడీ సాగిస్తున్నారు. హైదరాబాద్ ప్రజలకు అణచివేత కాలం మరింత భయంకరం. క్రూరమైన, నిర్దయుడైన నిజాం దురాగతాలను కూడా వారు భరించవలసి వచ్చింది. పేదలు, అణగారిన వర్గాలు, ఆదివాసీలపై దౌర్జన్యాలు వర్ణనాతీతం. వారి భూములను లాక్కున్నారు. భారీగా పన్నులు విధించారు. ఈ అన్యాయాన్ని నిరసించిన వారి చేతులను నరికి వేశారు. ఈ దురాగతాలకు వ్యతిరేకంగా 20 ఏళ్ల యువకుడు నిలబడ్డాడు. ఆ పేరు చెప్పే ముందు అతని ధైర్యం గురించి నేను మీకు చెబుతాను. నిజాంకు వ్యతిరేకంగా ఒక్కమాట మాట్లాడటం కూడా నేరంగా పరిగణించే ఆ రోజుల్లో సిద్ధిఖీ అనే నిజాం అధికారిని ఆ యువకుడు బహిరంగంగా సవాలు చేశాడు. రైతుల పంటలను జప్తు చేయడానికి సిద్ధిఖీని నిజాం పంపాడు. కానీ అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సిద్ధిఖీని ఆ యువకుడు చంపాడు. నిజాం ప్రభుత్వ పోలీసుల నుంచి తప్పించుకుని వందల కిలోమీటర్ల దూరంలోని అసోంకు చేరుకున్నాడు. 1940లో ఆయనను నిజాం మనుషులు హత్య చేశారు. ఆ గొప్ప వ్యక్తి పేరు కుమ్రం భీమ్. ఈ నెల 22న ఆయన జయంతిని జరుపుకున్నాం. కుమ్రం భీమ్ ఎక్కువ కాలం జీవించలేదు. కానీ తన జీవితకాలంలో అసంఖ్యాక ప్రజల హృదయాలపై.. ముఖ్యంగా ఆదివాసీ సమాజంపై చెరగని ముద్ర వేశారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో కొత్త శక్తిని నింపారు" అని ప్రధాని అన్నారు. వచ్చే నెల 15న మనం 'ఆదివాసీ గౌరవ దినోత్సవం' నిర్వహించుకోనున్నామని చెప్పారు. "ఇది భగవాన్ బిర్సా ముండా జయంతి శుభ సందర్భం. దేశ స్వాతంత్ర్యం కోసం, ఆదివాసీ సమాజ హక్కుల కోసం ఆయన చేసిన కృషి సాటిలేనిది" అంటూ నివాళులర్పించారు.



ఆసియాన్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొని ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

21వ శతాబ్దం భారత్-ఆసియాన్ దేశాలదే

ఇరవైఒకటో శతాబ్దం భారత్-ఆసియాన్ దేశాలదేనని మోదీ చెప్పారు. ఆసియాన్ దేశాల విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు ఒకటేనన్నారు. రాబోయే తరాలకు సమృద్ధికరమైన, ఉజ్వలమైన భవిష్యత్ అందించే దిశగా చర్యలు తీసుకుందామన్నారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆసియాన్ దేశాల సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ జనాభాలో నాలుగో వంతు ఆసియాన్ దేశాల్లోనే ఉన్నారని, భారత్-ఆసియాన్ దేశాలు భౌగోళికంగానే కాక ఉమ్మడి చారిత్రక విలువలు, కలిగి ఉన్నాయన్నారు. భారత్-ఆసియాన్ దేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముందడుగు వేస్తున్నాయని, ఈ భాగస్వామ్యం ప్రపంచ సుస్థిర అభివృద్ధికి బలమైన పునాదిగా మారుతుందని మోదీ చెప్పారు. ప్రతి విపత్తులోనూ ఆసియాన్ దేశాలకు భారత్ అండగా ఉందన్నారు.

వందేమాతర గీతం 150 ఏళ్ల వేడుకలు

వందేమాతర గీతం భారతీయుల్లో నిరంతరం దేశభక్తిని, ఐక్యతను నింపుతూ ఉంటుందని, అది భారతీయతకు శక్తిమంతమైన చిహ్నమని మోదీ అన్నారు. వందేమాతరం అనే ఒక్కపదమే మన గుండెల్లో ఎన్నో భావోద్వేగాలను కలిగిస్తుందని, శక్తినిచ్చి భరతమాత బిడ్డలుగా మన బాధ్యతలను గుర్తుచేస్తుందని చెప్పారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతర గీతం వచ్చే నెల 7వ తేదీతో ఈ ఏడాది 150వ ఏట అడుగిడుతుందని, ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఆపరేషన్ సిందూర్'తో ఈ ఏడాది పండుగలు మరింత ఘనంగా జరిగాయన్నారు. భారతీయ కాఫీ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ సంపాదించుకుంటోందన్న మోదీ.. ఒడిసాలోని కోరాపుట్ సహా అనేక ప్రాంతాలను ప్రస్తావించారు.

ఎస్‌సీవో సదస్సు వేళ.. మోదీపై హత్యాయత్నం.. భగ్నం?

» భారత్, రష్యా సంయుక్త ఆపరేషన్!

» 'మాతృభూమి' వార్తా సంస్థ కథనం

» సోషల్ మీడియాలోనూ వైరల్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దాదాపు రెండు నెలల క్రితం చైనాలో 'షాంఘై సహకార సంస్థ' సదస్సు జరిగిన సమయంలో.. ప్రధాని మోదీపై హత్యాయత్నం జరిగిందా? దాని వెనుక అమెరికా హస్తం ఉందా? భారత్, రష్యా గూఢచార సంస్థలు ఆ కుటిల యత్నాన్ని భగ్నం చేశాయా? ...నాలుగైదు రోజులుగా సోషల్ మీడియాలో ఇవే అంశాలతో కూడిన ఒక కథనం విస్తృతంగా వైరల్ అవుతోంది. కేరళకు చెందిన 'మాతృభూమి' వార్తాసంస్థ కూడా ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించడం గమనార్హం. ఆ కథనం ప్రకారం ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన మోదీ ఆగస్టు 31న టియాన్జిన్‌లో ఉన్నప్పుడు ఢాకాలోని ఒక హోటల్‌లో.. అమెరికాకు చెందిన ప్రత్యేక దళాల అధికారి టెర్రెన్స్ జాక్సన్ అనుమానాస్పద స్థితిలో మరణించారు. బంగ్లాదేశ్ సేనలకు శిక్షణ ఇచ్చేందుకు ఆయన అక్కడకు వచ్చినట్టు అధికారికంగా రికార్డుల్లో ఉన్నప్పటికీ.. భారతదేశ ప్రధాన నాయకత్వంపై దాడి జరిగే ప్రమాదం ఉందంటూ నిఘా వర్గాలకు ఉప్పందిన సమయంలో జాక్సన్ ఢాకాలో ప్రత్యక్షం కావడం రకరకాల అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలోనే మన రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా), రష్యా 'ఫారిన్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్‌వీఆర్)' కలిసి ఉమ్మడిగా కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆపరేషన్ చేపట్టాయని 'మాతృభూమి' వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. అటు చైనాలో.. రష్యా అధ్యక్షుడు పుతిన్ మోదీని తన కారులో కూర్చోబెట్టుకుని దాదాపు గంటసేపు చర్చించారు. ఆ సమయంలో కారులో వారిద్దరు మాత్రమే ఉన్నారు. ఒకరు చెప్పే మాటలను మరొకరికి అనువదించడానికి దుబాసీలు కూడా లేరు. ఆ సమయంలో పుతిన్.. తమ నిఘా వర్గాల సమాచారాన్ని మోదీకి తెలియజేశారని 'మాతృభూమి' కథనం. ఆ సదస్సు నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన మోదీ.. సమీకాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్నప్పుడు చప్పట్లు కొడుతున్న ఆహూతులను ఉద్దేశించి.. 'నేను (చైనాకు) వెళ్లినందుకు చప్పట్లు కొడుతున్నారా? లేక తిరిగొచ్చినందుకా?' అని నవ్వుతూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారని ఆ కథనంలో గుర్తుచేసింది. కనిపించని ఆపదలను తాను తప్పించుకున్నానే విషయాన్ని ప్రధాని అలా సంకేత భాషలో వివరించారని పేర్కొంది.



టెట్ నుంచి మినహాయించండి

» 2011కు ముందు నియమితులైన టీచర్ల డిమాండ్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని 2011 జూలై 27కు ముందు నియమితులైన టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా టీచర్లు వచ్చే నెల 21న ఢిల్లీలో మెగా ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు మెమోరాండం సమర్పించనున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో మెగా ర్యాలీ నిర్వహించనున్నట్టు భారత ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు దినేశ్ చంద్ర శర్మ వెల్లడించారు. 2011 జూలై 27కు ముందు నియమితులైన టీచర్లకు టెట్ తప్పనిసరి చేయడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఏ చట్టాన్ని అయినా అమల్లోకి వచ్చిన తేదీ నాటి నుంచి అమలు చేయాలని, అంతకుముందు నుంచి వర్తింపజేయడం సరికాదన్నారు.

యూపీలో బస్సుకు మంటలు

లఖ్‌నవూ, అక్టోబరు 26: యూపీలో ఓ ప్రైవేటు ఏసీ స్లీపర్ బస్సు మంటల్లో చిక్కుకుంది. ఢిల్లీ నుంచి లఖ్‌నవూ మీదుగా గోండాకు 70మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆగ్రా- లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వేపై రెవ్రీ టోల్‌ప్లాజాకు 500 మీటర్ల దూరంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మంటలను గమనించిన బస్సు డ్రైవర్, కండక్టర్ వెంటనే అప్రమత్తమై ప్రయాణికులందరినీ కిందికి దించివేయడంతో పెను ప్రమాదం తప్పింది. వారందరూ ప్రాణాలతో బయటపడ్డారు. మొదట బస్సు చక్రాలకు అంటుకున్న మంటలు తర్వాత బస్సు మొత్తం వ్యాపించినట్లు బస్సు డ్రైవర్ జగత్ సింగ్ తెలిపాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మునీర్, షరీఫ్ గొప్పవాళ్లు

» మలేసియా పర్యటనలో ట్రంప్ ప్రశంస



కౌలాలంపూర్, అక్టోబరు 26: పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గొప్పవాళ్లని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీర్తించారు. పాక్-అఫ్గాన్ సంక్షోభాన్ని తాను సునాయాసంగా పరిష్కరించగలనని చెప్పారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో భాగంగా థాయ్‌లాండ్-కాంబోడియా దేశాల మధ్య శాంతి ఒప్పందంపై సంతకాల వేళ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తాను 8 నెలల్లో నెలకొకటి చొప్పున మొత్తం 8 యుద్ధాలు ఆపానని చెప్పారు. ఇప్పటివరకు ఏ ఇతర అమెరికా అధ్యక్షుడు కూడా ఒక్క యుద్ధం కూడా ఆపలేదన్నారు. మిగతా అధ్యక్షులు యుద్ధాలు చేస్తే తాను యుద్ధాలు ఆపి లక్షల మంది ప్రాణాలు కాపాడానని చెప్పారు. చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని, భవిష్యత్తులో కూడా జరిగే అవకాశం లేదన్నారు. అంతకుముందు ఆసియాన్ సదస్సులో పాల్గొనేందుకు కౌలాలంపూర్‌కు చేరుకున్న ట్రంప్‌నకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తనను ఆహ్వానించేందుకు ఎయిర్‌పోర్ట్‌లో ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య బృందాన్ని చూసి ట్రంప్ ఆగలేకపోయారు.వారి దగ్గరకు వెళ్లి హుషారుగా స్టెప్పులేశారు. మలేసియా ప్రధాని కూడా స్టెప్పులేశారు.

భారత్‌తో బంధాన్ని పణంగా పెట్టం

» పాక్‌తో సంబంధాలపై రుబియో

వాషింగ్టన్, అక్టోబరు 26: పాకిస్థాన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్‌తో తమకు ఉన్న బంధాన్ని పణంగా పెట్టబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు పాక్ ఓ స్వర్గమని పేర్కొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇటీవల ఆ దేశానికి మరింత దగ్గరవుతున్నారు. పాక్‌తో వరుస ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా, పాక్‌కు దగ్గరవుతుండడంపై భారత్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమవ్వడం లేదా ? అంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు మార్కో రుబియో స్పందించారు. దౌత్యపరమైన విధానాల్లో భారత్ చాలా పరిణితి చెందిన దేశమన్న రుబియో.. భారత్ నుంచి తమకు ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు.

రష్యా అమ్ములపొదిలో అణు క్రూయిజ్ క్షిపణి

(మొదటిపేజీ తరువాయి)

సైనికాధికారులను ఆదేశించారు. పరీక్షల్లో భాగంగా అక్టోబరు 21న బురేవెస్నిక్‌ను ప్రయోగించగా.. అది 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించిందని రష్యా మిలటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వెలెరీ గెరాసిమోవ్ తెలిపారు. 14 వేల కిలోమీటర్లు దాని గరిష్ఠ పరిధి కాదని.. బురేవెస్నిక్ సాంకేతిక సామర్థ్యాలు ఎంత గొప్పవంటే ప్రపంచంలో ఎంత దూరంలో, ఎంత సురక్షిత ప్రదేశంలో ఉన్న లక్ష్యాన్నైనా అది గురితప్పకుండా ఛేదించగలదని ఆయన వివరించారు. రష్యా వద్ద ఇప్పటి వరకూ ఉన్న క్రూయిజ్ క్షిపణుల్లో అత్యధిక రేంజ్ కలిగినది.. కేహెచ్-102 క్రూయిజ్ మిస్సైల్. దాని పరిధి 4500 కిలోమీటర్లు అంటే.. బురేవెస్నిక్ సత్తా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అణు ఇంధనంతో నడిచే శక్తి, వార్‌హెడ్ సామర్థ్యాలను కలిగిన ఈ క్షిపణి గురించి పుతిన్ 2018లోనే ప్రపంచానికి తొలిసారి తెలియజేశారు. బురేవెస్నిక్‌ను ఆయన అజేయమైన ఆయుధంగా అభివర్ణించారు. 50 నుంచి 100 మీటర్ల ఎత్తులో ప్రయాణించే ఈ క్రూయిజ్ క్షిపణిని గుర్తించి, అడ్డుకోవడం అత్యంత అధునాతనమైన క్షిపణి నిరోధక రక్షణ వ్యవస్థలకు సైతం చాలా కష్టమని వివరించారు.



పరీక్షల్లో ప్రమాదాలు..

ఈ క్షిపణిని అభివృద్ధి చేసి, పరీక్షించే క్రమంలో రష్యన్ శాస్త్రవేత్తలకు పలు సాంకేతిక సవాళ్లు ఎదురయ్యాయి. 2016 నుంచి ఈ క్షిపణిని పదిసార్లకు పైగా పరీక్షించారు. 2019 ఆగస్టులో నెనోక్సా వద్ద నిర్వహించిన రికవరీ ఆపరేషన్ (అంటే క్షిపణి పరీక్ష అనంతరం దాని భాగాలను సేకరించే) సమయంలో పేలుడు సంభవించి ఏడుగురు శాస్త్రజ్ఞులు చనిపోయారు. సెవరోడ్‌విన్స్క్ ప్రాంతంలో రేడియేషన్ స్థాయిలు పెరిగాయి. ఆ తర్వాత 2021, 2022, 2023లో దీన్ని పలుమార్లు పరీక్షించారు. ఇప్పటికే రష్యా వద్ద ఉన్న పొసెయిడాన్ అణు టార్పెడోతో ఇది కూడా కలిస్తే.. ఆ దేశ సెకండ్ స్ట్రైక్ క్యాపబిలిటీస్ పెరుగుతాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. రష్యా భూభాగంలోని ఏ బేస్ నుంచి ప్రయోగించినా అది అమెరికాలోని ఏ లక్ష్యాన్నైనా చేరుకోగలదని 'ద ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్)' తెలిపింది.

మయన్మార్ సైబర్‌క్రైమ్ స్థావరం నుంచి వందలమంది భారతీయులు పరార్

న్యూఢిల్లీ/బ్యాంకాక్, అక్టోబరు 26: మయన్మార్‌లోని సైబర్‌క్రైమ్ అడ్డాల నుంచి థాయిలాండ్‌కు పారిపోయిన వెయ్యిమందిలో వందలాది మంది భారతీయులు కూడా ఉన్నట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో సైబర్ ముఠాలకు అడ్డాగా మారిన కేకే పార్క్‌లో సైన్యంతో సోదాలు చేయించనున్నట్టు గత సోమవారం మయన్మార్‌లోని జుంటా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బుధ-శుక్రవారాల మధ్య మయన్మార్ నుంచి సరిహద్దు గుండా థాయిలాండ్‌లోకి వెయ్యిమందికిపైగా పారిపోయారు. వీరంతా థాయిలాండ్‌లోని కరేన్ రాష్ట్రం మాయిసోట్ జిల్లాలోకి ప్రవేశించారు. వారిలో 399 మంది భారతీయులు, 147 మంది చైనీయులు, 31 మంది థాయిలాండ్ జాతీయులు కూడా ఉన్నట్టు థాయిలాండ్‌కు చెందిన ఖావ్‌సోద్ దినపత్రిక ప్రచురించింది. దీన్ని థాయిలాండ్ అధికారులు కూడా నిర్ధారించారు. మయన్మార్‌లో కేకే పార్క్ వంటి విశాలమైన కాంపౌండ్‌ల అడ్డాగా సైబర్ ముఠాలు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నాయి. ఈ కాంపౌండ్‌లలో వేలాది మంది పనిచేస్తున్నారు. వీరిలో కొందరిని ఉద్యోగం పేరిట రప్పించి సాయుధ సిబ్బంది పర్యవేక్షణలో నిర్బంధంగా సైబర్ నేరాలు చేయిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్నవారిలో వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇథియోపియా, పాకిస్థాన్, ఇండోనేసియా, నేపాల్ జాతీయులు కూడా ఉన్నారు. ఈ ఏడాది మార్చిలోనూ మయన్మార్-థాయిలాండ్ సరిహద్దు వెంబడి సైబర్ అడ్డాలపై దాడులు చేసి కాపాడిన 549 మంది పౌరులను భారత్ రెండు మిలిటరీ విమానాల్లో తీసుకువచ్చింది.

రష్యాలో భారత్ యూరియా కర్మాగారం

» నిర్మించాలని ఎరువుల కంపెనీల ప్రతిపాదన

» పుతిన్ పర్యటనలో ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దేశంలో యూరియా కొరతను నివారించడానికి భారతీయ ఎరువుల తయారీ కంపెనీలు వినూత్నంగా ఆలోచించాయి. ముడిసరకు అధికంగా లభించే రష్యాలోనే ఏకంగా కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. యూరియా సరఫరాపై చైనా ఆంక్షలు విధించడంతో గుణపాఠం నేర్చుకున్న కంపెనీలు రష్యాలో తొలిసారిగా సొంతంగా కర్మాగారాన్ని నిర్మించనున్నాయి. రష్యాలో విస్తారంగా అమ్మోనియా, సహజవాయువు లభిస్తుండడంతో అక్కడే కర్మాగారాన్ని నిర్మించి యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని భావిస్తున్నాయి. ఈమేరకు ప్రభుత్వ రంగ సంస్థలైన రాష్ట్రీయ కెమికల్స్, ఫెర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్), నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్)లు రష్యన్ భాగస్వాములతో 'గుట్టు ఒప్పందా' (నాన్ డిస్క్లోజర్ అగ్రిమెంట్-ఎన్‌డీఏ)న్ని కుదుర్చుకున్నాయి. అంతా ఖరారయ్యే వరకు వివరాలను బహిర్గత పరచకూడదన్నది ఈ ఒప్పందం సారాంశం. ఏటా 20 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేసే సామర్థ్యం గల కర్మాగారం అక్కడ ఏర్పాటు కానుంది. స్థలం కేటాయింపు, అమ్మోనియా ధర నిర్ధారణ, రవాణా సౌకర్యాల కల్పనపై చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అమ్మోనియా, సహజ వాయువులను విదేశాల నుంచి దిగుమతి చేసుకొని దేశంలో యూరియాను తయారు చేస్తున్నారు. ముడిసరకు దిగుమతుల్లో ఇబ్బందులు వస్తే దాని ప్రభావం యూరియా లభ్యతపై కనిపిస్తోంది. ఇటీవల యూరియా, ఇతర ముడిసరకులపై చైనా ఆంక్షలు విధించడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో తగినంతగా దొరకక రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే రష్యాలో సొంతంగా కర్మాగారం నిర్మించుకోవడమే మేలని ప్రభుత్వ సంస్థలు భావిస్తున్నాయి.

కరోనా వ్యాక్సిన్‌తో క్యాన్సర్‌కు చెక్!

» ఎంఆర్ఎన్ఏ టీకాలు వేయించుకున్న క్యాన్సర్ పేషంట్ల జీవితకాలం పెరిగినట్టు తాజా అధ్యయనంలో వెల్లడి

వాషింగ్టన్, అక్టోబరు 26: కొవిడ్ సమయంలో అమెరికాలో విస్తృతంగా తీసుకున్న ఎంఆర్ఎన్ఏ టీకాలు.. క్యాన్సర్‌పై పోరాటంలో రోగనిరోధక వ్యవస్థకు ఊతమిస్తున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. చివరి దశల ఊపిరితిత్తుల క్యాన్సర్, చర్మ క్యాన్సర్ బాధితులకు ఇమ్యూనోథెరపీ ప్రారంభించిన 100 రోజుల్లోపు ఫైజర్ లేదా మోడెర్నా కంపెనీలు తయారుచేసిన కరోనా టీకా (ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్) వేస్తే.. వారి రోగనిరోధక వ్యవస్థ చికిత్సకు మరింత మెరుగ్గా స్పందించి వారి జీవితకాలం పెరుగుతోందని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఎండీ ఆండర్సన్ క్యాన్సర్ సెంటర్‌లకు చెందిన శాస్త్రజ్ఞులు తెలిపారు. "ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్.. శరీరంలోని రోగనిరోధక కణాలను మేల్కొలిపే యుద్ధ భేరిలాగా పనిచేస్తోంది. రోగనిరోధకశక్తికి లొంగని కణితులు.. దీనివల్ల ఇమ్యూన్ చికిత్సకు లొంగుతున్నాయి" అని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన డాక్టర్ ఆడమ్ గ్రిఫ్ఫిన్ తెలిపారు. నిజానికి వీరు ఈ పరిశోధన కరోనా టీకాలపై ప్రత్యేకంగా చేయలేదు. క్యాన్సర్లకు చెక్‌పెట్టే ఎంఆర్ఎన్ఏ టీకాల తయారీకి చాలాకాలంగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. గ్రిఫ్ఫిన్ బృందం ఇప్పటికే అందుబాటులో ఉన్న కరోనా(ఎంఆర్ఎన్ఏ) వ్యాక్సిన్ ప్రభావం ఆ టీకా తీసుకున్న క్యాన్సర్ పేషెంట్లపై ఏమైనా ఉందా అనే దిశగా అధ్యయనం చేయగా ఈ విషయం యాదృచ్ఛికంగా బయటపడింది. అధ్యయనంలో భాగంగా వారు ఇమ్యూనోథెరపీ తీసుకుంటున్న 1000 మంది క్యాన్సర్ పేషెంట్ల రికార్డులను పరిశీలించారు. వారిలో ఎంఆర్ఎన్ఏ టీకా తీసుకోనివారితో పోలిస్తే.. తీసుకున్నవారు రెట్టింపుకాలం జీవించినట్టు వెల్లడైంది.



పొదలకూరు మండలం మర్రిపల్లి వద్ద ఆగిన ట్రావెల్ బస్సు, ప్రయాణికులు

హడలెత్తించిన మరో రెండు బస్సులు

- ఒక బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో పొగలు
- లగేజీతో సహా దిగి ప్రయాణికుల పరుగులు
- రోడ్డుపక్కకు దూసుకెళ్లిన మరో బస్సు
- నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఘటనలు

పొదలకూరు, మార్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాద ఘటనను మరువక ముందే.. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మరో రెండు ప్రైవేట్ బస్సులు ప్రయాణికులను హడలెత్తించాయి. నెల్లూరు జిల్లా పొదలకూరు నుంచి శనివారం రాత్రి 11 గంటలకు 15 మంది ప్రయాణికులతో బెంగళూరుకు ప్రైవేటు ట్రావెల్ బస్సు బయలుదేరింది. అక్కడి నుంచి 3కి.మీ. దూరాన ఉన్న మర్రిపల్లిగ్రామం వద్దకు రాగానే బస్సులో నుంచి పొగలు, మాడిన వాసన వచ్చింది. ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో వెంటనే వారు తమ లగేజీలతో సహా కిందకు దిగి పరుగులు తీశారు. బ్యాటరీ వైర్ల షార్ట్‌సర్క్యూట్ వల్ల పొగలు వచ్చినట్లు డ్రైవర్ తెలిపారు. మరో బస్సును ఏర్పాటు చేసినా, ఆలస్యం కారణంగానూ, భయం తోనూ ప్రయాణికులు ఎవరూ ఎక్కలేదు. మరో ఘటనలో.. మార్కాపురం నుంచి రాయల్ వొయేజ్ (ఆర్‌వీటీ) ట్రావెల్ బస్సు ఏడుగురు ప్రయాణికులతో బెంగళూరుకు బయల్దేరింది. వేములకోట గ్రామం దాటిన తర్వాత కోమటికుంటకు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేశారు. దీంతో బస్సు అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దాటి ముందుభాగం పొలంలోకి వెళ్లింది. బస్సు బోల్తాపడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. లగేజీతో సహా దిగిపోయారు.

ఏడ్చిఏడ్చి.. ఇంకిన కన్నీళ్లు!

మృతదేహాల కోసం 48 గంటలకు పైగా నిరీక్షణ.. డీఎన్ఏ రిపోర్టు రావడంతో అప్పగింత

- ప్రత్యేక అంబులెన్సుల్లో స్వస్థలాలకు పంపిన ప్రభుత్వం
- 19వ మృతదేహం చిత్తూరు జిల్లా వాసిదిగా గుర్తింపు

కర్నూలు/కర్నూలు హాస్పిటల్, కుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతైన వారి కుటుంబీకులు ఏడ్చిఏడ్చి కన్నీళ్లు ఇంకిపోయాయి. 48 గంటలకుపైగా నిరీక్షణ అనంతరం అధికారులు వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం అందుతాయనుకున్న డీఎన్ఏ ఫలితాలు.. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవ మేరకు ఆదివారం ఉదయానికే రావడంతో.. వెంటనే మృతుల రక్త సంబంధీకులకు సమాచారం ఇచ్చారు. డీఎన్ఏ సరిపోల్చిన అనంతరం ఆదివారం మధ్యాహ్నం నుంచి మృతదేహాల అప్పగింత ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీ పరిసరాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైన బస్సు మంటల్లో సజీవదహనమైన వాళ్లను తలుచుకుంటూ విషాదంలో మునిగిపోయిన కుటుంబీకులు.. ఆ మృతదేహాలను చూసుకుని బిగ్గరగా రోదించారు. 'అన్నా.. నాన్న మృతదేహం తీసుకొని మేము బయలుదేరాం..' అంటూ ఒకరు... 'ఇప్పుడే అమ్మ, చెల్లి బాడీలను ఇచ్చారు. బయల్దేరి వచ్చేస్తున్నాం.. అంత్యక్రియలకు సిద్ధం చేయండి..' అంటూ మరొకరు ఫోన్లలో తమవాళ్లకు సమాచారం ఇచ్చుకున్నారు. ప్రభుత్వం సమకూర్చిన ప్రత్యేక అంబులెన్స్‌ల్లో మృతదేహాలను తీసుకుని కుటుంబీకులు, రక్త సంబంధీకులు స్వస్థలాలకు బయలుదేరారు. మృతదేహాల అప్పగింత ప్రక్రియను కర్నూలు జిల్లా కలెక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. కాగా తమిళనాడుకు చెందిన ప్రశాంత్ అనే యువకుడి మృతదేహాన్ని సోమవారం అప్పగించే అవకాశం ఉంది.


నెల్లూరు జిల్లా గోళ్లవారిపల్లికి చెందిన గోళ్ల రమేశ్, ఆయన భార్య అనుషా, కూతురు, కుమారుడు మాన్విత, శశాంక్‌ల మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

ఏపీ వాసులు వీరే..

నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లికి చెందిన గోళ్ల రమేశ్, ఆయన భార్య అనుషా, కూతురు, కుమారుడు మాన్విత, శశాంక్‌ల మృతదేహాలను బంధువులకు అప్పగించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పావులపాలెంకు చెందిన కొవ్వూరు శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని అప్పగించారు. ఆ తర్వాత బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి మృతదేహం అప్పగించారు. సాయంత్రం చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం యామగానిపల్లికి చెందిన పి.త్రిమూర్తి మృతదేహం అప్పగించారు. ఈ మృతదేహాలను కుటుంబ సభ్యులు ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు.

ఆ వ్యక్తిది చిత్తూరు జిల్లాగా గుర్తింపు

ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు రిజర్వేషన్ ప్రకారం 18 మంది మృతదేహాలను గుర్తించి వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నగర శివారులోని ఆరాంఘర్ చౌరస్తా దగ్గర బస్సు ఎక్కిన వ్యక్తి కూడా ఈ ఘటనలో మృతి చెందారు. ఆ వ్యక్తి ఎవరనేది పోలీసులకు సమాచారం రాలేదు. దీంతో పోస్టుమార్టం చేసి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. అయితే చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం యామగానిపల్లెకి చెందిన పీటీ కల్యాణ్ భరత్.. ఆ మృతదేహం తన తండ్రి త్రిమూర్తి (58)దే కావొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ శనివారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. "హైదరాబాద్‌లో బంధువుల పెళ్లికి మా నాన్న త్రిమూర్తి (58) ఈ నెల 22న కుప్పం నుంచి వెళ్లారు. 23న రాత్రి హైదరాబాద్ నుంచి ట్రావెల్స్ బస్సులో బయలుదేరినట్టు చెప్పారు. కానీ ఇంటికి చేరలేదు. ఫోన్ చేస్తే పని చేయడం లేదు.. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మా నాన్నదే అయి ఉంటుందేమో.." అని పోలీసులకు తెలిపారు. డీఎన్ఏ సరిపోవడంతో త్రిమూర్తి మృతదేహాన్ని కల్యాణ్ భరత్‌కు అప్పగించారు.

ఈ మృతదేహం నా తండ్రిది కాదు!

బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతయ్యాడు. డీఎన్ఏ రిపోర్టు ఆధారంగా మృతదేహాన్ని ఆయన కుమారుడికి అప్పగించారు. అయితే ఆ మృతదేహం తన తండ్రిది కాదని, వేరెవరిదో తమకు ఇచ్చారని ఆరోపిస్తూ ఆ మృతదేహాన్ని తీసుకునేందుకు కుమారుడు నిరాకరించాడు. దీంతో అధికారులు, పోలీసులు, వైద్యాధికారులు ఆ యువకుడికి వివరంగా తెలియజేసినట్లు సమాచారం. చివరకు మృతుడి కుమారుడు ఆ మృతదేహాన్ని అయిష్టంగానే బెంగళూరుకు తీసుకెళ్లినట్లు సమాచారం.

డీఎన్ఏ సరిపోల్చి.. అప్పగింత

బస్సు ప్రమాద ఘటనలో మృతి చెందిన 19 మందిలో ఏపీ లోని నెల్లూరు, అంబేడ్కర్ కోనసీమ, బాపట్ల, చిత్తూరు జిల్లాలకు చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్ణాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన వారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దగా మారడంతో ఏ మృతదేహం ఎవరిదో గుర్తుపట్టలేనట్టు తయారయ్యాయి. దీంతో డీఎన్ఏ పరీక్షల అనంతరమే మృతదేహాలను అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మృతులు, వారి కుటుంబ సభ్యుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. డీఎన్ఏ పరీక్షా ఫలితాలు ఆదివారం ఉదయం 8 గంటలకే కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు చేరాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఫోరెన్సిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ ఆధ్వర్యంలో డీఎన్ఏ సరిపోల్చి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ప్రత్యేక అంబులెన్స్‌ల్లో స్వస్థలాలకు పంపించారు. ఈ ప్రక్రియ ఆదివారం మధ్యాహ్నం 1:45 నుంచి రాత్రి 8:30 గంటల వరకూ సాగింది.

బిహార్ వాసికి కర్నూలులో అంత్యక్రియలు

ప్రమాదంలో మరణించిన బిహార్ రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్ అలియాస్ అమరజిత్ కుమార్ (45) రక్త సంబంధీకుల రక్తనమూనాలు సేకరించి డీఎన్ఏ సరిపోల్చి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించారు. అయితే కర్నూలు నుంచి బిహార్‌లోని వారి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే కనీసం రెండు రోజులు పడుతుంది. దీంతో ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని మృతుడి బంధువులు విన్నవించడంతో కర్నూలు నగరపాలక సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.


మృతుల కుటుంబసభ్యులకు చెక్కులను అందజేస్తున్న గద్వాల ఆర్డీవో

కర్నూలు బస్సు ప్రమాద.. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేత

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24న ఏపీలోని కర్నూలు జిల్లాలో జరిగిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం గద్వాల ఆర్డీవో అలివేలు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబసభ్యులకు రూ. 5 లక్షల చొప్పున చెక్కుల్ని అందజేశారు. మృతులు చందనమంగ, సంధ్యారాణి(హైదరాబాద్), మేఘనాథ్(కోదాడ), అనూష(నల్గొండ), బొంత ఆదిశేషగిరిరావు(హైదరాబాద్), కెనుగ దీపక్(రాయగడ్) కుటుంబసభ్యులు ఈ ఎక్స్‌గ్రేషియా అందుకున్నారు.

చావుపైనా రాజకీయం

- ప్రమాదంపై జగన్ రోత పత్రికలో నీచమైన రాతలు
- వార్తను ఖండిస్తూ ఎక్సైజ్ శాఖ నిరసన

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిత్యం కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న జగన్ రోత పత్రిక చివరకు చావుపైనా రాజకీయం చేస్తోంది. కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేటు బస్సు ఘోర ప్రమాద దుర్ఘటనను కూటమి ప్రభుత్వానికి ముడిపెడుతూ అసత్య కథనం వండివార్చింది. ద్విచక్ర వాహనదారుడు శివశంకర్ బెల్టు షాపులో మద్యం కొనుగోలు తాగడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ ఆదివారం సంచికలో అడ్డగోలు కథనం ప్రచురించింది. జగన్ పత్రిక తీరును ఎక్సైజ్ శాఖ తప్పుబట్టింది. దీనిపై సమగ్ర విచారణ జరిపించిన ఎక్సైజ్ శాఖ అసలు అక్కడ బెల్టు షాపులే లేవని తేల్చింది. లైసెన్స్ పొందిన మద్యం షాపులో బైకర్ శివశంకర్ మద్యం కొనుగోలు చేస్తున్న వీడియోలను కూడా విడుదల చేసింది. కర్నూలు జిల్లా పెద్దటేకూరులోని 'రేణుక ఎల్లమ్మ వైన్స్' అనే అధికారిక లైసెన్స్ మద్యం షాపు నుంచే మద్యం కొనుగోలు చేశాడని తెలిపింది. ప్రమాదం జరిగిన రోజు రాత్రి అదే షాపులో 7 గంటలకు, 8.25 గంటలకు వేర్వేరు సమయాల్లో మద్యం కొనుగోలు చేశాడని వివరించింది. ఆ షాపు సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా జాతీయ రహదారి నుంచి 240 మీటర్లకు పైగా దూరంలో ఎక్సైజ్ నిబంధనల ప్రకారమే ఏర్పాటైందని తెలిపింది.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

గంజాయి నిందితుల పరారీపై చర్య

మామునూరు సీఐ, ఎస్సైకు చార్జీ మెమోలు జారీ

వరంగల్ క్రైం, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మామునూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడంతో పాటు సీఐ రమేశ్‌తో పాటు ఎస్సైకి సీపీ సన్‌ప్రీత్ సింగ్ చార్జీ మెమోలు జారీ చేసినట్లుగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంజాయి విక్రయదారులను ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసుల కస్టడీలో ఉన్న ఇద్దరు గంజాయి నిందితులు పోలీస్‌స్టేషన్ నుంచి పారిపోయారు. ఈ విషయంలో సీరియస్‌గా ఉన్న సీపీ ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడంతో పాటు సీఐ, ఎస్సైలకు చార్జీ మెమోలు జారీచేసినట్లుగా విశ్వసనీయమైన సమాచారం.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. భర్తను కడతేర్చిన భార్య ?

- తలపై కర్రతో రక్తం వచ్చేలా కొట్టి.. శవాన్ని బాత్రూమ్ వద్ద పడేసి..
- ప్రమాదవశాత్తు చనిపోయినట్లు కుటుంబసభ్యులను నమ్మించే యత్నం
- పోలీసుల అదుపులో నిందితురాలు


విజయ్‌కుమార్ (ఫైల్)

సరూర్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే కారణంతో ఓ భార్య తన భర్తను హత్య చేసి ప్రమాదవశాత్తు మరణించినట్లు నమ్మించే ప్రయత్నం చేసింది. చివరికి నిజం బయటపడడంతో నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో మీర్‌పేటలోని జిల్లెలగూడ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్లంపల్లి విజయ్‌కుమార్ (42), సంధ్య దంపతులు స్థానిక ప్రగతినగర్ కాలనీలో నివాసముంటున్నారు. వారికి ముగ్గురు పిల్లల సంతానం. విజయ్‌కుమార్ ఆటో నడుపుతుండగా, సంధ్య మీర్‌పేట మునిసిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. సంధ్య కొంతకాలంగా తన సహోద్యోగితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇటీవల విజయ్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి మునిసిపల్ కార్యాలయంలో సదరు ఉద్యోగిని హెచ్చరించినట్లు సమాచారం. దాంతో భర్త మీద కోపం పెంచుకున్న సంధ్య.. ఎలాగైనా అతడిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఈ నెల 20న (సోమవారం) విజయ్‌కుమార్ మెడకు నీళ్ల తోడే బక్కెట్‌కు కట్టిన తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హతమార్చింది. తలపై కర్రతో రక్తం వచ్చేలా కొట్టి శవాన్ని బాత్రూమ్ వద్ద పడేసి.. ప్రమాదవశాత్తు కిందపడినట్లు కుటుంబసభ్యులను తెలిపింది. వెంటనే వారు డీఆర్‌డీవో అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు చెప్పారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేయడానికి సిద్ధమవుతుండగా, బక్కెట్ తాడుకు రక్తం ఉండడాన్ని గమనించిన మృతుడి తల్లి సత్తెమ్మ, స్థానికులు అనుమానం వచ్చి మీర్‌పేట్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టులో మెడకు తాడు బిగించి హత్య చేసినట్లుగా తేలడంతో సంధ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితురాలు నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం.

2 ప్రమాదాలు.. 2 ఎఫ్ఐఆర్‌లు!

కర్నూలు బస్సు ప్రమాద బాధితుడు రమేశ్ ఫిర్యాదు.. వేమూరి కావేరి ట్రావెల్ బస్ డ్రైవర్, ఓనర్‌పై కేసు

- ఎర్రిస్వామి ఫిర్యాదుతో మృతుడు శివశంకర్‌పై కేసు
- గురువారం రాత్రి 8.25 గంటలకు దుకాణంలో మద్యం కొనుగోలు చేసిన శివశంకర్, ఎర్రిస్వామి

కర్నూలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం ఘటనపై దర్యాప్తు చివరి దశకు చేరింది. ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడిన ఎస్.రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్ డ్రైవర్, యజమానిపై ఉల్లిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సు ప్రమాదానికి పది నిమిషాలు ముందే అంటే అర్ధరాత్రి 2:45 గంటల సమయంలో మద్యం మత్తులో బైక్‌పై డోన్‌కు వెళ్తున్న శివశంకర్, ఎర్రిస్వామి డివైడర్‌ను ఢీకొట్టారు. శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డారు. రోడ్డు మధ్యలో పడిపోయిన వీరి బైక్ బస్సు ప్రమాదానికి కారణమైందని పోలీసులు గుర్తించారు. ఎర్రిస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చనిపోయిన బి.శివశంకర్‌పైనా కేసు నమోదు చేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, కర్నూలు తాలుకా సీఐ చంద్రబాబునాయుడు దర్యాప్తు వేగవంతం చేశారు.

కాటేసిన మద్యం మత్తు

శివశంకర్, ఎర్రిస్వామి అలియాస్ నాని మిత్రులు. కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామం వద్ద జాతీయ రహదారికి 240 మీటర్ల దూరంలో ఉన్న రేణుక యల్లమ్మ మద్యం దుకాణంలో గురువారం సాయంత్రం 6:57 గంటలకు ఒకసారి, రాత్రి 8:25 గంటల సమయంలో మరోసారి వీరు మద్యం కొనుగోలు చేశారు. షాపు నుంచి బయటకు వచ్చిన తర్వాత 8:27 గంటలకు వీరు బైక్‌పై వెళ్లిపోయిన దృశ్యాలు అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆ తరువాత అర్ధరాత్రి 2:25 గంటల సమయంలో చిన్నటేకూరు గ్రామం దగ్గర కియ షోరూంకు ఎదురుగా ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకున్నారు. అక్కడి నుంచి ఐదు కిలోమీటర్లు వెళ్లి 2:45 గంటలకు డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డారు. మద్యం మత్తులో వీరు డివైడర్‌ను ఢీకొట్టిన బైకే.. ఆ తరువాత జరిగిన బస్సు ప్రమాదానికి కారణమైంది. లక్ష్మీపురం గ్రామంలో ఎర్రిస్వామి తల్లి ఉంటున్నారు. మద్యం తాగిన వారిద్దరూ ఇంటికి వెళ్లి పడుకున్నారు. రాంపల్లిలో ఎర్రిస్వామికి తెలిసినవారి వివాహం ఉండటంతో తనను ఆర్టీసీ బస్టాండ్‌లో దించమని కోరారు. అయితే డోన్‌లో రైళ్లు ఉంటాయని, వద్దని చెప్పినా వినకుండా శివశంకర్ బలవంతంగా బైక్‌పై డోన్ వైపు తీసుకువెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు.


పెద్ద టేకూరు వద్ద రేణుక యల్లమ్మ మద్యం దుకాణంలో గురువారం సాయంత్రం 6:57 గంటలకు మద్యం కొనుగోలు చేస్తున్న శివశంకర్, ఎర్రిస్వామి

శివశంకర్ నమూనాల్లో మద్యం ఆనవాళ్లు: ఎస్పీ

చిన్నటేకూరు సమీపంలో బైక్‌ను డివైడర్‌కు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన బి.శివశంకర్ మద్యం తాగినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. 'శివశంకర్ నుంచి సేకరించిన నమూనాల్లో మద్యం ఆనవాళ్లు ఉన్నట్లు ఆర్ఎఫ్ఎస్ఎల్ నివేదికలో నిర్ధారించారు. మృతుడు మద్యం తాగి బైక్‌ను నడపడం వల్లే ప్రమాదం జరిగింది. ఆ తరువాత రోడ్డు మధ్యలో పడిన బైక్‌ను వి.కావేరి ట్రావెల్ బస్సు తోసుకొని వెళ్లింది. రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నాం' అని ఎస్పీ పేర్కొన్నారు.

నిజాంసాగర్‌కు రికార్డు స్థాయిలో వరద

- ఈ సీజన్లో 200 టీఎంసీల ఇన్‌ఫ్లో
- 2 నెలలుగా 180 టీఎంసీలు విడుదల
- ప్రాజెక్టు చరిత్రలో ఇదే అత్యధికం: సీఈ

కామారెడ్డి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. ఈ సీజన్‌లో ఇప్పటికే 200 టీఎంసీలకు పైగా ఇన్‌ఫ్లో రాగా.. 180 టీఎంసీలను దిగువకు విడుదల చేశారు. ఆగస్టు 18న ప్రాజెక్టు నుంచి నీటి విడుదల మొదలవ్వగా మధ్యలో ఒకటి, రెండు రోజులు మినహా ఇప్పటికీ వదలుతూనే ఉన్నారు. ప్రాజెక్టు చరిత్రలో ఈ స్థాయిలో వరద రావడం ఇదే మొదటిసారి అని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 28న ప్రాజెక్టులోకి 2.51 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. 2.30 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. ఒకే రోజు ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఉండడం రికార్డు అని అధికారులు పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో ఇప్పటికీ మంజీరా నిండుగా ప్రవహిస్తూనే ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వరప్రదాయని అయిన ఈ ప్రాజెక్టు నిర్మాణం 1923లో ప్రారంభమై 1931లో పూర్తయింది. నిజాంసాగర్ మండలం అచ్చంపేట వద్ద మంజీరా నదిపై ఈ ప్రాజెక్టును నిర్మించారు. 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు, నిజామాబాద్, బోధన్ పట్టణాలకు తాగునీరు అందిస్తున్న ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు. ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో ఆయకట్టు పరిధిలో వచ్చే యాసంగితో పాటు వానాకాలం పంటలకు భరోసా లభించిందని రైతులు చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ...

నిజాంసాగర్ ప్రాజెక్టు చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్లో భారీగా వరద వచ్చింది. ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పరిస్థితిని సమీక్షిస్తూ నీటిని విడుదల చేస్తూ నష్టం జరగకుండా చూశాం.

-శ్రీనివాస్, సీఈ, ఇరిగేషన్, కామారెడ్డి

ఆగ్రోస్, డీసీఎమ్మెస్‌లు కనుమరుగు!

- వీటి అవసరం లేదన్న నిర్ణయానికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- హాకా, సీడ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్ తదితర కార్పొరేషన్ల విలీనానికి ప్రాథమిక నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖకు అనుబంధంగా ఉండి గుదిబండలా మారిన కార్పొరేషన్లను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే చర్యల్లో భాగంగా కొన్నింటి విలీనం, అవసరంలేనివాటి రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో ముందుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఆగ్రోస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు(డీసీఎమ్మెస్‌లు) కనుమరుగు కానున్నాయి. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ అథారిటీ, మార్క్‌ఫెడ్, వేర్‌హౌసింగ్ హైదరాబాద్ వ్యవసాయ సహకార సంస్థ (హాకా) తదితర కార్పొరేషన్లను విలీనం చేయాలని ప్రాథమికంగా విలీన ప్రక్రియకు ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల అధికారులను ఆదేశించారు. ఆ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, డైరెక్టర్ బి.గోపిలకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల కొనుగోళ్లు, వ్యవసాయ పనిముట్ల పంపిణీ తదితరాలకోసం ఆగ్రోస్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఈ పనులన్నీ ప్రస్తుతం వ్యవసాయశాఖ ద్వారా చేపడుతున్నారు. దీంతో ఆగ్రోస్ అవసరం పెద్దగా లేకుండా పోయింది. మరోవైపు నామినేటెడ్ ఛైర్మన్ పదవికి ఇదొక రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. వ్యవసాయ, సహకార శాఖల అధికారులు కూడా డిప్యుటేషన్‌పై ఈ సంస్థలో చేరి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించే బడ్జెట్‌తోపాటు వ్యవసాయ, అనుబంధ శాఖల్లో టెండర్లు, పెట్రోలు బంకుల నిర్వహణ, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు యంత్ర పరికరాల పంపిణీ తదితర వ్యవహారాలు.. అధికారులు, పాలకవర్గాలకు ఆదాయ వనరులుగా మారాయి. ఆగ్రోస్ నిర్వహించే టెండర్లు ఏటా వివాదాస్పదంగా మారుతున్నాయి. ఆగ్రోస్‌కు హైదరాబాద్‌లోని మౌలాలిలో ఉన్న 25 ఎకరాలు, చింతల్‌లోని భూములు, బెల్లంపల్లిలోని 400 ఎకరాల భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మంత్రి తుమ్మల ఆగ్రోస్ మూసివేత సహా ఇతర కార్పొరేషన్లను విలీనం చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతోందని, వ్యవసాయశాఖకు ఇవి భారంగా ఉన్నాయని, సాధ్యమైన వాటిని వ్యవసాయశాఖలో విలీనంచేసి మిగిలినవాటిని ఒక్క కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనే తలంపుతో పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అయితే కొందరు అధికారులు ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు, ప్రతిపాదనలు రూపొందించేందుకు అడ్డుపడుతున్నారనేది చర్చనీయాంశంగా మారింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు(డీసీఎమ్మెస్) ఉన్నాయి. వీటి మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రంలో 1987లో డీసీఎమ్మెస్‌లు ఏర్పాటు చేసి జిల్లాకో కార్యాలయం, గోదాములు నిర్మించారు. మొదట్లో విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల కొనుగోళ్లు చేపట్టేవారు. ఆ తర్వాత పౌర సరఫరాల సంస్థ ధాన్యం కొనుగోళ్లు చేపట్టింది. మార్క్‌ఫెడ్..మక్కలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు కొంటోంది. దీంతో డీసీఎంఎస్‌ల అవసరం ఏమాత్రం లేకుండాపోయింది. డీసీఎమ్మెస్‌లకు ఛైర్మన్లు, డైరెక్టర్ల నియామకం, గౌరవ వేతనం, వాహనాలు, ఇంటి అద్దెలు తదితరాలు చెల్లిస్తుండటంతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగింది. దీంతో ప్రభుత్వ ఆదేశాలమేరకు డీసీఎమ్మెస్‌ల మూసివేతకు రాష్ట్ర సహకారశాఖ ప్రతిపాదనలు రూపొందిస్తోంది.

2న 'జీశాట్-7ఆర్' ప్రయోగం

- ప్రయోగ వేదికకు ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్

సూళ్లూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. నవంబరు 2న చేపట్టనున్న ఈ ప్రయోగం ద్వారా జీశాట్-7ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని వాహన అనుసంధాన భవనం (వ్యాబ్) నుంచి ఆదివారం ఎల్‌వీఎం3-ఎం5 వాహకనౌకను రెండో ప్రయోగ వేదికపైకి తీసుకొచ్చారు. ఉదయం 7 గంటలకు షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ వాహకనౌకకు వ్యాబ్ వద్ద పచ్చజెండా ఊపగా.. రాకెట్ నెమ్మదిగా బయలుదేరి 10.30 గంటలకు ప్రయోగ వేదిక వద్దకు చేరుకుంది. ప్రయోగ వేదికపై ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌కు వివిధ తనిఖీలు, పరీక్షలు నిర్వహించనున్నారు. అన్నీ పూర్తయ్యాక రిహార్సల్ నిర్వహించి, అనంతరం ప్రీ కౌంట్‌డౌన్, కౌంట్‌డౌన్ ప్రక్రియ చేపడతారు. నవంబరు 2న ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా 4,400 కిలోల బరువున్న జీశాట్-7ఆర్ (సీఎంఎస్-03) కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనున్నారు. నవంబరు 2న ఉదయం 9-10 గంటల మధ్య ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి ఈ నెల 25నే ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంది. కానీ.. క్రయో దశలో చిన్నపాటి సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగాన్ని తొలుత నవంబరు 5వ తేదీకి వాయిదా వేశారు. తాజాగా ఈ ప్రయోగాన్ని నవంబరు 2న చేపట్టాలని నిర్ణయించారు.



ఈ రాత్రికి నది చెప్పే కథ విందామా?

సుదీర్ఘ ఎడబాటు తర్వాత నదిని కలిశాను..
కలిసినప్పుడల్లా కాళ్ళను చుట్టుకుని
చల్లని ప్రేమై ముంచెత్తేది
నేను తనలోకి తను నాలోకి
ప్రవాహం అయ్యేవాళ్ళము

ఉరిమే ఉత్సాహమై
ఊళ్లను చుట్టేసిన నది
అడవిలో కాసే వెన్నెలను
వెన్నెల్లో విప్పారిన మనుషులను
తనలో నింపుకున్న నది
ఊటలై ఉరకలేసి
అడవిని చైతన్యపరిచిన నది

ప్రవాహాన్ని వేటాడిన వేటగాడి దాడికి గురై
గాయాల నడకలో ఒంటరి పాయగా
నా వైపు చూడకుండానే
దుఃఖ ప్రయాణంలో ఉన్నది

ఎడారి చేసిన గాయాలతో నేను
అడవిని తగలేసి తనలో కలిపిన
కమురువాసనతో నది
పరస్పరం కౌగిలించుకున్నాము

నది మౌనరోదన నా చెవుల్లోకి పారుతున్నది
తన కోసమే ప్రవహిస్తున్నా..

తను ఎవరో తెలియని ఈ ప్రపంచానికి
నది ఏదో చెప్పాలనుకొంటున్నది

తనకే ప్రవాహం నేర్పిన అడవి చైతన్యం గురించో
పొద్దుపొడుపు మీది ఆశతో
అనంత ప్రయాణాన్ని ప్రకటించుకున్న
వీరుల గురించో
నది ఏదో చెప్పాలనుకుంటున్నది

మీరు చూడని మీకు తెలియని
అనేక కథలు నింపుకొని ఉన్నాను
ఈ దిగ్మండలాన్ని వెలిగించే
మరుగునపడ్డ సూర్యుళ్ల కథలను దాచుకొని ఉన్నాను

నువ్వు, నీతో పాటుగా ఉన్న ఈ ప్రపంచం
నా కథ వింటారా?
ఈ రాత్రికి నా కథ చెప్పాలి
నది తెలియని ప్రపంచానికి
ప్రవాహం తెలియని అమాయకులకు
నా కథ చెప్పాలి
చివరి పొద్దు వెలుగుతున్నప్పుడే
పసికందు కళ్ళు తెరుచుకునే తొలి వెలుగులోనే
నా కథ చెప్పాలి

నేనింకా ఆగిపోలేదని..
అనేక పాయలతో ప్రవహించడానికి సిద్ధపడ్డానని

నేను చెప్పబోయే నా అనుభవాల కథ వింటారా?

ఈ రాత్రికే..
ఈ రాత్రికే..
కాలాన్ని మరిచి నిద్రించే మీ అచేతన సమయాల్లో
నా కథ చెపుతాను
కాలము, నేను, మీరు వేరు కాదని
మీరు గ్రహించే వరకు నా కథ చెపుతాను

మరి.. ఈ రాత్రికి నది చెప్పే కథ విందామా?

■ చెమన్
© 9440385563

సోమవారం 27 అక్టోబరు 2025

వివిధ


vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

కళింగాంధ్ర నేల సారంతో రామకృష్ణకవి 'నలచరిత్ర'

దార్శనికుడు గురజాడ, గిడుగు, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణ బాబు, తాతాజీ, అరుద్ర, చాసో, రావిశాస్త్రి, కారా లాంటి ఉద్ధండుల్ని కళింగాంధ్ర సాహిత్యం అందించింది. వీరు ఆధునిక సాహిత్యస్రష్టలు. అనేక ప్రక్రియలకు ఆదిగురువులు. కాగా ఇక్కడే మూడువందలయేళ్ళ క్రిందట పుట్టిన బెహరా రామకృష్ణ వెయ్యేళ్ళ పద్య కవులెవరికీ తీసిపోని విధంగా, నల చరిత్రను కమనీయ ప్రబంధంగా మృదుమధురంగా రచించడాన్ని ఇక్కడి మట్టిసారంగా భావించవచ్చు.

బెహరావారు శ్రీకాకుళం జిల్లాకేంద్రానికి సమీపంలోని బొంతలకోడూరు మిరాసీదార్లు. కటకం గజపతుల ఆదరణతో వారితోపాటు పటననాయకులుగా వచ్చి ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. పట్నాయకులుగా, శిష్టు కరణాలుగా పిలవబడుతున్నారు. నలచరిత్రలో ఈయన వాడిన లాంతరు, ముక్కాలు వంటి పదాలవలన ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో జీవించాడని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అందుచేత క్రీ.శ.1800లకు ముందే ఈ గ్రంథాన్ని రాశాడని చెప్పవచ్చు.



గతంలో సంస్కృతాంధ్ర సాహిత్యాల్లో వచ్చిన నల చరిత్రలను బెహరా రామకృష్ణకవి చదివే ఉంటారు. ఈ గ్రంథంలో నన్నయ నుండి చేమకూర వరకూ తారసపడుతున్న పద్యసరళులు ఈ విషయాన్నే చెబుతున్నాయి. గ్రంథాన్ని పరిపుష్టం చేయడానికి నలుడి వేట ఘట్టంతోపాటు మరికొన్ని కల్పనలు, తదితర వర్ణనలను కథానుకూలంగా మూలానికి జోడించారు. మూత్ర విసర్జన తరువాత కాళ్ళు కడుక్కోకుండా సంధ్యావందనం చేయడం వల్ల నలుని శరీరంలోకి శని ప్రవేశించాడని నన్నయాదులు రాశారు. నలుడు వంటి నిష్ఠాగరిష్ఠునికి అలాంటి నైచ్యాన్ని అంటగట్టడం సరికాదని భావించి, "ఒగిc బదమున సూచికమోపcగలట్టి ప్రదేశమపు డపరిశుద్ధత నుండcగ సంధ్యోపాసన"- అని సవరించాడితడు. నలుడు కాళ్ళు కడుక్కున్నప్పుడు సూదిమోపినంత చోటు తడవకుండా ఉండిపోయిందట. దానిలోంచి శని లోపలికి ప్రవేశించాడని మార్చి, కథను ఔచిత్యవంతం చేశారు. 1511 పద్యగద్యాలతో ఈ ప్రబంధాన్ని రచించారు రామకృష్ణకవి. నగర, ఋతు, పుష్పాపచయ, సూర్యోదయ, సూర్యాస్తమయాది అష్టాదశ వర్ణనలలో ఒకటి రెండు తప్ప అన్ని రకాల వర్ణనలూ హృదయాహ్లాదంగా రచించారు రామకృష్ణకవి.

"వనరమాయువతి పుష్పవతి యయ్యె" - ఈ పాదంలో శ్లేష ఉంది. తోటంతా పుష్పించింది అని ఒక అర్థం, పుష్పించడంవల్ల వనలక్ష్మి ఈడేరిందని వేరే అర్థం స్ఫురిస్తోంది కదూ! కనకకారవృత్తిని వాడుకుంటూ ఇంకొక అద్భుత వర్ణన. "కరగిన పూదెc దాc గనకకారుcడు నీటనుముంచు మాడ్కి భాస్కరుc డపరాబ్ధిలోనc దిగcజారెc"-. నలుడి వేటవర్ణనలో సాయంసంధ్యను వర్ణిస్తున్నాడు. కరిగించిన బంగారుముద్దను స్వర్ణకారుడు నీటిలోముంచుతున్నాడా అన్నట్టు సాయంసంధ్యావేళ సూర్యుడు పశ్చిమసముద్రంలో మునిగిపోతున్నాడట. ఉత్ప్రేక్ష ఎంత అద్భుతమో అంత రమణీయం.

ఏ గ్రంథంలోనైనా రచయిత అస్తిత్వం ఎక్కడో ఓచోట పట్టుబడుతుంది. బెహరావారు గ్రీష్మఋతు వర్ణనలో "గావిరి యీవలి గలియcగ్రమ్మె" అని రాశారు. ఈ సీసపద్య చివరిదళానికి 'నల్లని వేడిపొగలు అంతటా కమ్మాయి' అని అర్థం.



ఈ పాదంలో ఈవలి అని ఉంది. వేసవి వేడి వేళ కలిగే దాహాన్నే ఈవలి, ఈష్ట అని కళింగాంధ్రలో అంటారు. దాహం వేస్తుంది అనడానికి ఈవలేస్తుంది, ఈష్టగా ఉంది అని వాడుతారు. బలహీనుడిమీద కోపంవస్తే 'కొంకులిరగ్గొట్టి గల్ను' అని ఇక్కడివారి వాడుక. ఈ గ్రంథంలో నలుడి వేటవర్ణనలో రెండుసార్లు కొంకులు పదాన్ని వరసపద్యాలలో వాడారు కవి. "నడుములు దునుమాడి తొడలుచెండాడి కొంకులుదెగ వ్రేసి చెంపలనుగోసి... అత్తటి ముక్కులు చెక్కులు కుత్తుకలంసములు తలలు కొంకులురములున్". మ్ముంగాలి ఎముకల్నే కళింగాంధ్రులు కొంకులని అంటారు. పెళ్ళికి వచ్చిన బంధువులు వధూవరులకు ఈడు చదివించడం ఈ ప్రాంతంలో నేటికీ ఉంది. దీనినే బెహరావారు "వీడు/ చెలగి

ఏ గ్రంథంలోనైనా రచయిత అస్తిత్వం ఎక్కడో ఓచోట పట్టుబడుతుంది. బెహరావారు గ్రీష్మ ఋతు వర్ణనలో "గావిరి యీవలి గలియcగ్రమ్మె" అని రాశారు. ఈ సీసపద్య చివరిదళానికి 'నల్లని వేడిపొగలు అంతటా కమ్మాయి' అని అర్థం. ఈ పాదంలో ఈవలి అని ఉంది. వేసవి వేడి వేళ కలిగే దాహాన్నే ఈవలి, ఈష్ట అని కళింగాంధ్రలో అంటారు. దాహం వేస్తుంది అనడానికి ఈవలేస్తుంది, ఈష్టగా ఉంది అని వాడుతారు.

చదివించిరి వధూవరులకు నపుడు" అని ఒక పద్యంలో రాశారు. వీడు అంటే కట్నం.

అందమైన వర్ణనలూ, అలంకారాలతోపాటు, వారి శబ్ద చమత్కారమూ ఉంది. "ఈయదు తనభావము చనవీయదు సఖులకును గోర్కులీయదు శుకి కం/ దీయదు ఫలములు తన పొందీయదు కేకులకుc జేరనీయదు గోరన్". ఇలా శబ్దిస్తూ, పద్యాలను జవనాశ్వాల్లా పరుగెత్తించడం ఈ కవికి వెన్నతోపెట్టిన విద్య. ఇలాంటి లయవిన్యాసమే ఈతని వచనరచనలోనూ గమనిస్తాం: "పుష్కరువలను నక్షంబులు పక్షంబులై యుండుటయు, నిజాధ్యక్షుని పక్షంబున విపక్షంబు లగుటయు, సమక్షంబునన్ బరీక్షించి".

గ్రంథం అంతటా అలంకారాలను విరివిగా వెదజల్లినా ఎక్కడా వ్యర్థపదాలుగానీ, ఊతపదాలుగాని తారసపడవు. అందుచేతనే బెహరా రామకృష్ణకవి 'నలచరిత్ర' మధుర ప్రబంధం. ఈ గ్రంథానికి సాహిత్యచరిత్రలలో తగు స్థానం లభించలేదు. 1933లో చివరిసారిగా ముద్రించారు. ఇన్ని ప్రత్యేకతలుగల గ్రంథం ఇటీవల పునర్ముద్రణ పొందిన విషయాన్ని సాహిత్యలోకానికి తెలియజేయాలనే ఈ ప్రయత్నం.

■ గార రంగనాథం
© 98857 58123

ఇలాంటివి అనువదించటమంటే ఇంగ్లీష్ ప్రపంచాన్ని కల్లోలపరచడమే!

తెలుగులో కథలు ఎప్పుడూ సమకాలీన వస్తువును ఎంచుకోవడంలోనూ, సామాజికాంశాలను ప్రస్తావించడంలోనూ, శిల్ప వైవిధ్యాన్ని ప్రదర్శించడంలోనూ ముందున్నాయి. కానీ వాటిని తెలుగు నేలను దాటించి, ఇతర భాషల పాఠకులకి చేరవేయటంలో మనం అంతగా విజయం సాధించలేదు.



ఈ నేపథ్యంలో అఫ్సర్ కథా సంకలనం 'సాహిల్ వస్తాడు' ఇంగ్లీష్‌లోకి 'Sahil will come'గా అనువాదం కావటం, ఓరియంట్ బ్లాక్‌స్వాన్ లాంటి ప్రముఖ పబ్లిషింగ్ హౌస్ ద్వారా విడుదల కావటం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పుస్తకం అనువాదకులు **అల్లాడి ఉమ, యం. శ్రీధర్** లతో జరిపిన సంభాషణ ఇది.

అఫ్సర్ 'సాహిల్ వస్తాడు' పుస్తకాన్ని అనువాదానికి ఎన్నుకోడానికి ప్రేరేపించిన అంశాలేమిటి?


ఇందులోని కథలు చాలావరకు ముస్లిం జీవితాల గురించి మనకు ఉన్న మూస భావనలకు భిన్నంగా ఉన్నాయి. అవి కేవలం గ్రామీణ జీవితాలకో లేదా నగర జీవితాలకో మాత్రమే పరిమితం కాలేదు. ఒక తరం వాళ్ళకి మాత్రమే సంబంధించిన కథలు కాదు. ముందుగా నిర్ణయించుకున్న భావజాలానికి మాత్రమే ఒదిగి ఉండే కథలు కాదు. ఈ లక్షణాలు మమ్మల్ని ఆకట్టుకున్నాయి. ఉదాహరణకు ఏ మతానికి చెందిన మూఢత్వాన్నయినా వ్యతిరేకించడం ఈ పుస్తకంలో ప్రత్యేకంగా కనపడుతుంది. ఇవన్నీ కాక, 1980ల తర్వాత తెలుగు సాహిత్యాన్ని కుదిపేసిన స్త్రీవాద, దళిత/ బహుజన, మైనారిటీ, ఇతర అస్తిత్వ వాదాలు లేవనెత్తిన ఎన్నో ప్రశ్నలను ఈ కథలు స్పృశించడం మాకు నచ్చింది.

ఈ కథల్లో సాంస్కృతిక అంశాలు, కుల మత ప్రస్తావనలు చాలా ఉన్నాయి. ఆ భావాలకు ఆంగ్లంలో సమానార్థకాలు లేకపోయినా అంతర్జాతీయ పాఠకులకు అర్థమయ్యేలా అనువాదం ఎలా చెయ్యగలిగారు?

సంస్కృతి, కుల మతాలకు సంబంధించిన ప్రత్యేకతలు ఏ ఒక్క భాషకో పరిమితం కాదు. అయినా ఇలాంటి అంశాలు అనువదించటంలో కొంత సమస్య ఉంటుంది. ఇక్కడ అఫ్సర్ విషయంలో మనం గుర్తించవలసింది- తాను ముస్లిం అయినప్పటికీ ప్రధానంగా హిందూ పాఠకులను ఉద్దేశించే రాస్తుండడం. అందుకే అఫ్సర్ కూడా తన పాఠకులకులందరికీ ఆ సాంస్కృతికాంశాలు అర్థమయ్యేలా ఫుట్‌నోట్స్ వాడారు. మేము కూడా అదే పద్ధతి పాటించాం.

ఇలాంటి ప్రత్యేక అనుభవాలను చదివిన ఆంగ్ల పాఠకులకు ఎలాంటి అనుభూతి కలుగుతుందని భావిస్తున్నారు?

అఫ్సర్ లాంటి ఒక ప్రత్యేక సాంస్కృతిక నేపథ్యానికి చెందిన రచయితను ఇంగ్లీష్‌లోకి అనువాదానికి ఎంపిక చేసుకోడమంటే ఇంగ్లీష్ ప్రపంచాన్ని కల్లోలపరచడమే. ఇలాంటి బాధ్యత చాలా బరువైనదే. అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ పోరాటాలు చేస్తున్న వివిధ జాతుల, మతాల మధ్య నెలకొన్న రాజకీయ వాతావరణంలోకి మన భాషలలో జరుగుతున్న చర్చలను చొప్పించడమే ఇలాంటి అనువాదాలు చేసే పని.



భారత ప్రాంతీయ భాషల నుంచి ఆంగ్లంలోకి సాహిత్యాన్ని అనువాదం చేయడం గురించి మీ దృక్పథం ఏమిటి? ఇలాంటి అనువాదాల విజయానికి మీ దృష్టిలో గీటురాయి ఏమిటి?

తెలుగు కానీ, మరే ఇతర భారతీయ భాష కానీ 'ప్రాంతీయ' భాష కాదు. జాతీయ, అంతర్జాతీయ అంశాలను చర్చించే ఏ భాషైనా ప్రాంతీయమెలా అవుతుంది? సాహిత్య అనువాదాలు మూల రచనల నైసర్గిక, సాంస్కృతిక, శైలీ సంబంధమైన ప్రత్యేకతలను ప్రతిబింబించాలి. అలాంటి ప్రత్యేకతలను ఇంగ్లీష్ అనువాదం ఏ మేరకు తీసుకెళ్లగలిగిందీ, పాఠకులను ఎంతమేరకు ప్రభావితం చేయగలిగింది అనేది ఆ అనువాదం సాధించిన విజయంగా భావించవచ్చు.

ఇంటర్వ్యూ ■ **అరిపిరాల సత్యప్రసాద్**

చకితం!

మూడ్ అనేది చిన్నమాట
ఇదొక తుఫాను!

గొప్ప కవిత చదివితే
అది గడ్డపారగా మారి
నిన్ను తవ్వితవ్వి పొయ్యాలి
నీలోంచి ఆవిరి జ్వాలలు ఎగయాలి.

ఇవాళ
నాయింటి ముందు
నేనే పచారులు చేస్తున్నాను
లోపలి ఆలోచనలు
బయటి కెగిరిపోకుండా
కాపలా కాస్తున్నాను.

జీవితం ఒక జ్ఞాపకాల పెట్టె
బాధల ఖజానా
నిశ్శబ్దానికి
కొత్తనోరు మొలుస్తున్న భావన
ప్రతి కవితా
అనుభవాల విముక్తికి దీవెన.

జీవితంలో సింహభాగం
ఆభాసమే
షుగర్ ఫ్రీ లాగ
అసలు రుచి కోసమే తండ్లాట!

పడుకునేటప్పుడు
పుస్తకం తలాపున పెట్టుకునేవాడిని
తెల్లారగట్ల
దిండులోంచి ఏవో మాటలు వినపడేవి.
కలవరిస్తుంటే
వీనికి పిచ్చిమల్లీ మొదలైంది అనేది మా అమ్మ.

నిజంగా
అలాంటి మానసికస్థితే
ఇవాళ కలిగింది
అహంకార రాహిత్యమే కవిత్వమని తెలిసింది.

■ ఎన్. గోపి





కొంటపోక...

తొమ్మిది పదులు దాటిన పండు ముదితల
సంభాషణల సారం వినడమొక కవి సమయమే
జీవన గీతికల చివరి చేరికల వలయాలు

+++

"నన్నింక ఎందుకు ఉంచుతండో
మీది మొకాన కొంటపోక

జల్ది తీసుకపొమ్మని మొక్కుతన్న
భూమ్మీద ఇంక ఎందుకు ఉండుడు

నడువస్తలేదు, కూసోవస్తలేదు
లేశి నిలవడ శాత కాదు

ఆరు నెల్ల సంది అన్నీ మంచంలనే
నిద్ర పట్టది, పెయ్యి తిరుగుతది

ఆస్తులెన్ని ఉన్నా, అన్ని అవస్థలేనే
కొసాకరుకు ఏవీ అక్కరకు రావు

ఎవ్వలున్నా వెంట దుఃఖమే ఉన్నట్టు
ఎల్లిపోతేనే పాణానికి సుఖం

కండ్లు పురాగ మస్క మస్క
ఎవ్వలను ఏర్పాటు చెయ్యరాదు

మాటలతోనే జర ఎరుక పడుత
ముచ్చట పెట్టేటోళ్లు ఎవ్వలు రారు

కాళ్ల రెక్కలు గుంజుక పోవుడు
తలకాయ గిర గిర తిప్పుడు

దూప అయితది, తాగబుద్ధి కాదు
మెతుకు ముట్టక వారం దాటింది

గిన్ని ఏండ్లు బతుకుడు ఎందుకే
బతుకు యాష్టనే వస్తుంది చెల్లె!

గా దేవుడు కొంటపోతే బాగుండు
జీవునం ఉన్నట్టే గని లేనట్టే లెక్క

ఎండిపోయి బొక్కలు తెల్లగ తేలినయి
ఎల్లెం కొంటపోతేనే బాగుండు గదా!
తీసుకపోవాల్నని చూస్తున్నవ్వ"

+++

చెట్టు మీద బుర్ర పండిన పండు నేలరాలి
విత్తనమయ్యే తాదాత్మ్యతనే వృద్ధాప్యం
పరిపక్వత చెందడం దేహ జీవ సూత్రం.


■ అన్నవరం దేవేందర్
© 94407 63479

ఆ లేఖల్ని ఇప్పటికీ తీసి చదువుకుంటాను!

నా మొదటి పుస్తకం

దర్భశయనం శ్రీనివాసాచార్య

1974లో తొమ్మిదవ తరగతిలో రాసిన తొలి కవితతో నా సాహిత్య ప్రయాణం మొదలయింది. 1984లో కలకత్తాలో బ్యాంకు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి నా అధ్యయనమూ సృజనా వేగవంతమవుతూ వచ్చాయి. 1987లో గుంటూరులో పని చేస్తున్నపుడు ఒక రోజు 'నవోదయం' అనే సాహిత్య పత్రికలో ఒక పురస్కార ప్రకటన చూసాను. కవుల నుంచి అముద్రిత కవితా సంపుటాలను ఆహ్వానిస్తూ, ఉత్తమ కవితా సంపుటికి 'గ.న.రా' పేరిట సాహిత్య పురస్కారాన్ని ఇస్తామని, ఎంపికైన సంపుటిని తామే ప్రచురిస్తామని చెబుతూ జి.వి.బి. నరసింహారావు అనే తెలుగు టీచర్ ఇచ్చిన ప్రకటన అది. ఆయన మరెవరో కాదు, ఆ తర్వాతికాలంలో మహాసహస్రావధానిగా ప్రసిద్ధుడు గరికపాటి నరసింహారావు.



1974 నుంచి 1981 వరకు నేను రాసిన దాదాపు వంద కవితలను పూర్తిగా పక్కకు పెట్టి, 1982 నుంచి 1987 వరకు రాసిన వంద కవితల నుంచి నాకు నాణ్యంగా అనిపించిన 28 కవితలను ఎంపిక చేసుకుని సంపుటిగా కూర్చి 'రాబందుల రెక్కల చప్పుడు' అనే టైటిల్‌తో 'గ.న.రా. సాహిత్య పురస్కారం' కోసం పంపాను. నా సంపుటి అవార్డుకు ఎంపికైందని తెలిసి చాలా సంతోషించాను.

సంపుటిలోని కవితల సారంతో అన్వయంగా వుండాలని కవితా సంపుటి టైటిల్‌ను 'జీవన వీచిక'గా మార్చాను.

ముందుమాట రాయమని కళావేత్త సంజీవదేవ్‌ను కోరాను. ఆయన అందమైన కాగితం మీద అందమైన చేతి రాతతో 'ధ్వని' శీర్షికతో ముందుమాటను రాసి పంపారు. కొల్లూరు వెంకట్ అనే సాహిత్య మిత్రుడు అందించిన కవర్ పేజీ బొమ్మ నాకు బాగా నచ్చింది. ముఖ్యంగా అందులోని కన్ను. పుస్తకాన్ని మా అమ్మకూ నాయినకూ అంకితమిచ్చాను. నరసింహారావు గారి కోరిక మేరకు గుంటూరులోనే 'శంకర్ ప్రింటర్స్'లో పుస్తకాన్ని ముద్రణకు ఇచ్చాను. ప్రూఫ్ రీడింగ్ పనిని నేనే చూసుకున్నాను. 500 ప్రతులకు అయిన రూ.1800 ప్రింటింగ్ ఖర్చును పురస్కార ప్రదాత ప్రెస్సుకు చెల్లించారు. పుస్తకం ధర అయిదు రూపాయలు. ప్రెస్ నుంచి వచ్చిన పుస్తకాన్ని చూడగానే నేను అనిర్వచనీయ ఆనందోద్వేగాన్ని పొందాను.

తెనాలిలో 'చైతన్య కళా స్రవంతి' సంస్థ నిర్వహణలో 1988 జనవరి 10న పుస్తకావిష్కరణ జరిగింది. సంజీవదేవ్ పుస్తకాన్ని ఆవిష్కరించి లలితంగా ప్రసంగించారు. పాపినేని శివశంకర్, హితశ్రీ, పురస్కార న్యాయ నిర్ణేత తమ్మా సత్యనారాయణ పుస్తకం గురించి వివరంగా ప్రసంగించారు. పురస్కారం గురించీ పుస్తకం గురించీ నరసింహారావు ఎంతో నమ్రతతో మాట్లాడారు. నా సంపుటి లోని 'రాబందుల రెక్కల చప్పుడు' అనే కవితను గాయకుడు సాంబశివరావు సభలో అర్థవంతంగా పాడాడు.



'జీవన వీచిక' సంపుటిని మిత్రులకూ, ప్రసిద్ధ కవులకూ పంపాను. "హరితం మీ కవితల్లో స్ఫురితమవుతోంది," అన్నారు ఆరుద్ర ఓ కార్డు ద్వారా. "మీ 'జీవన వీచిక'లో పెట్టిన శీర్షికకు, సాగిన కవితకు అర్థం వుంది. అన్వయం వుంది. మీ కవిత్వానికున్న మంచి గుణం స్పష్టత," అంటూ సినారె ఉత్తరం రాశారు. ఇంకా ఎందరో పెద్దలూ మిత్రులూ లేఖలు రాశారు. ప్రతీ లేఖా కొత్త ఉత్తేజాన్నిచ్చింది. ఆ లేఖల్ని ఇప్పటికీ అప్పుడప్పుడూ తీసి చదువుకుంటూ, నాటి ఉత్సవ జ్ఞాపకాన్ని నెమరేసుకుంటాను.

© 94404 19039

దళిత కవితా సంపుటుల పరిచయం

అంబేద్కర్ విద్యార్థి సంఘం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ఆధ్వర్యంలో కేశవ కుమార్ రెండు కవితా సంపుటాలు 'ఆదిమ పౌరుడు', 'ఎగిరే పళ్లెం నడిచే మంచం ఓ కూని రాగం' పరిచయ సభ అక్టోబర్ 27 సాయంత్రం 5గం.లకు అంబేద్కర్ ఆడిటోరియం, హెచ్‌సీయూలో జరుగుతుంది. అధ్యక్షుడు ప్రొ.బి.ఈశ్వరరావు, ముఖ్య అతిథి గోరటి వెంకన్న. సతీష్ చందర్, పిల్లలమర్రి రాములు, కందుకూరి అంజయ్య, మెర్సీ మార్గరెట్, పసునూరి రవీందర్ తదితరులు పాల్గొంటారు.

తాటిపెల్లి తిరుపతి

పద్యాల పోటీల బహుమతి ప్రదానం

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 13వ వార్షికోత్సవాన్ని నవంబర్ 2తేదీన పలమనేరు లోని సొంత కళా మందిరంలో నిర్వహిస్తున్నాం. పద్యాల పోటీల్లో గెలుపొందిన 50 మంది పిల్లలకు బహుమతులతో పాటు 13 మందికి వార్షికోత్సవ పురస్కారాలు అందిస్తున్నాం. ముఖ్య అతిథులుగా గార్లపాటి దామోదర్ నాయుడు, ఆముదాల మురళి, దశరథ రెడ్డి తదితరులు పాల్గొంటారు.

పి. తులసినాథం నాయుడు

విద్యార్థులకు కవిత, కథ, నాటికల పోటీలు

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీకోసం 25 పంక్తులు మించని పద్యం/ కవిత/ గేయం; ఏ4 సైజులో 3 పుటలు మించని కథ; 6 పుటలు మించని నాటికలను స్వదస్తూరితో పేజీకి 20 పంక్తులకు మించకుండా- దేశభక్తి, దేశ సమగ్రత, తెలంగాణ వైశిష్ట్యం, పర్యావరణం పచ్చదనం లాంటి అంశాలపై- రాయాలి. రచనపైన ఏ సమాచారమూ ఉండరాదు. విద్యార్థి పేరు, తరగతి మొదలైన సమాచారమంతా పాఠశాల ప్రధానాచార్యులు ధ్రువీకరించే పత్రంలో మాత్రమే ఉండాలి (వారి ఫోన్ నంబర్‌తోసహా). రచనలను నవంబర్ 5లోపు చిరునామా: కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ 500004కు పంపాలి.

తెలంగాణ సాహిత్య అకాడమి

అనువాదం, కవిత్వ ప్రక్రియల పోటీ

మాధవరావు జ్ఞాపకార్థం తెలుగు అనువాద సాహిత్యం, పద్య కవిత్వం, హైకూలు, మినీకవిత, దీర్ఘకవితల పోటీ నిర్వహిస్తున్నాం. ఉత్తమ అనువాదానికి, ఉత్తమ కవితా ప్రక్రియకు చెరో రూ.5,116 బహుమతి ఉంటుంది. 2018 తర్వాత ముద్రితమైన 2 కాపీలను నవంబర్ 25లోపు పంపాల్సిన చిరునామా: నిర్వాహకులు, శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పాత బస్టాండు వద్ద, మెయిన్ రోడ్, పిఠాపురం – 533450. వివరాలకు: 94945 53425.

పీఠికాపుర సాహితీ కళావేదిక

లక్కు.. కిక్కు.. ఎవరికో!?

నేడు వైన్స్‌షాపులకు లక్కీడ్రా

- హనుమకొండ అంబేద్కర్ భవన్, వరంగల్ నాని గార్డెన్ వేదికలు
- ఏర్పాట్లు చేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు



వరంగల్ క్రైం, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం షాపులకు లక్కీ డ్రాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సోమవారం నిర్వహించేందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల ఎక్సైజ్ శాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. కాగా, ప్రతీ దరఖాస్తుదారుడు తన వెంట ఎంట్రీ పాస్ తీసుకొని ఉదయం 9గంటలకే వరంగల్ అర్బన్ దరఖాస్తుదారులు అంబేద్కర్‌భవన్‌కు, వరంగల్ దరఖాస్తుదారులు వరంగల్ ఉర్సు బైపాస్ రోడ్డులోని నాని గార్డెన్ వద్దకు రావాలని అధికారులు కోరారు. ఉదయం 11గంటలకు ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీ డ్రా ప్రారంభిస్తామని ఆయా జిల్లాల సూపరింటెండెంట్స్ చంద్రశేఖర్, అరుణ్ తెలిపారు.

పెద్ద ఎత్తున దరఖాస్తులు

పాత వైన్‌షాపుల లైసెన్స్ గడువు వచ్చే నెల నవంబరు 31న ముగుస్తుండటంతో కొత్త వైన్‌షాపులకు (2025-27) సంవత్సరానికి లైసెన్స్ జారీ చేసేందుకు ప్రభుత్వం సెప్టెంబర్ 25న నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్‌లో దరఖాస్తు రుసుము రూ.3లక్షల నాన్ రిఫండబుల్ ఫీజు ఖరారు చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబరు 18వరకు గడువు ఇచ్చింది. 23న డ్రా తీసేందుకు సమయం ఇచ్చింది. ఆ తర్వాత మద్యం వ్యాపారుల విజ్ఞప్తి మేరకు 23వ వరకు దరఖాస్తుల స్వీకరణను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆపై సోమవారం డ్రా తీసేందుకు ఏర్పాట్లు చేయాలని అబ్కారీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఈ 28రోజుల్లో వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్‌లో 5,133 దరఖాస్తులు రాగా, ప్రభుత్వానికి రూ.153.99 కోట్ల ఆదాయం వచ్చింది. సోమవారం ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా తీసేందుకు ఇరు జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేశారు.

భూ భారతి రికార్డుల పరిశీలన

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రికార్డులను కలెక్టర్ సత్యశారద ఆదివారం పరిశీలించారు. వర్ధన్నపేట, దుగ్గొండి మండలాలకు సంబంధించిన భూ భారతి, పీఓటీ రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడువులోగా అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరిస్తే అందుకు గల కారణాలను తెలపాలన్నారు. సాదా బైనామా, పీఓటీలకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలని అన్నారు. భూ సంబంధిత రికార్డుల ప్రమాణికత, డేటా అప్‌డేట్‌లపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ ఫైళ్లను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూ భారతి రికార్డుల పరిశీలనలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్లు రాజేశ్వర్, విజయ్ సాగర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల లెక్క పక్కా..

డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా కచ్చిత నిర్ధారణ



హనుమకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో వానాకాలం పంటల సాగును పక్కాగా లెక్కించే డిజిటల్ క్రాప్ సర్వే 25న శనివారం ముగిసింది. ఈనెల 27న సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో డిజిటల్ క్రాప్ సర్వే వివరాలు ప్రదర్శిస్తారు. దీనిపై నవంబర్ 1న రైతుల నుంచి అభ్యర్థనలను స్వీకరిస్తారు. అదే నెల 3న అభ్యర్థనలను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తారు. 5వ తేదీన తుది డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను అందరికి అందుబాటులో ఉంచుతారు.

ప్రత్యేక యాప్‌తో..

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు మొబైల్ ఫోన్‌లోని ప్రత్యేక యాప్‌లో పంటల సర్వే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేశారు. సాగు చేసిన పంటల ఫొటోలు కూడా యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఇంతకుముందు అంచనాల ఆధారంగా పంటలు సాగు వివరాలను నమోదు చేసేవారు. అయితే ఇందులో లోపాలు చోటు చేసుకునేవి. లెక్కలు పక్కాగా లేకపోవడంతో పంటల కొనుగోలు సందర్భంగా ఇబ్బందులు ఎదురయ్యేవి. రైతుల పేరుతో మధ్యదళారీలు అడ్డదారిన పంటల ఉత్పత్తులను విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకునేవారు. దీనివల్ల నిజమైన రైతులు నష్టపోయేవారు. దీనిని నివారించడానికి పంటల సాగు లెక్కలను పక్కాగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటోంది. పంటల లెక్కలు కచ్చితంగా ఉంటే ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం, ఇతర సౌకర్యాలు, ఇతరత్రా ఏర్పాట్లు, కొనుగోలుకు నిర్ణయాలు, ధాన్యం నిల్వల విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి అస్కారం ఏర్పడుతుంది.

పంటల సాగు విస్తీర్ణం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 మండలాలు, 1,705 గ్రామాలు, 325 క్లస్టర్లు ఉన్నాయి. 325 మంది వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) సర్వే పనిలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లాలో వానాకాలం మొత్తం పంటల విస్తీర్ణం 14,29,808 ఎకరాలు ఉండగలదని అంచనా వేస్తున్నారు. ఇందులో వరి 6,97,,122 ఎకరాలు, పత్తి 5,14,09 ఎకరాలు, మొక్కజొన్న 2,45,736 ఎకరాలు, ఇతర పంటలు 13,991 ఎకరాలు ఉండగలదని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న రైతులెందరు? సాగు భూములు ఎన్ని ఎకరాలు? ఆ భూముల్లో ఏఏ పంటలు సాగుచేశారనే అంశాలపై వ్యవసాయాధికారులు ప్రధానంగా దృష్టి సారించారు, పక్కాగా లెక్క తీయాలనే ప్రభుత్వ ఆదేశాలతో పంటల నమోదు కొంత ఆలస్యంగా చేపట్టినప్పటికీ సర్వేలో తప్పిదాలు జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు..

- క్షేత్ర స్థాయిలో సర్వే పూర్తిచేసిన ఏఈవోలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 100 శాతం సాగు
- సాగు విస్తీర్ణం సుమారు 14.29 లక్షల ఎకరాలు
- పంటల బుకింగ్ లేకుండా ఇబ్బందులు
- పంట ఉత్పత్తుల విక్రయంలో చిక్కులు
- దళారులకు చెక్ పెట్టేందుకే పంటల నమోదు విధానం

అన్ని పంటల నమోదు

ప్రతీ మండలంలో వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)లు తమ క్లస్టర్ పరిధిలో రైతులను ప్రత్యక్షంగా కలిసి సర్వే నెంబర్ల ఆధారంగా సాగు చేసిన పంటను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఒక్కో ఏఈవో 2 వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. మహిళా ఏఈవోలు కనీసం 1,800ఎకరాల వివరాలు నమోదు చేయాలి. ఈ మేరకు సర్వే నంబర్ల వారీగా ఏఈవోలకు పంటల సర్వే విస్తీర్ణాన్ని కేటాయించారు. ప్రతీ పంటను ఫొటో తీసి మొబైల్ యాప్‌లో రైతు పూర్తి వివరాలను నమోదు చేశారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ తక్కువగా ఉన్న ప్రదేశాల్లో పంటల బుకింగ్ పూర్తి చేయడానికి వీలుగా యాప్‌ను ఆఫ్‌లైన్ ఫీచర్‌తో రూపొందించారు. వరి సాగును ఏ పద్ధతిలో చేశారో కూడా నమోదు చేసేలా యాప్‌లో కొత్త ఫీచర్లను చేర్చారు. అదే విధంగా విత్తనోత్పత్తి పంటల వివరాలను

(మిగతా 6లో..)

వంద శాతం సాగు విస్తీర్ణం

ఈ సారి వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందు మే నెల చివరిలో ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో వర్షాలు కురిశాయి. అయితే జూన్, జూలై నెలల్లో వర్షపాతం అంచనాల మేరకు పడలేదు. ఆగస్టులో వర్షాలు విస్తీరంగా కురిశాయి. ముఖ్యంగా వరినాట్లు ఆలస్యంగా పడ్డాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ విడుదల చేసిన రిపోర్టు ప్రకారం ఉమ్మడి వరంగల్‌లోని మూడు జిల్లాల్లో అన్ని పంటల సాగు సాధారణ లక్ష్యానికి తక్కువ కాకుండా వందశాతం కంటే ఎక్కువగా విస్తరించింది. మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో సాగు వంద శాతం మించింది.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి గాను పత్తికి కనీస మద్దతు ధర రూ.8110లుగా నిర్ణయించిందని, సీసీఐ నిబంధనల మేరకు రైతులు మిల్లుకు వెళ్లకముందే కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని నిర్ధారించుకున్న తరువాతే మిల్లుకు పత్తి తీసుకుని రావాలని ఆ ప్రకటనలో కోరారు.

ఆలయాలను అలంకరించాలి

- కార్తీక దీపోత్సవాలను వైభవంగా నిర్వహించాలి
- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- ఈవోలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించాలని, ప్రతీ దేవాలయాన్ని దీపాలతో అలంకరించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. నవంబరు 19 వరకు దీపోత్సవాన్ని నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈవోలు, డిప్యూటీ కమిషనర్లు, సహాయ కమిషనర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. కార్తీక మాసం హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదని, ఈ మాసంలో దీపాలను వెలిగించడం చాలా శుభప్రదమని అన్నారు. అందరు కలిసి దేవాలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి భక్తి భావంతో పూజలు చే యాలని అన్నారు. గత సంవత్సరం నిర్వహించినట్లుగా ఈసారి కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. ప్రతీ రోజు దేవాలయాల్లో సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు మట్టి ప్రమిద లు, వొత్తులు, నూనెతోపాటుగా పసుపు, కుంకు మ, తాంబూలాలను అందజేయాలన్నారు. కార్తీక సోమవారం రోజు సామూహిక దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు పైన పేర్కొన్న వస్తువులతోపాటు కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు ఏ దైనా పండు ఇవ్వాలన్నారు. అనంతరం దీపాలు వదలడానికి తాత్కాలిక వాటర్ పాండ్స్ ఏర్పాటు చేయాలన్నారు. నది పరివాహక ప్రాంతాల్లోని దేవాలయాల్లో నది హారతి నిర్వహించాలన్నారు. ఈ సంవత్సరం సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా భక్తుల కోసం బ్రహ్మశ్రీ నాగఫణి శర్మ, సామవేదం షణ్ముఖ శర్మలచే ప్రముఖ దేవాలయాల్లో ప్రవచనాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు ఏ ఆలయానికి వస్తారో అక్కడ స్థానికంగా రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్ విభాగాల సహాయంతో చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల సేవలు వినియోగించుకోవాలని, ప్రతీ దేవాలయంలో లైటింగ్ పక్కాగా ఉండాలని అన్నారు. భజన మండలి, సంప్రదాయ నాట్య మండలి సంఘాలను ఉపయోగించుకోవాలని, టూరిజం డిపార్ట్‌మెంట్ సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా చేపట్టాలని అన్నారు. ఈ ఉత్సవాల్లో ఏదో ఒక రోజు జిల్లా కలెక్టర్లు కూడా పాల్గొనే విధంగా చూడాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నామని గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

నేటి వరంగల్ ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

తెలంగాణ ఉద్యమానికి పాట ఊపునిచ్చింది

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కాళోజీ కళాక్షేత్రంలో ఓరుగల్లు గాన కళావైభవం



కాళోజీ కళాక్షేత్రంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాకారులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో పాట ఉద్యమానికి ఊపునిచ్చిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, గద్దర్ కుమార్తె వెన్నెల అన్నారు. ఆదివారం కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఓరుగల్లు గాన కళావైభవం కార్యక్రమంలో పాల్గొన్న నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు గద్దర్ కుమార్తె పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కవులు, కళాకారులు సమాజంలోమార్పు తేగల శక్తి గలవారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలోనే కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించి కవులకు, కళాకారులకు అంకితం చేశామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించాలని ఆయన అన్నారు. గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జానపద కళాకారుల వెంట ఉంటానన్నారు. వీరి స్థితిగతులను ప్రభుత్వ పరంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నానన్నారు. కాగా, 5 గంటల పాటు కొనసాగిన గానామృత యజ్ఞంలో వందకు పైగా పాటలు పాడారు. కళాకారులు సమాజహితాన్ని కోరుతూ స్ఫూర్తిదాయకంగా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, విశ్వకవి సిరాజొద్దీన్, మైస ఎర్రన్న, విప్పనపల్లి రవికుమార్, వల్లంపట్ల నాగేశ్వరావు, నిట్‌ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ముగ్దుం జానపద కవులు, గాయకులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడండి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ల ఆకస్మిక తనిఖీ



దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్లను మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నీటి సరఫరా తీరు, నీటి నాణ్యతను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ధర్మసాగర్ రిజర్వాయర్‌ల నుంచి వచ్చే రా వాటర్‌లో సమస్య ఏర్పడిందని, వర్షాకాలం ముగింపు సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాం ఉంటుందని అన్నారు. గత సంవత్సరం కూడా ఈ సమస్య ఉత్పన్నం అయ్యిందని అన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమార్, ఈఈ రవికుమార్, డీఈ సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వైద్యంపై పట్టింపులేని కాంగ్రెస్ ప్రభుత్వం

- వరుస సంఘటనలు జరగడం బాధాకరం
- ఎంజీఎంను సందర్శించిన బీజేపీ నేతలు



ఎంజీఎం ఆస్పత్రిని సందర్శిస్తున్న బీజేపీ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంటా రవికుమార్, ఇతర నాయకులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా వైద్యంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలపై ఆదివారం భారతీయ జనతా పార్టీ నాయకులు ఎంజీఎంను సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, పిల్లలవార్డును సందర్శించి వైద్య సేవలపై డ్యూటీ డాక్టర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంటా రవికుమార్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు

(మిగతా 6లో..)

ఉల్లాసంగా ఉత్కర్ష హెల్త్ రన్



ఉత్కర్షలో పాల్గొన్న విద్యార్థినులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక ఉత్కర్ష-2025 ఉత్సాహభరితంగా ఆదివారం హెల్త్ రన్ ప్రారంభమైంది. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈ హెల్త్ రన్‌ను కేఎంసీ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు నిర్వహించారు. రన్‌ను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య జెండా ఊపి ప్రారంభించారు. హెల్త్ రన్ అనంతరం పబ్లిక్ గార్డెన్ చౌరస్తాలో విద్యార్థులు స్కిట్, డాన్స్ ప్రదర్శనల ద్వారా మహిళా ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం క్విజ్, పెయింటింగ్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం వైద్య విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించారు. అనంతరం డాన్స్‌లతో సందడి చేశారు.

కేయూ ఫార్మసీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేయూ క్యాంపస్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాల బీ ఫార్మసీలో ఖాళీగా ఉన్న 19 సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఈఏపీసీఈటీ(బీ)-2025 మార్గదర్శకాలమేరకు అడ్మిషన్లు నిర్వహిస్తామని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు, రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కారని స్పష్టంచేశారు. ఆసక్తి,అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబరు 28న మధ్యాహ్నం 2 గంటలకు క్యాంపస్ ఫార్మసీ కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లలో పాల్గొని ప్రవేశాలు పొందాలని సూచించారు. ఫీజుల వివరాలు కళాశాలలో అందుబాటులో ఉంచినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 క్రీడా ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) అండర్-19 ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-19 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాలబాలికలకు పలు క్రీడాంశాల్లో నాలుగు రోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. 27న కరాటే, యోగా, బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, టేబుల్ టెన్నిస్, మల్కంబ్, సాఫ్ట్ టెన్నిస్, గట్కా, తంగ్‌తా, మార్షల్ ఆర్ట్స్, 28న హ్యాండ్‌బాల్, చెస్, షటిల్, బ్యాడ్మింటన్, హాకీ, బెల్ట్ రెజ్లింగ్, సైక్లింగ్, స్కేటింగ్, బేస్‌బాల్, బీచ్ వాలీబాల్, 29న ఖోఖో, బాక్సింగ్, కలారీ పయట్టు, రగ్బీ, ఆర్చరీ, బాక్సింగ్, స్విమ్మింగ్ ఫెన్సింగ్,కురేష్, అథ్లెటిక్స్, 30న జిమ్నాస్టిక్స్, లాన్‌టెన్నిస్, క్రికెట్, షూటింగ్, క్యారమ్స్,ఉషు, వెయిట్‌లిఫ్టింగ్, నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, జూడో క్రీడాంశాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9848876765 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

ప్రజా వైద్యంపై పట్టింపులేని కాంగ్రెస్ ప్రభుత్వం

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టుల్లో కమీషన్ల పంచాయితీ తప్ప ప్రజారోగ్యంపై ధ్యాస లేదన్నారు. ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా ఉన్న ఎంజీఎం పరిస్థితి ఇలా ఉంటే ప్రజల ప్రాణాలకు రక్షణ ఎవరిస్తారని ప్రశ్నించారు. పేదల ప్రాణాలు కాపాడే ఎంజీఎం ఆస్పత్రి వెంటిలేటర్‌పై ఉందని, ఒకే ఆక్సిజన్ సిలిండర్ ఇద్దరు చిన్నారులకు పెట్టడం చాలా బాధాకరమన్నారు. ఇక్కడ ఘటనలు చూస్తే పేషంట్లను ఎలుకలు కొరకడం, ఒక బ్లడ్ గ్రూప్‌కు మరో బ్లడ్ గ్రూప్ ఎక్కించడం, పసిపిల్లల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందన్నారు. ఆస్పత్రిలో నిత్యం పర్యవేక్షణ ఉండాలని, పరిశుభ్రత చూపించాలని గతంలో బీజేపీ ధర్నా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ కమీషన్ల మీద ధ్యాస పెట్టే బదులు ఎంజీఎంపై పెడితే ప్రజలకు కనీసం మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అణగారినవర్గాలు ఎక్కువగా వచ్చే ఎంజీఎంకు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదన్నారు. ఎంజీఎం పరిస్థితులు మారే వరకు బీజేపీ ఆధ్వర్యంలో 48 గంటల దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంటా రవికుమార్ హెచ్చరించారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలి

డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేసి ప్రజలందరికీ నాణ్యమైన విద్యను అందించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఆదర్శ లా కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తక్కువ నిధులు కేటాయిస్తూ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం విధ్వంసానికి గురైందన్నారు. రకరకాల గురుకులాలు ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించే సాధారణ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తూ సాధారణ పాఠశాలలను పట్టించుకోకుండా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటుతో విద్యలో మరింత అంతరాలు పెరిగిపోతాయని, సాధారణ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చి అందరికి సమానమైన విద్యను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. డీటీఎఫ్ సభ్యురాలు ఏలూరి సత్యమ్మ ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.ఉప్పలయ్య, కె.శ్రీనివాస్, కె.నారాయణరెడ్డి, రఘుశంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రమేశ్, గోవిందరావు, యాకయ్య, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

అపార్ట్‌మెంట్స్ సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలి

● **అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి**

బాలసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణ వ్యాప్తంగా ఉన్న వందలాది అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న వేలాది కుటుంబాల సమస్యల పరిష్కారంపై మునిసిపల్ కమిషనర్, నగర మేయర్ వెంటనే తమ అసోసియేషన్‌తో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రేంటాల కేశవరెడ్డి కోరారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి కార్యనిర్వాహక సమావేశం నక్కలగుట్టలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన రెంటాల కేశవరెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన అపార్ట్‌మెంట్స్‌కు చెందిన కుటుంబాలు వారి అసోసియేషన్లను రిజిస్ట్రేషన్ చేయించుకొని జిల్లా శాఖ నుంచి సభ్యత్వం పొందాలని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా, ఆర్థిక కార్యదర్శి రాజ్‌కుమార్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షుడిని, ప్రధానకార్యదర్శిని, వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ట్రెజరర్‌ను, కార్యవర్గ సభ్యులను పూల దండలు, శాలువాలతో సన్మానించారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు డీవీ ప్రసాద్, నరేందర్‌రెడ్డి, స్వరూప, జాయింట్ సెక్రటరీలు ఎం.జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మాధవి, పద్మజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజనీదేవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రెంటాల కేశవరెడ్డి

విధుల్లో ఉన్న ఉద్యోగులకు మెమోలు?

● **'ఇద్దరు పిల్లలకు ఒకే ఆక్సిజన్'పై అధికారుల సీరియస్**

వరంగల్ మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఇద్దరు పిల్లలకు ఒకే ఆక్సిజన్' అనే ఆంధ్రజ్యోతి కథనంపై జిల్లా యంత్రాంగం సీరియస్‌గా స్పందించింది. ఎంజీఎంలో ఈ ఘటన జరిగిన రోజు విధుల్లో ఉన్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితోపాటు నాలుగో తరగతి ఉద్యోగులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటన పట్ల ప్రభుత్వం కూడా సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌పై వేటు వేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

రేసులో..

ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ రేసులో పలువురు వైద్యులు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ హరిచంద్రారెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయన గతంలో ఎంజీఎం ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. అలాగే జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బత్తుల శ్రీనివాస్, అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ చిలుక మురళి, ఆర్థో విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, జనరల్ సర్జన్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ పేర్లు సూపరింటెండెంట్ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

వివాహితపై కానిస్టేబుల్ లైంగికదాడి

● **బయ్యారం పీఎస్‌లో కేసు నమోదు**

బయ్యారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలానికి చెందిన ఓ వివాహితపై కానిస్టేబుల్ లైంగిక దాడి చేశాడని, దీంతో అతడిపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ దినేష్‌కు డ్యూటీ సందర్భంగా మండలానికి చెందిన ఓ వివాహిత మహిళతో పరిచయం ఏర్పడింది. 'నిన్ను నేను మంచిగా చూసుకుంటా' అంటూ ఆమెను అతడు శారీరకంగా లోబర్చుకున్నాడు. అనంతరం వారి ఇరువురి నడుమ వాట్సప్‌లో చాటింగ్, సంభాషణలు జరిగాయి. ఈ విషయాన్ని గమనించిన ఆ మహిళ భర్త ఆమెను నిలదీశాడు. దీంతో దంపతుల నడుమ గొడవ నెలకొనగా.. బాధిత మహిళ ఈ విషయాన్ని కానిస్టేబుల్ దినేష్ దృష్టికి తీసుకెళ్లింది. 'మన విషయం నా భర్తకు తెలిసింది. నన్ను విడిచిపెడుతానంటున్నాడు.. మనమిద్దం పెళ్లి చేసుకుందాం' అని అడగగా కానిస్టేబుల్ తిరస్కరించాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధిత మహిళ న్యాయం కోసం ఆదివారం బయ్యారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. తనను నమ్మించి మోసం చేసి శారీరంగా లోబర్చుకున్న కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. కానిస్టేబుల్‌పై లైంగికదాడి, చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి వెల్లడించారు.

అడవులను సంరక్షించుకోవాలి

డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్

ఖానాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వరంగల్ డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పాకాల అడవులను నర్సంపేట ఎఫ్‌ఆర్వో రవికిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాకాల, బుధరావుపేట, మంగళవారిపేట గ్రామాల పరిధిలోని అడవులను పరిశీలించారు. అటవీ జంతువుల కోసం అడవి మధ్యలో అక్కడక్కడ నీటి గుంతలను తీయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డీఎఫ్‌వో మాట్లాడుతూ.. అడవులతోనే పర్యావరణ సమతుల్యత ఉంటుందని అన్నారు. జీవవైవిధ్యానికి అడవులు నిలయమని అన్నారు. భూభాగంలో 33 శాతం ఉండాల్సిన అడవులు 22 శాతం మాత్రమే ఉన్నాయని చెప్పారు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు చేస్తున్న కృషి వల్ల అడవుల శాతం ఏటేటా పెరుగుతుందని తెలిపారు. పాకాల అడవులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నామని అన్నారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో రీనా, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



పాకాల అడవులను సందర్శించి సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్

రైతు సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయం

● వెలమ సంఘం బలోపేతానికి కలిసి కట్టుగా పనిచేయాలి

● భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి

న్యాశాయంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం వెలమ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో రైతు సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వెలమ సంక్షేమ సంఘం భవనంలోని పుత్కూరి మోహన్‌రావు ప్రాంగణంలో రైతు సదస్సు, కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు, నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శమని, రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. రైతు సదస్సు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు, పంటలు వేసే క్రమంలో ఇలాంటి సదస్సుల వల్ల మెలకువలు నేర్చుకుంటారన్నారు. వెలమ సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయిన వారు కూడా గెలిచిన వారితో కలిసి సంఘం చేసే కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. వెలమలు మంచికి మారుపేరన్నారు. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఫంక్షన్‌హాల్ నిర్మాణ స్థలం కోసం తనవంతు సహాయం చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతి కోసం రైతు సదస్సు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాబోయే రోజుల్లో కూడా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. వెలమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ వెలమసంఘం ఆధ్వర్యంలో గత నాలుగు నెలల్లో ఎన్నో కార్యక్రమాలు చేశామని వెలమ కులంలోని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశామని రాబోయే రోజుల్లో కూడా సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

వెలమ సంఘం ఈసీ మెంబర్ వెంకటేశ్వర్‌రావు 300 సభ్యత్వాలు చేయించినందుకు కార్యవర్గంతోపాటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పిన్నింటి బాలచందర్‌రావు, తక్కళ్లపల్లి శ్యాంసుందర్‌రావు, కోశాధికారి చిత్తూరి స్వామిరావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి విద్యాసాగర్‌రావు, కార్యవర్గ సభ్యులు చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్‌రావు, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, గండ్ర ప్రభాకర్‌రావు, గండ్ర గోపాల్‌రావు, అమృతరావు, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



పిన్నింటి వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌లో లక్కీడ్రా

● **విజేతను ఎంపిక చేసిన మేయర్ గుండు సుధారాణి**

● **మారుతి ఆల్టో కారు గెలుచుకున్న రాజ్‌కుమార్**



వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌లో డ్రా తీస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని వరంగల్ చౌరస్తాలోని వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌లో ఆదివారం రాత్రి లక్కీ డ్రా నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి డ్రా తీసి విజేతను ప్రకటించారు. మారుతి ఆల్టో కారు గెలుచుకున్న దేశాయిపేటకు చెందిన డి.రాజ్‌కుమార్ (కూపన్ నెం. యు-886)కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ నిర్వాహకులు ప్రదీప్‌కుమార్, హరీష్, సూరజ్, కార్పొరేటర్ పల్లం పద్మతో పాటు పల్లం రిషిత తదితరులు పాల్గొన్నారు.

పంటల లెక్క పక్కా..

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేకంగా నమోదు చేయాల ని, వరి పంట సాగును సన్న, ముతక రకాల వారీ గా నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. పంట విత్తిన వివరాలు నమోదు ద్వారా ఆ పంట ఎప్పుడు కోతకు వస్తుందో అంచనా వేయడం ద్వారా పంట కొనుగోలు, సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకునేందుకు వీలుంటుంది. ఉద్యాన సాగులో అంతర్ పంటలను కూడా సర్వేలో రికార్డు చేశారు. రైతు పేరు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ల్యాండ్ మార్క్, సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేశారు. పంటల వివరాలను నమోదు చేయగానే రైతు మొబైల్‌కు ఆరు సందేశాలు వెళ్లాయి. పంటల సాగులో తేడాలుంటే ఏఈవోను కలిసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

రైతులకు ఎంతో మేలు

గతంలో పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసే సమయంలో కచ్చితమైన విస్తీర్ణం లెక్కలు లేకపోవడంతో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ఈ సర్వేతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చు. మరో వైపు కొందరు దళారులు తక్కువ ధరకు రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొని వారి పేరిట కొనుగోలు కేంద్రాలకు తరలించి సొమ్ము చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికి, పంట ఉత్పత్తులను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లినప్పుడు నేరుగా విక్రయించుకోవడానికి పంటల సర్వే ఉపయోగపడుతుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటల నష్టం వివరాలు కచ్చితంగా తెలుస్తాయి. చీడపీడల నివారణకు రైతులు తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను తెలియజేసేందుకు సైతం దోహదపడుతుంది.

ఆగస్టులోనే చేయాల్సింది..

వాస్తవానికి ఆగస్టు నెల ప్రారంభానికి ముందు నుంచే పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలి. కానీ జిల్లాలో యూరియా కొరత, పంపిణీలో ఇబ్బందులు, పారదర్శకతకు సర్వే చేపట్టాల్సిన ఏఈవోలకు పంపిణీ బాధ్యతలు సైతం అప్పగించారు. దీనికితోడు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రైతు బీమా దరఖాస్తులు తదితర పనులు సైతం చేపట్టాల్సి వచ్చింది. పంటల సాగు నమోదు తప్పనిసరి కావడంతో ఆలస్యంగానైనా ఎట్టకేలకు పూర్తి చేశారు.

మార్కెట్ సమస్యలపై దృష్టి సారించాలి

● రైతు సంఘాల డిమాండ్

● నేడు ఏనుమాములకు మంత్రి, ఎమ్మెల్యే రాక



వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు సోమవారం ఏనుమాముల మార్కెట్‌కు వస్తున్నారు. సీసీఐ పత్తి కొనుగోలు సెంటర్లను వారు ప్రారంభిస్తారు. ఇందుకోసం మార్కెట్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ... సరిగ్గా ఏడాది తరువాత వారు మార్కెట్లో కాలుమోపుతున్నారు. గత ఏడాది అక్టోబరు 21న ఇదే మార్కెట్లో సీసీఐ పత్తి కొనుగోలు సెంటర్‌ను ప్రారంభించేందుకు వచ్చారు. మళ్లీ ఇప్పుడు వస్తున్నారు. మధ్యలో మామిడి మార్కెట్‌ను ప్రారంభించేందుకు ముసలమ్మకుంటకు వచ్చి వెళ్లిపోయారు.

సమస్యలు పరిష్కరించాల్సింది వాళ్లే..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజుదే.. జిల్లా మంత్రిగా, స్థానిక ఎమ్మెల్యేగా వీరిరువురు కలిసి మార్కెటింగ్‌శాఖ, మార్కెట్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించి ఆ దిశగా కృషి చేయాలి. కానీ, వీరు ఈ విషయంలో శ్రద్ధ చూపడం లేదనే అపవాదును ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా... ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయి ఉన్నాయి. ఇప్పటివరకు పాలకవర్గం లేదు. కార్యదర్శి లేదు. కావాల్సినంత సిబ్బంది లేదు. ఈ సమస్యలను పరిష్కరించకుండా రైతులకు మేలు చేస్తామని చెబితే ఎలా నమ్మాలని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అదే విధంగా ఏనుమాముల మార్కెట్‌తో పాటు లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్లో అనేక సమస్యలున్నాయి. అక్కడే ఉన్న పండ్ల మార్కెట్‌ను కూల్చి మూడేళ్లు గడిచింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పేరుతో అక్కడున్న పండ్ల దుకాణాలను కూల్చి వేసి వ్యాపారులను తరమివేశారు. ఆరు నెలల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు పూర్తి చేయలేకపోయారు. బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. అయినా ఇప్పటివరకు పట్టించుకున్నవారు లేరు. ఇప్పటికైనా మంత్రి, ఎమ్మెల్యే స్పందించి మార్కెట్లో ఉన్న సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే రైతులతో కలిసి మార్కెట్‌ను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాయి.

బినామీ హాజరుకు చెక్



- ఈ-కేవైసీ నమోదైతేనే ఉపాధి
- రెండుసార్లు ఫొటో తీస్తేనే కూలీల అకౌంట్లలో డబ్బు జమ
- అక్రమంగా హాజరు వేసే ఫీల్డ్ అసిస్టెంట్ల ఆగడాలకు బ్రేక్
- ఈ-కేవైసీ నమోదులో రాష్ట్రంలోనే హనుమకొండ జిల్లా టాప్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులలో నిబంధనలు ఎప్పటికప్పుడు మారుస్తున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెట్ల అవకతవకలకు అడ్డుకట్ట పడటం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాల నివారణకు పనుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేసేలా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేశారు. అయితే కొందరు కూలీలు పనులకు రాకున్నా ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు వేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలతో ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ కేవైసీ) ప్రక్రియ ప్రారంభించారు.

హనుమకొండ జిల్లాలో 2006 నుంచి నమోదైన కూలీలు మొత్తం 1,66,458 మంది ఉండగా, ఇందులో యాక్టివ్ కూలీలు 96,113 మంది ఉన్నారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉండి 3 ఏళ్లలో ఏ ఒక్క రోజు పనిచేసినా కూడా వారిని యాక్టివ్ కూలీలుగా పరిగణిస్తారు. జిల్లాలో ఉన్న 96,113 మంది యాక్టివ్ కూలీలలో ఇప్పటికే(90.23శాతం) జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో 86,688మంది కూలీల ఈకేవైసీ పూర్తయింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ప్రక్రియ గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లాలోని 12 మండలాల్లో ఉన్న 96,113 మంది యాక్టివ్ కూలీలలో ఆధార్ నమోదు చేసుకున్న కూలీలు 96,077 ఉండగా ఈ కేవైసీ 86చ688మంది కూలీలకు పూర్తి అయింది.

ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలకు చెక్

గతంలో జిల్లాలోని ఆత్మకూరు, ధర్మసాగర్, హసన్‌పర్తి, దామెర మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఆ ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోకుండా తమ సామాజికవర్గానికి చెందిన అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయా మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు దగ్గర అనుకున్న కూలీలు పనికి రాకున్నా హాజరు వేస్తూ వారి మెప్పు పొందుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారు. ప్రస్తుతం ప్రభుత్వం కూలీల ఫొటోలు రోజుకు రెండుసార్లు తీసే పద్ధతి తీసుకురావడంతో ఇక ఫీల్డ్ అసిస్టెంట్ల ఆటలు చెల్లవని పలువురు అంటున్నారు. కూలీ ఉదయం వచ్చినప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్ ఫొటో తీసుకోవాలి. మళ్లీ పని అయిపోయి వెళ్లేటప్పుడు మళ్లీ ఫొటో తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం నూతనంగా ఈకేవైసీ పద్ధతి తీసుకురావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్ట పడుతుంది.

హనుమకొండ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్

ఈ కేవైసీలో హనుమకొండ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని ప్రభుత్వం ఈ యేడు సెప్టెంబర్‌లో అన్ని మండలాల్లో ఈ కేవైసీ ప్రక్రియ ప్రారంభించింది. ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రారంభించారు. ఈ కేవైసీ ప్రక్రియలో రాష్ట్రంలోనే జిల్లా 90.23శాతంతో మొదటిస్థానంలో నిలిచింది. జిల్లాలోని 12మండలాల్లో ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతుండగా దామెర మండలం ఈకేవైసీ నమోదులో 98.66శాతంతో మొదటిస్థానంలో నిలిచింది. తర్వాత ఎల్కతుర్తి 98.21శాతం, ఆత్మకూరు 93.55శాతం, నడికూడ 93.09శాతం, పరకాల 91.47శాతం, భీమదేవరపల్లి 90.15శాతం, ధర్మ సాగర్ 89.25శాతం, శాయంపేట 88.81శాతం, ఐనవోలు 86.76శాతం, హసన్‌పర్తి 86.00శాతం, వేలేరు 85.60శాతం, కమలాపూర్ మండలంలో 85.49శాతం ఈకేవైసీ పూర్తయింది.



రెండుసార్లు ఫొటో తీస్తేనే హాజరు

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న క్రియాశీల కూలీల ఈకేవైసీని ఫీల్డ్‌అసిస్టెంట్లు మొబైల్‌లోని ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తారు. కూలీలు ఈ ప్రక్రియ నమోదు చేసుకుంటేనే వారి అకౌంట్లలో డబ్బు పడుతుంది. రెండుసార్లు ఫొటో తీసినా సరిగ్గా నమోదు అయితేనే కూలీల హాజరు పడుతుంది. ఈకేవైసీలో భాగంగా యాప్‌లో మొదటగా నమోదైన ఫొటో కూలీ పనికి వస్తేనే ఆన్‌లైన్‌లో హాజరు పడుతుంది. ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశం నుంచే పనుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తుండటంతో అవకతవకలు తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.



ఈ-కేవైసీ ప్రక్రియ ముమ్మరం చేశాం..

మేన శ్రీను, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

హనుమకొండ జిల్లాలోని 12 మండలాల్లో ఉన్న అన్ని గ్రామాల్లో ఈకేవైసీ ప్రక్రియ ముమ్మరం చేశాం. జిల్లాలో ఇప్పటికే 90.23శాతం పూర్తయింది. త్వరలోనే 100శాతం కూలీలు ఈ కేవైసీ చేసుకుంటారు. ఈకేవైసీ ప్రక్రియ ద్వారా ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరగకుండా ఉంటాయి. రాష్ట్రంలోనే ఈ కేవైసీ నమోదులో మన జిల్లా మొదటిస్థానంలో నిలిచింది.

సాంకేతిక అరణ్యం

వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల (నిట్) క్యాంపస్‌లో పర్యావరణం తొణికిసలాడుతోంది. ఎటుచూసినా ఏపుగా పెరిగిన చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం పరిఢవిల్లుతోంది. 250 ఎకరాల్లో విస్తరించిన నిట్‌ను పైనుంచి చూస్తే అడవి మధ్యలో ఉన్నట్టు కనిపిస్తోంది. వేలాది చెట్ల మధ్య బహుళ అంతస్తుల భవనాలు, వందకుపై ప్రయోగశాలలు, 50కిపైగా విభాగాలు, విద్యార్థుల హాస్టల్ భవనాలు, భోజనశాలలు, అందంగా కనిపించే పరిపాలనా భవనం, విశాలమైన ఆడిటోరియం, ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియం వంటి పలు భవనాల నిర్మాణం జరిగినా పచ్చదనానికి మాత్రం కొదవలేదు. దట్టంగా పరుచుకున్న పచ్చిక బయళ్లు, క్యాంపస్ అంతా ఎత్తైన అనేక చెట్లు నగరం మధ్యలో వెలిసిన దట్టమైన అడవిని తలపింప చేస్తోంది.

ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్/హనుమకొండ

- అడవిని తలపిస్తున్న నిట్ క్యాంపస్
- దట్టంగా పెరిగిన చెట్లు.. చుట్టూ పరుచుకున్న పచ్చదనం



దట్టంగా పెరిగిన చెట్ల మధ్య వరంగల్ నిట్ కళాశాల



పర్వతగిరిలో ఏర్పాటు చేసిన గోశాల

గోమాత రక్షతి రక్షితః..!

భారంగా గోశాల నిర్వహణ

దాతలు ముందుకు రావాలంటూ పిలుపు

పర్వతగిరిలో ఆదర్శంగా గోశాల నిర్వాహకుడు

పర్వతగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోవులు గ్రామాల్లో రక్షించబడితే వాటి ద్వారా మనం రక్షించబడతామనేది పెద్దల మాట. గ్రామాల్లో ప్రతి వ్యవసాయ దారుడి ఇంట్లో గోవులు ఉండేవి. వాటి ద్వారా లభించే పాలను తాగడం ద్వారా కుటుంబసభ్యులు ఆరోగ్యంగా ఉండేవారు. పశువుల పేడతో రైతులు పండించే వ్యవసాయ పొలాల్లో చల్లడం సేంద్రియ సాగు ద్వారా భూమి సురక్షితంగా ఉండేది. కానీ నేడు పశువుల పోషణ కరువైంది. వాటిని రక్షించేవారు లేక సేంద్రియ సాగు పద్ధతులను మరిచి రసాయనికి పురుగుల మందులకు రైతులు అలవాటు పడ్డారు. కానీ గోవులను రక్షిస్తూ వాటి ప్రాముఖ్యను చూపుతూ ఓ వ్యక్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఎనిమిదేండ్లు నిర్వహణ

వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన వేణుగోపాల స్వామి గుడి అర్చకుడు మోపర్తి పనిశర్మ ఎనిమిదేండ్ల కిందట గోశాల నిర్వహణకు ముందుకు వచ్చారు. దీంతో దుబ్బ నారాయణ ఇంటి స్థలాన్ని అడగ్గా ఉచితంగా అందించాడు. ఇతర క్షేత్రాల నుంచి గోవులను తీసుకువచ్చి వాటిని సురక్షితంగా చూసుకుంటూ 40 ఆవుల వరకు పెంచాడు. ఇటీవల కాలంలో గోమాతలను పెంచుకునే వారికి ఉచితంగా 18 ఆవులను పంపిణీ చేశాడు.

భారంగా నిర్వహణ

గోవుల ఆలనా పాలనా చూసుకోవడం కోసం ఇద్దరు వ్యక్తులను నియమించాడు. వారికి జీత భత్యాలు నెలకు రూ.20వేల వరకు అవుతుండగా, పశుగ్రాసం, ఇతర నిర్వహణ ఖర్చులు ఫణిశర్మ తన సొంతంగానే ఖర్చు చేస్తున్నాడు. దాతల సహకారం అంతలా లేకపోవడం ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెపుతున్నాడు. పశువుల మేత కోసం కొంత మంది దాతలు సహకరిస్తున్నట్లు ఇతర వాటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపాడు. గో సంరక్షణ కోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని, గోవులను కాపాడితే మనల్ని కాపాడుతాయని పిలుపునిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

రైతులు కలేబరాలను తరలించొద్దు...

రైతులు పశుపోషణ భారమై కలేబరాలను గోవులను అమ్మవద్దు. తన గోశాలకు అప్పగించాలి. గోశాలలో ఉన్న ఆవులను గో ప్రేమికులు ఒక్కో గోమాతకు దత్తత తీసుకోవాలి. తద్వారా తనతో పాటు గోమాతకు సేవ చేసిన వారవుతారు.

- ఫణిశర్మ, గోశాల నిర్వాహకుడు



కోచ్‌ఫ్యాక్టరీ పనులు పూర్తయ్యేనా..?

- డిసెంబరు గడువు దాటే అవకాశం
- నేడు పనులను పరిశీలించనున్న ఎంపీ కావ్య
- రైల్వే ఉన్నతాధికారులతో సమీక్ష



అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న కోచ్‌ఫ్యాక్టరీ

కాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సమీపంలోని అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌లో పూర్తి అయ్యేట్టు లేదు. పనులు పూర్తికావడానికి మరో మూడు నెలలు సమయం పట్టొచ్చని రైల్వే అధికారులు అంచనావేస్తున్నారు. 160ఎకరాల్లో సుమారు రూ.786 కోట్లతో 2023 జూలై 8న ప్రధాని మోదీ కోచ్‌ఫ్యాక్టరీ పనులను ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో వర్చువల్‌గా ప్రారంభించారు. డిసెంబరు 2025 నాటికి కోచ్‌ఫ్యాక్టరీ ప్రారంభించి కోచ్‌ల ఉత్పత్తికి ప్రణాళికలు చేసినప్పటికీ కోచ్‌ఫ్యాక్టరీ పలుమార్లు అప్‌గ్రేడ్ చేశారు. ఓవరాలింగ్ షెడ్ తోపాటు కోచ్‌ల తయారీ మాత్రమే కాకుండా ఎలక్ట్రికల్ ఇంజన్లు, వందేభారత్ కోచ్‌ల తయారీలకు కేంద్రం సిగ్నల్ ఇవ్వడంతో వాటి మిషనరీలు ఇతర దేశాలనుంచి తెప్పించడంతో పాటు ఇతరత్రా షెడ్‌ల నిర్మాణాకి మరింత సమయం పెరిగింది. దీంతో మరో మూడు నెలలు సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, ప్యాకేజీ సబ్‌స్టేషన్, రెస్ట్ హౌజ్, పవర్‌టెస్ట్, రోడ్‌వే బ్రిడ్జ్, వ్యాగన్ వే బ్రిడ్జి ట్రాక్‌లు, వ్యాగన్ వే బ్రిడ్జి, స్క్రాప్‌బిన్ లాంటి ఇతరత్రా పనులు దాదాపు 80 శాతం వరకు పూర్తయ్యాయి.. ఇంకా రైల్వే క్వార్టర్స్, మిషన్‌ల ఫిట్టింగ్, కనెక్టివిటీ రోడ్‌లు, పూర్తి కావల్సి ఉంది.

నేడు పరిశీలించనున్న ఎంపీ కావ్య

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని వరంగల్ ఎంపీ కడియం కావ్య సోమవారం సందర్శించనున్నారు. ఉదయం 10గంటలకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి కోచ్‌ఫ్యాక్టరీ చేరుకుని నిర్మాణపనులు, మిషనరీలను పరిశీలించనున్నారు. నిర్మాణ పనులు ఎక్కడి వరకు వచ్చాయి, నిర్మాణం ఆలస్యం కావడానికి గల కారణాలపై రైల్వే అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. ఆ తర్వాత అక్కడే నిర్మాణపనులు చేపడుతున్న రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) అధికారులతో కలిసి నిర్మాణ పనులపై సమీక్ష చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పరకాలలో మహారుద్రయాగం

- నవంబరు 3న నిర్వహణ
- శ్రీ భవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాట్లు
- 108 హోమగుండాలతో 500 జంటలతో పూజలు
- రూ.40 లక్షల వ్యయంతో యాగం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

పరకాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సుఖసంతోషాలతో, రైతులు సాగు చేస్తున్న పంటల అభివృద్ధి, వ్యాపారుల అభివృద్ధే ధ్యేయంగా పరకాల నియోజకవర్గ కేంద్రంలోని శ్రీభవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో నవంబరు 3న అతిపెద్ద మహా రుద్ర యాగ మహోత్సవం నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా భూ పరీక్ష, సర్వనంది తీర్థం, సంగ్రహణ, సమీక్ష, అంకురార్పణ, ధ్వజావాపన, మహారుద్ర వంటి పూజా కార్యక్రమాలను 20 రోజులపాటు దేవస్థానంలో నిర్వహించి 21వ రోజున కార్తీకమాసం నవంబరు 3న సోమవారం రోజున దేవస్థానం ఆవరణలో శ్రీకళయుక్త యాగశాలను అష్టోత్తర శతస్థాయి యుక్త అష్టార శత కుండాత్మకంగా అతి వైభవంగా నిర్వహించనున్నారు.

వేద పండితులతో..

516జంటల భక్తజనంతో 108 హోమగుండాలతో నిర్వహించే యాగ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులతో 51 మంది పండితులు పాల్గొని హోమాన్ని నిర్వహించనున్నారు. 10 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమంతోపాటు బెల్లం పాయసం, ప్రసాద తీర్థాలను అందించనున్నారు. పరకాల పట్టణంతోపాటుగా భూపాలపల్లి,కరీంనగర్, హనుమకొండ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందస్తుగానే సిద్ధం చేసుకుంటున్నారు.



పరకాలలో ఏర్పాటు చేస్తున్న యాగశాల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

40 ఏళ్ల పోరాటం సుభిక్షం

భవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానం సంబంధించిన నాలుగు ఎకరాల 11 గుంటల భూమి గత 40ఏళ్లుగా కోర్టు కేసులో ఉండేది. కొందరు పట్టణానికి చెందిన ప్రముఖులు, దేవాలయానికి సంబంధించిన భూమి కాజేసేందుకు తమ దగ్గర ఉన్న డూప్లికేట్ పత్రాలతో 4 ఎకరాల 11 గుంటల భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించారు. దానికి సంబంధించిన కోర్టు తీర్పుతోపాటు రెవెన్యూ అధికారుల సూచనల మేరకు ఇటీవల ఆ భూమి దేవస్థానానికే చెందినదని తీర్పు రావడంతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధం చేశారు.

మహా రుద్రయాగానికి రూ. 40 లక్షల మేరకు ఖర్చు అవుతుండటంతో హోమాన్ని నిర్వహించే భక్తజనంతోపాటు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు సహాయం అందజేశారు. నగదు రూపంతోపాటు యాగానికి కావాల్సిన అన్నదానం, సౌండ్ సిస్టం, యాగశాల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున సహకరిస్తున్నారు. నవంబరు 3న నిర్వహించే యాగానికి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

పరకాల పట్టణ కేంద్రంలోని పశువుల మైదానంలో నవంబరు 3వ తేదీన నిర్వహించనున్న కార్తీకమాస మహారుద్ర యాగ ఏర్పాట్లను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, నిర్వాహకులు, సేవా సంస్థల ప్రతినిధులతో ఏర్పాట్లను సమన్వయంతో చేయాలని సూచించారు. యాగం ఘనంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

ప్రజల సుఖశాంతుల కోసం..
పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న మహారుద్ర యాగం గతంలో ఎక్కడా జరగని విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. పెద్ద ఎత్తున భక్తులు వస్తారని వారిని సంబంధించిన పూర్తి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పరకాల నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల జిల్లాల భక్తజనం వచ్చి యాగంలో పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలి.

రైతులకు షాక్

- రబీ సీజన్‌కు ముందే అన్నదాతలకు ఇబ్బందులు
- పెరగనున్న ఎరువుల ధరలు
- ఉమ్మడి జిల్లాలో రైతులపై రూ. 20 కోట్ల ఆర్థిక భారం

హనుమకొండ, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల ధరలు పెరగనున్నాయి. ఇటీవల యూరియా దొరక్క ఇబ్బందులు పడ్డ అన్నదాతలకు మరో షాక్ తగలనున్నది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు మరికొన్ని కాంప్లెక్స్ ఎరువుల ఎగుమతులను ఈనెల 15 నుంచి చైనా నిలిపి వేసింది. దీనివల్ల మన దేశంలో ఎరువుల ధరలు 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం కనిపిస్తోంది.

పెరగనున్న సాగు విస్తీర్ణం

వానాకాలం సీజన్ పూర్తి అయింది. ప్రస్తుతం యాసంగి కింద రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సాధారణంకన్నా ఎక్కువ కురవడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. భూగర్భ జలాలు పైపైనే ఉండటంతో ఆయకట్టు సాగు మరింత పెరగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వానాకాలం సీజన్ కంటే ముందుగా పెరిగిన ధరలు.. తాజాగా మళ్లీ పెరగడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. యూరియా, డీఏపీలను మినహాయించి కాంప్లెక్స్ ఎరువుల ధరలను మాత్రమే పెంచారు. యాసంగిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18.50 లక్షల ఎకరాల్లో సాగు ఉంటుంది. ఇందుకు గాను 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయి.

కాంప్లెక్స్ వినియోగం ఎక్కువ

ఈ ఎరువుల్లో యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. తాజాగా వినియోగంలో ఎక్కువగా ఉండే కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచడం రైతులకు మరింత భారంగా మారనున్నది. ప్రస్తుతం డీఏపీ ధర ఒక సంచి రూ.1,350 ఉండగా, తాజా ఈ ధర రూ.1,350 మేరకు పెరగనున్నది. అలాగే 20:20:13 ఎరువు రూ.1,350 నుంచి రూ.1,400 వరకు, 14:35:14 ఎరువు రూ.1,850 నుంచి రూ.1,900 వరకు, 10:26:26: రూ.1,800 నుంచి రూ.1,825 వరకు 20:20:0:13 రూ.1,300నుంచి రూ.1,375, 24:24:0 రూ.1800 నుంచి రూ. 1650 వరకు పెరగనున్నది 28.28.0 ప్రస్తుత ధర రూ.1800 యథాతథంగా ఉండవచ్చు. అయితే ఈ సీజన్‌లో ఎరువుల సమస్య పెద్దగా ఉండదని, వ్యాపారులు ఇప్పటికే అంతర్జాతీయ ఏజెన్సీల ద్వారా తగినంత ఎరువుల నిల్వలను భద్రపరచారని వ్యాపారవర్గాలు తెలిపాయి. అయినప్పటికీ ధరల పెరుగుదల మాత్రం తప్పదని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం 16 లక్షల ఎకరాల వరకు ఉండవచ్చునని అంచనా.



దుక్కి దున్నుతున్న రైతు

సంచిపై రూ.50 పెరుగుదల

యాసంగిలో సాగు చేసే పంటలకు వేసే ఎరువుల ధరలు మరింత భారం కానున్నాయి. తాజాగా కొన్ని కాంప్లెక్స్ ఎరువుల ధరలు సంచికి రూ.50 పెరగనున్నాయి. మరికొన్నింటి ధరలు ఇంతకన్నా ఎక్కువ పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ప్రముఖ కంపెనీల డీలర్లకు సమాచారం అందింది. ప్రస్తుతం పాత నిల్వలు ఉండటంతో గతంలో ఉన్న ధరలకే విక్రయిస్తున్నారు. యాసంగి సీజన్‌లో రైతులు వినియోగించే ఎరువుల ధరలు పెరుగుతాయని కంపెనీలు అంటున్నాయి. ధరల పెరుగుదల వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులపై రూ. 20 కోట్ల ఆర్థిక భారం పడనున్నట్టు అంచనా.

రైతులు 9.50 లక్షలు. ఎరువుల వినియోగం 5.40లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుంది. ఎరువుల ఎగుమతులపై చైనా ఆరు నెలల వరకు నిషేధం విధించింది. ఆ తర్వాత అయినా ఈ నిషేధాన్ని ఎత్తి వేయకపోతే రైతులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొక తప్పదని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

మన దేశం 90శాతం కాంప్లెక్స్ ఎరువులను చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నందువల్ల ఈ పరిస్థితి ఉత్పన్నం కానున్నదని చెబుతున్నారు. ఈలోగా ప్రభుత్వ ఎరువుల కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28, 29, 30 తేదీల్లో వనపర్తి జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆదివారం కేయూ పరిపాలన భవనం ఎదుట పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా కార్యవర్గ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్‌లు మాట్లాడారు. 50 ఏళ్ల పీడీఎస్‌యూ ప్రస్థానంలో విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేశామని అన్నారు. తెలంగాణ రాష్ట్రావిర్భావం తర్వాత నాలుగో మహాసభలు వనపర్తిలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహాసభలకు విద్యార్థులు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు అరుణ్, చైతన్య, ఆకాశ్, మహారాజ్, యుగేందర్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న స్టీరింగ్ కమిటీ సభ్యులు విట్టల్

మోడల్ స్కూల్ టీచర్లకు వేతనాలు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ టీచర్లు, సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని మోడల్ స్కూల్ సంఘాల ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం హనుమకొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో కమిటీ సభ్యులు విట్టల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ సభ్యులు విట్టల్, కొండయ్య, అరవింద్, శివప్రసాద్, మహేష్, సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సర్కారు అవలంబిస్తున్న విధానంగా 010 పద్దు ద్వారా మోడల్ స్కూల్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలన్నారు. సర్వీస్‌లో ఉండగా మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలన్నారు. నోషనల్ సర్వీస్ ఇవ్వాలని, హిందీ పీజీటీ పోస్టులు మంజూరు చేయాలని, తెలంగాణ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, స్పాట్ వాల్యూయేషన్‌లో సీఎస్, డీవో, సీఈ, ఎస్ఈ లుగా మోడల్ స్కూల్ టీచర్లకు అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే ప్రిన్సిపాల్స్‌కి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశ్రీ, శశికుమారి, సంధ్య, హైమావతి, రుద్రమదేవి, నీలాద్రి, బాలకిషన్, కిరణ్, శ్రీధర్, శ్రీకాంత్, విశ్వనాథ్, సరోజ, సుధాకర్‌రెడ్డి, వెంకన్న, వేణుగోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్పీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జిగా నరేష్



వడ్డెపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పట్టణానికి చెందిన సామర్ల నరేష్ బహుజన రాజ్యాధికార పార్టీ (బీఆర్పీ) రాష్ట్ర మీడియా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. బీఆర్పీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

హెడ్మాస్టర్‌పై కానిస్టేబుల్ దాడిని ఖండిస్తున్నాం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):తప్పుడు ధృవపత్రం ఇవ్వాలని దూషిస్తూ హెడ్మాస్టర్‌పై పోలీస్ కానిస్టేబుల్ దాడిచేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలంగాణ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జయప్రకాశ్, పాక విజయ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజమార్గదర్శకులైన ఉపాధ్యాయులపై అన్యాయాలను అరికట్టాల్సిన పోలీసులు దాడిచేయడం హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా రేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్‌పై కానిస్టేబుల్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్ల ఆర్థిక సహాయం



ప్రమాదంలో గాయపడిన రాళ్లబండి ఏకాంబ్రంకు ఆర్థిక సహాయం చేస్తున్న ఆటోడ్రైవర్లు

హనుమకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దే ఉంటున్న హనుమకొండలోని బాలసముద్రంకు చెందిన ఆటో డ్రైవర్ రాళ్లబండి ఏకాంబ్రంకు ఆదివారం ఓన్ ప్లేట్ ఆటో డ్రైవర్స్ మిత్ర బృందం ఆధ్వర్యంలో రూ.19వేల ఆర్థిక సహాయం అందించి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.మహేష్, సీహెచ్. కృష్ణ, డీజే నరేష్, ఎం.రమేష్, ఎ.రాజేందర్, గణేష్, ప్రవీణ్, చిరంజీవి, సురేష్, అశోక్, విజయ్, నవీన్, మహేందర్, పరశురాములు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా స్మార్ట్ రోడ్ కబ్జా

- ప్రారంభానికి ముందే మాయమవుతున్న ఫుట్‌పాత్‌లు
- పార్కింగ్ స్థలంలా స్మార్ట్ రోడ్ వాడకం
- రంగశాయిపేట నుంచి కరీమాబాద్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు అంతే తంతు..
- గడువు లోగా పనులు ముగిసేనా..
- నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు

శంభునిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్మార్ట్ సిటీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్లుగా ఊగిసలాడుతున్నాయి. ముఖ్యంగా గవిచర్ల క్రాస్ రోడ్ జంక్షన్ నుంచి కరీమాబాద్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు చేపట్టిన పనులను వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ఈ పనులు ఇప్పటివరకు సగం కూడా పూర్తి కాలేదు. ఫలితంగా ఈ రోడ్డు క్రమంగా కబ్జా అవుతోంది. ఇప్పటికే ఫుట్‌పాత్‌లు మాయమయ్యాయి.తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నగరంలో గవిచర్ల క్రాస్ రోడ్ జంక్షన్ నుంచి కరీమాబాద్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు 3.5 కిలోమీటర్ల దూరం రూ.14 కోట్లతో స్మార్ట్ రోడ్ పనులను 2021లో ప్రారంభించారు. మొదట 60 ఫీట్ల రోడ్‌గా ప్రతిపాదించగా రాజకీయ నయకుల ఒత్తిళ్లతో ఇష్టారాజ్యంగా రోడ్ విస్తరణను కుదించారు. కొన్ని చోట్ల 60 ఫీట్లు ఉంటే మరో దగ్గర 20 ఫీట్లకే పరిమితం చేశారు. దీంతో స్మార్ట్ రోడ్‌కు విస్తరణలోనే ఆటంకం కలిగింది. రోడ్ నిర్మాణంలో భాగంగా అండర్ డ్రైనేజీ, వాకింగ్ ట్రాక్‌తో కూడిన ఫుట్‌పాత్, ఎల్ఈడీ లైటింగ్ నిర్మించాల్సి ఉంది. కాని ఇప్పటి వరకు డ్రెయినేజీ పనులనే పూర్తి చేయలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపిస్తోంది.

ఫుట్‌పాత్ కబ్జా..

ఇదిలా ఉండగా స్మార్ట్ రోడ్ నిర్మాణం పూర్తి కాకముందే ఇరువైపులా ఫుట్‌పాత్ కబ్జా అవుతోంది. ఎవరికి వారు రాంప్‌లు వేసి మరీ వాడుకుంటున్నారు. ఇష్టానుసారంగా డబ్బాలు వేసుకొని రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్నారు. మరికొందరు పార్కింగ్ స్థలంగా వాడుకుంటున్నారు. రంగశాయిపేట నుంచి ఆర్వోబీ బ్రిడ్జి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. రంగశాయిపేటలో ఓ ప్రైవేటు ఆస్పత్రి ముందు రోడ్డు పైనే ప్రతీ రోజు పదుల సంఖ్యలో వాహనాలు రోడ్డు పైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతోంది.

నిలిచిపోయిన పనులు..

స్మార్ట్ రోడ్ పనుల్లో ఇప్పటి వరకు 60 శాతం కూడా చేయలేదని తెలుస్తోంది. రంగశాయిపేట ఎల్లమ్మ ఆలయం వద్ద డివైడర్‌లను వదిలేయడంతో మందుబాబులు వాటిని అడ్డాగా చేసుకున్నారు. అండర్ డ్రెయినేజీలో చెత్త పేరుకుపోయి కంపుకొడుతోంది. వీధి లైట్లు లేక రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటోంది.

గడువు లోపు పూర్తయ్యేనా...

2021లో శంకుస్థాపన చేసిన ఈ స్మార్ట్ రోడ్ పనులు వాస్తవానికి 2023 జూన్ లోపే పూర్తి కావాలి. కాని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు, నాయకుల పర్యవేక్షణ లోపంతో ఇప్పటికే రెండు సార్లు గడువును పొడగించారు. మొదట 2025 మార్చి 31 వరకు ఉన్న గడువును వరంగల్ ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి మేరకు కేంద్రం డిసెంబర్ 31 వరకు పొడిగించింది. ఇప్పటికైన సకాలంలో పనులు పూర్తి చేస్తారో లేదో వేచిచూడాలి.

రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వాలి..
-తాళ్ళపల్లి అర్జున్, బీజేపీ నాయకుడు



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ సిటీ పనులను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. సకాలంలో నిధులు విడుదల చేయలేకపోయింది. ఇప్పటికైనా స్పందించకుంటే కేంద్రం నుంచి వచ్చిన నిధులు తిరిగి వెళ్ళే అవకాశం ఉంది.

పర్యవేక్షణ లోపం కనపడుతోంది..
-కొంతం మోహన్, స్థానిక నాయకుడు



స్మార్ట్ రోడ్ పనుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి. స్మార్ట్ రోడ్‌ను నగర ప్రజలకు స్మార్ట్‌గా చూపెట్టాలి.

స్మార్ట్ సిటీ అంటే..

దేశంలోని వంద నగరాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచటం, ప్రజల ప్రామాణిక, ఆర్థిక వృద్ధిని పెంచటమే లక్ష్యంగా 2015 ఆగస్టు 27న కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ మిషన్ (ఎస్‌సీఎం) పథకాన్ని తీసుకువచ్చింది. ఇందులో తెలంగాణ నుంచి వరంగల్, కరీంనగర్ నగరాలకు చోటు కల్పించింది. వరంగల్ నగరానికి రూ.2860 కోట్లతో డీపీఆర్‌ను రెడీ చేసి నగరంలో పలు అభివృద్ధి పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50-50 శాతం నిధులతో పనులను ప్రారంభించారు. అందులో భాగంగానే కరీమాబాద్ రోడ్ పనులను ప్రారంభించారు.



ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన కారు



ఫుట్ పాత్ పై వెలిసిన డబ్బాలు



అంపూర్తిగా నిలిచిపోయిన డ్రైనేజీ నిర్మాణం



ఫుట్‌పాత్‌ను పార్కింగ్ కోసం వాడుతున్న దృశ్యం

వడ్డెరలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలి

వడ్డెపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడిన వడ్డెరలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొంత మురళి అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొంత ఐలయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరను గుర్తించి మైనింగ్, గ్రానైట్ క్వారీల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. వడ్డెర కులస్తులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఎమ్మెల్సీతో పాటు కార్పొరేషన్ పదవులను కేటాయించి సముచిత స్థానం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బొంత మురళి విజ్ఞప్తి చేశారు. అనంతరం హనుమకొండలోని అలంకార్, అమృత థియేటర్ వడ్డెర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బొంత మురళి, బొంత ఐలయ్య ప్రకటించారు.అధ్యక్షుడిగా గండికోట జంపయ్య, గౌరవ అధ్యక్షుడిగా పల్లపు శ్రీను, ఉపాధ్యక్షులుగా ఓర్సు రాజు, సూర రవి, సూర సురేష్, ప్రధాన కార్యదర్శిగా సూర రాము, కార్యదర్శిగా గుంజ శ్రీను, సహాయ కార్యదర్శిగా పల్లపు సురేష్, కోశాధికారిగా సూర రాజు, ప్రచార కార్య దర్శిగా గుడిశాల నాగరాజు ముఖ్య సలహాదారుడిగా వేముల జంపయ్యలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులుగా బొంత రాజు, బొంత శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.



నూతన కమిటీని ప్రకటిస్తున్న బొంత మురళి, బొంత ఐలయ్య

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు



వనభోజనాలకు బయలుదేరి వెళుతున్న సంఘం సభ్యులు

మట్టెవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం రోడ్డు ఆర్యవైశ్య వాసవి మాత పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాస వనభోజనాలకు వెళ్లారు. ఇందుకోసం సిద్ధిపేటలోని పార్థివ కోటిలింగేశ్వర ఉమామహేశ్వర దేవాలయానికి వెళ్లినట్లు సంఘం అధ్యక్షుడు ఇరుకుల్ల రమేశ్ తెలిపారు. అనంతరం దేవాలయంలో అర్చన, అభిషేకాలు, ఉసిరి చెట్ల కింద వత్తులు వెలిగించి, భోజనాలు చేశారు. సంఘం ఆధ్వర్యంలో 11బస్సులలో 500మంది సభ్యులతో వనభోజనాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఇరుకుల్ల రమేశ్, సెక్రటరీ ఎ.సత్యనారాయణ, కోశాధికారి రజనికాంత్, రమేశ్, వీరభద్రరావు, తోట నవీన్, వెంకటకృష్ణ, మాధవ్, శ్రీనివాస్, సర్వేశ్వర్‌రావు, పనేష్, శ్రీనివాస్, రాజన్న, భరత్, ప్రవీణ్, రమేశ్, మల్లికార్జున్, అశోక్ పాల్గొన్నారు.

సజ్జనార్‌ను కలిసిన చారిటబుల్ ట్రస్టు సభ్యులు



సీపీ సజ్జనార్‌ను కలిసిన ట్రస్టు సభ్యులు

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్‌ను రాజేంద్రప్రసాద్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైల్డ్, మహిళా వెల్ఫేర్‌కు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. సీపీని కలిసిన వారిలో హైకోర్టు అడ్వకేట్ వనజతో పాటు బి.సత్యనారాయణ, క్రాంతికుమార్, ఎండి అహ్మద్ ఉన్నారు.

సహకార సంఘాలతో ఆర్థికాభివృద్ధి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మట్టెవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పరపతి సంఘాలు సభ్యులు ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తున్నాయని స్నేహ సహకార పరపతి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డ వీరలింగం, కొత్త వెంకటకృష్ణ అన్నారు. ఆదివారం వరంగల్ పిన్నవారి వీధిలోని స్నేహ సహకార పరపతి సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా దొడ్డ వీరలింగం, ఉపాధ్యక్షుడిగా అడ్డగుడి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కొత్త వెంకటకృష్ణ, కోశాధికారిగా ఆకారపు రవీందర్, ఆర్గనైజర్లుగా పిన్న సతీష్, మాడిశెట్టి మహేశ్, పడిశాల ఆనంద్, మాడిశెట్టి అశోక్, కార్యవర్గ సభ్యులుగా పిన్నా విజయ్ కుమార్, బూర సంజీవ్ కుమార్, రవ్వ శ్రీనివాస్, సింగారపు రామనాథం, మంచన శ్యాంసుందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

న్యూశాయంపేటలో చిన్నారిపై కుక్కల దాడి

న్యూశాయంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేట టైగర్ హిల్స్ కాలనీలో 5 ఏళ్ల చిన్నారిపై శనివారం సాయంత్రం కుక్కలు మూకుమ్మడిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికుల కథనం ప్రకారం.. టైగర్ హిల్స్ కాలనీకి చెందిన సతీష్ సుశ్మితల కూతురు క్రితిక ఇంటి బయట ఆడుకుంటుండగా సుమారు 10 కుక్కలు చిన్నారిపై పడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తల్లిదండ్రులు చిన్నారిని ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు.



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి క్రితిక

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



రామకృష్ణ తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న బాల్య మిత్రులు

శంభునిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాల్య మిత్రుడు అకాల మరణం చెందడంతో సహచరులందరూ స్పందించారు. మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించి అండగా నిలిచారు. రంగశాయిపేటకు చెందిన బొడిగె రామకృష్ణ ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆయనతో పాటు మామునూరు రామకృష్ణ హైస్కూల్‌లో చదువుకున్న 1997-98 బ్యాచ్ పదో తరగతి మిత్రులు ఆదివారం రామకృష్ణ సంస్మరణ సభకు హాజరై నివాళులు అర్పించారు. రామకృష్ణ తల్లిదండ్రులు బొడిగె సాంబయ్య, జయలక్ష్మిలను ఓదార్చి రూ.36,000 అందజేశారు. ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఖమ్మం రోడ్‌లో వాహనాల తనిఖీ

ఖిలావరంగల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని ట్రాఫిక్ ఎస్సై ఎం.కుమారస్వామి అన్నారు. ఇటీవల కర్నూల్‌లో జరిగిన బస్సుప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఖిలావరం గల్-ఖమ్మంరోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. చింతల్ ఫ్లైఓవర్ నుంచి వర్ధన్నపేట, తొర్రూరు, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడకు వెళ్లే లారీలు, డీసీఎంలు, కార్లు, గూడ్స్ వాహనాలతో పాటు టూ రిస్టుబస్సులు, డీలక్స్ బస్సులను ఆపి లైసెన్సులు, వాహనాల ఆర్‌సీ బుక్‌లను తనిఖీ చేశారు. గూడ్స్ బండ్ల డ్రైవర్‌లను బ్రీత్ అనలైజర్‌తో టెస్ట్ చేశారు.

దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి ఆదివారం పురస్కరించుకొని ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం అలంకరణ, నైవేద్య నివేద, మహా మంగళహారతి, దివ్యనామ సంకీర్తన నిర్వహించి సాయంత్రం కాగడ హారతి పట్టారు. దత్తక్షేత్రంలోని శ్రీసచ్చిదానందేశ్వర సదాశివుడికి కార్తీక మాసం పురస్కరించుకొని ప్రతీరోజు ఉదయం రుద్రాభిషేకాలు నిర్వహిస్తామని, భక్తులందరు అభిషేకాల్లో పాల్గొనాలని టస్టు సభ్యులు వైవీ వామన్‌రావు కోరారు.

కోటను సందర్శించిన ఇంగ్లండ్ దేశస్థులు

ఖిలావరంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ఖిలావరంగల్‌ను ఆదివారం ఇంగ్లండ్ దేశస్థులు తిలకించారు. మధ్యకోటలోని శిల్పాల ఆవరణ, కీర్తితోరణాలు, శిల్పసంపద, ఖుష్‌మహల్, ఏకశిలగుట్ట, శృంగారపు బావి, స్వయంభూ-శంభులింగేశ్వరస్వామి దేవాలయం, రాతికోట, మట్టికోటల గురించి, కాకతీయుల కాలంనాటి చరిత్ర విశేషాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిచెల్ రిచర్డ్-ఎలిజబెత్ దంపతులు మాట్లాడుతూ.. కాకతీయుల కాలంనాటి కట్టడాలు, కళాఖండాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.



ఖుష్‌మహల్ వద్ద విగ్రహాలను పరిశీలిస్తున్న ఇంగ్లండ్ దేశస్థులు

నులిపురుగులకు చెక్ ఇలా...



సాధారణంగా పిల్లలకు కడుపులో నులిపురుగులు చేరుతూ ఉంటాయి. దీంతో పిల్లలు నీరశించిపోతూ ఉంటారు. వారి ఎదుగుదల ఆగిపోతుంది. అనారోగ్యానికి గురవుతుంటారు కూడా. అలా కాకుండా చిన్న చిట్కాలతో ఈ నులిపురుగుల సమస్యను వదిలించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు...

- రోజూ రెండు లేదా మూడు పచ్చి వెల్లుల్లి రెబ్బలను పిల్లలతో తినిపిస్తూ ఉంటే సమస్య తీరుతుంది. వెల్లుల్లిలోని సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు... కడుపులోని పురుగులను నాశనం చేస్తాయి.
- గుమ్మడి గింజల్లో కుకుర్‌బిటాసిన్ సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణాశయంలో చేరే పురుగులను తొలగించడానికి దోహదం చేస్తుంది. రోజూ పిల్లలు తినే ఆహారంలో గుమ్మడి గింజలు చేర్చడం మంచిది.
- నులిపురుగులను తొలగించడంలో బొప్పాయి పండు ఔషధంలా పనిచేస్తుంది. బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్.. పొట్టతోపాటు జీర్ణవ్యవస్థను పూర్తిగా శుభ్రం చేస్తుంది. బాగా పండిన బొప్పాయి పండు ముక్కలను తరచూ పిల్లలతో తినిపిస్తుంటే ప్రయోజనం కనిపిస్తుంది.
- వాల్‌నట్స్‌లో యాంటీ పారాసైటిక్ గుణాలు ఉంటాయి. రాత్రిపూట వాల్‌నట్స్‌ను నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే పిల్లలతో తినిపిస్తూ ఉంటే నాలుగు రోజుల్లో సమస్య తీరుతుంది.
- రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో ఒక చెంచా అల్లం రసం తాగించినా ఫలితం ఉంటుంది.
- పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలతో తినిపిస్తుంటే కడుపులోని నులిపురుగులు విసర్జితమవుతాయి. తృణధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, బీన్స్, కేరట్, బీట్‌రూట్, పసుపు, బెల్లం, కొబ్బరి, పెరుగును ఆహారంలో చేర్చడం వల్ల నులిపురుగుల సమస్య వెంటనే తీరుతుంది.

పండ్ల మీద స్టిక్కర్లు ఎందుకు?

మనం బజార్లో యాపిల్స్, నారింజ, కివీ లాంటి పండ్లు కొనేటప్పుడు వాటి మీద చిన్న చిన్న స్టిక్కర్లు అంటించి ఉండడం చూస్తుంటాం. వీటిని పండ్ల మీద ఎందుకు అంటిస్తారో తెలుసుకుందాం.



- ఈ స్టిక్కర్ల మీద పీఎల్‌యూ కోడ్ రాసి ఉంటుంది. దీని ద్వారా పండ్లను సాగు చేసిన విధానం అంటే వాటిని సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించారా, రసాయనాలు ఉపయోగించారా, జన్యుపరంగా మార్పులు చేసి ఉత్పత్తి చేశారా అనే సమాచారం తెలుసుకోవచ్చు. పండ్ల నాణ్యతను అంచనా వేయవచ్చు. పీఎల్‌యూ కోడ్‌లో నాలుగు లేదా అయిదు అంకెలు ఉంటాయి.
- స్టిక్కర్ మీద తొమ్మిదితో మొదలై అయిదు అంకెలు ఉంటే ఆ పండ్లను పూర్తిగా సేంద్రీయ విధానంలో పండించారని అర్థం. పంటలో ఎటువంటి పురుగు మందులు, రసాయనాలు ఉపయోగించలేదని గుర్తించాలి. ఈ పండ్లను ఒకసారి మంచినీళ్లతో కడిగి తినవచ్చు. ఆరోగ్యానికి మంచివి.
- స్టిక్కర్ మీద నాలుగు అంకెలు మాత్రమే ఉంటే ఆ పండ్లను పండించేటప్పుడు రసాయనాలు, ఇతర పురుగుమందులు ఉపయోగించారని అర్థం. వీటి ధర కూడా తక్కువగా ఉంటుంది. వీటిని తినేముందు ఉప్పు నీళ్లలో కొద్దిసేపు నానబెట్టి రెండు లేదా మూడుసార్లు శుభ్రంగా కడగాలి.
- స్టిక్కర్ మీద ఎనిమిదితో ప్రారంభమై అయిదు అంకెలు ఉంటే ఆ పండ్లను జన్యుపరంగా మార్పు చేశారని అర్థం.



'వ్యర్థం అనే మాటకు అర్థం లేదు' అంటున్నారు తూర్పు గోదావరి జిల్లా కడియం ప్రాంతానికి చెందిన డ్వాక్రా మహిళలు. విక్రయించగా మిగిలిపోయిన, పాడైపోయిన పూలతో అగరుబత్తీలు తయారు చేసి... ఆదాయంతోపాటు ప్రశంసలనూ పొందుతున్నారు.

వ్యర్థ పుష్పాలతో ఉపాధి పరిమళాలు

'పూలు' అనగానే తూర్పుగోదావరి జిల్లా కడియం పేరు గుర్తుకువస్తుంది. కడియం, కడియపు లంక పరిసరాల్లో దాదాపు అయిదు వేల ఎకరాల్లో నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాలు ఒకప్పుడు వరద ముంపు ప్రదేశాలు. వరదలతో పాటు వచ్చే ఒండ్రు మట్టితో నేల సారవంతంగా మారింది. 50 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడి నర్సరీల్లో పూల సాగు జరుగుతోంది. గతంలో మల్లెలు, బంతి, చామంతి తదితర రకాలను సాగు చేసేవారు. అయితే కాలక్రమంలో నర్సరీ రైతులు వివిధ రకాల మొక్కల పెంపకం, విక్రయం వైపు మళ్లారు. దీంతో చిత్తూరు, కర్నాటక తదితర చోట్ల నుంచి పూలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు. కడియపులంకలోని హోల్‌సేల్ పూల మార్కెట్‌కు వివాహాలు, పండుగలు, పర్వదినాల్లో రోజుకు 100 టన్నుల వరకూ రకరకాల పువ్వులు వస్తాయి. కాగా అన్‌సీజన్‌లో రోజూ మిగిలిపోయిన, వాడిపోయిన పువ్వులు 10 టన్నుల వరకూ ఉంటాయి. వాటిని కాలువ గట్టున పడేయడం పరిపాటి. వాటి పునర్వినియోగంపై ఎవరూ దృష్టి సారించలేదు. ఈ నేపథ్యంలో... ఆ పువ్వులను ఏదో ఒక విధంగా ఉపయోగించాలని గత ఏడాది అప్పటి కలెక్టర్ ప్రశాంతి భావించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్.మూర్తికి సంబంధిత కార్యాచరణను అప్పగించారు. దీంతో 'కడియం నాచురల్ అగరుబత్తి' అనే వినూత్న ప్రాజెక్టు పట్టాలెక్కింది.



ఇలా మొదలైంది...

ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా తొలి దశలో 60 డ్వాక్రా మహిళలను ఎంపిక చేశారు. అన్నవరం దేవస్థానంలో వినియోగించిన పూలతో తయారు చేస్తున్న అగరుబత్తీల తయారీ కేంద్రానికి తీసుకువెళ్లి, సంబంధిత ప్రక్రియను పరిచయం చేశారు. తరువాత యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నడుస్తున్న రీజనల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ సంస్థ ద్వారా.. విజయనగరం నుంచి అనుభవం కలిగిన ఒక వ్యక్తిని తీసుకువచ్చి శిక్షణ ఇప్పించారు. 'పీఎం ఈజీపీ పథకం' కింద బ్యాంకు లింకేజీ ద్వారా యంత్రాలు, తొలి దశ పెట్టుబడికి రూ.3 లక్షల రుణం మంజూరు చేయించారు. వర్కింగ్ క్యాపిటల్ కింద మరో లక్ష రూపాయలు మంజూరయ్యాయి. కడియం మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్య ప్రసాద్ చొరవతో సచివాలయంలోని ఒక గది కేటాయింపు జరిగింది. మొదట తొలిగా అయిదుగురు మహిళతో అగరుబత్తీల తయారీ మొదలయింది.

ఆరోగ్యానికి ముప్పు లేదు...

అగరుబత్తీల తయారీ గురించి డ్వాక్రా మహిళలు పి.లక్ష్మీబాయి, వి.వెంకట లక్ష్మి, జె.నాగ లక్ష్మి, కె.శ్రావణి, ఎస్.మల్లేశ్వరి వివరిస్తూ "ఉదయం 9గంటలకు తయారీ కేంద్రానికి చేరుకుంటాం. బంతి, చామంతి, గులాబీ తదితర పూల వ్యర్థాలను తొడిమలతోసహా తొలగిస్తాం. రేకులను వేరు చేస్తాం. 25 కిలోలు ముడి సరుకుగా తీసుకువస్తే... శుభ్రం చేసిన తర్వాత దాదాపు అయిదు కిలోల పూరేకులు వస్తాయి. వాటిని 20 రోజులపాటు ఎండబెట్టి, పొడి చేస్తే 2 కిలోల పౌడరు వస్తుంది. దానికి ఎలాంటి రసాయన పదార్థాలను జోడించం. అగరుబత్తి పుల్లకు ఆ పొడి అంటిపెట్టుకొని ఉండడానికి గమ్ పౌడరు రాస్తాం. అగరుబత్తి వెలుగుతూ ఉండడానికి రంపం పొడి మాత్రం స్వల్ప మోతాదులో కలుపుతాం. ఆ మిశ్రమంతో యంత్రం ద్వారా అగరుబత్తీలు తయారు చేసి ప్యాక్ చేస్తాం. ఇలా రోజుకు దాదాపు 15 కిలోల చొప్పున నెలకు సుమారు 500 కిలోల వరకూ ఉత్పత్తి చేస్తున్నాం. చేతితో ధూప్‌స్టిక్స్ కూడా తయారు చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతున్న అగరుబత్తీల తయారీలో రసాయనాలు వాడడంతో ఆరోగ్యపరమైన ఇబ్బందులు కలుగుతాయి. కానీ కడియం నాచురల్ అగరుబత్తీలలో రసాయనాలు లేకపోవడంతో ఆ పొగతో సమస్య ఉండదు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే వీటిని అందిస్తున్నాం. ప్రస్తుతం పెట్టుబడి, బ్యాంకు వాయిదా పోను నెలకు ఒక్కొక్కరికి రూ.12 వేల వరకూ ఆదాయం వస్తోంది. ఆ మొత్తం పెట్టుబడి తదితరాలకు సరిపోతోంది. ఇది కాస్త శ్రమతో కూడుకున్న పనే. కానీ భవిష్యత్తు బాగుంటుందనే ఆశతో కొనసాగిస్తున్నాం" అని చెప్పారు.

ఉపాధికి ఆస్కారం...



ప్రస్తుతం వీటిని జిల్లా మహిళా సమాఖ్య తరపున డీఆర్‌డీఏ కొనుగోలు చేస్తోంది. ఎక్కడైనా ప్రభుత్వ కార్యక్రమాలు ఉంటే తయారీ కేంద్రం తరపున స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ముడిసరుకు ఏడాది పొడవునా లభ్యత ఉండడంతో పాటు డబ్బులు చెల్లించి కొనుగోలు చేయాల్సిన అవసరం లేకపోవడం ఈ ప్రాజెక్టులోని విశేషంగా చెప్పవచ్చు. కొద్ది రోజుల క్రితం కలెక్టర్ కీర్తి చేకూరి ఈ కేంద్రాన్ని సందర్శించారు. సోలార్ డ్రయర్‌తోపాటు అవసరమైన యంత్రాలు సమకూరుస్తామని హామీ ఇస్తూ... వాణిజ్యపరంగా ఇంకా పెద్ద స్థాయిలో తయారీకి సిద్ధం కావాలని, ఆ ఉత్పత్తులను దేవాదాయ శాఖ ద్వారా దేవాలయాల్లో వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా... వ్యర్థమవుతున్న పూలలో ఈ విధంగా వినియోగిస్తున్నవి చాలా తక్కువ. వాటిని పూర్తిగా వినియోగించుకోవడంతోపాటు.. దేవాలయాల్లో వాడిన పూలు, పూలమాలలను కూడా జతచేస్తే కడియం పరిసర ప్రాంతాలతో పాటు దగ్గరలో ఉన్న రాజమహేంద్రవరంలోని డ్వాక్రా మహిళలకు కూడా ఉపాధి లభించే అవకాశం ఉంది. అలాగే తక్కువ మంది మహిళలతో చిన్న యూనిట్లను నెలకొల్పి ఆ ఉత్పత్తులను ప్రభుత్వం మార్కెట్ చేయగలిగితే ఎంతోమంది మహిళల జీవితాలు ఆర్థికంగా గుబాళిస్తాయి.

- పి.రమేశ్ నాగేంద్ర



పేర్లు పెడుతూ లక్షలు సంపాదించేస్తున్నారు!

పిల్లలకు ఏ పేరు పెట్టాలా అని తల్లిదండ్రులు పగలనక రాత్రనక ఆలోచిస్తూనే ఉంటారు. కుటుంబ సభ్యులను, బంధు మిత్రులను సలహా అడగడమే కాకుండా నెట్టింట్లో తెగ వెతికేస్తుంటారు. చివరికి ఓ చక్కని పేరును ఎంపిక చేసి సంబరపడిపోతుంటారు. కానీ ప్రస్తుతం తల్లిదండ్రులు అలా కష్టపడనక్కర్లేదు. పిల్లలకు అందమైన పేర్లు పెట్టడానికి కన్సల్టెంట్లు, బేబీ నేమర్లు వచ్చేశారు. ఈ ట్రెండ్ మరీ కొత్తది కానప్పటికీ ఇటీవల బాగా ప్రాచుర్యంలోకి వస్తోంది. శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన టేలర్ అలెగ్జాండ్రా హంఫ్రీ అనే మహిళ... గత పదేళ్లుగా పిల్లలకు చక్కని పేర్లు సూచిస్తూ విశేష అనుభవం గడించారు. అంతేకాదు ఓ వ్యాపార సంస్థను సైతం నడుపుతూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ తరహా ట్రెండ్.. మనదేశంలో కూడా ఉందంటే ఆశ్చర్యం కలుగక మానదు.

ఎవరీ టేలర్ ఎ హంఫ్రీ..?

టేలర్... శాన్‌ఫ్రాన్సిస్కోలో పుట్టి పెరిగారు. న్యూయార్క్ యూనివర్సిటీలో బిఏ పూర్తిచేశారు. ఆమెకు చిన్నతనం నుంచీ విభిన్నమైన పేర్ల మీద ఆసక్తి ఉండేది. బంధు మిత్రుల ఇళ్లలో పిల్లలు పుట్టినప్పుడు వాళ్లకు ప్రత్యేకమైన పేర్లు సూచిస్తుండేవారు. ఎంతో పరిశోధించి తను సృష్టించిన పేర్లను ఆన్‌లైన్లో షేర్ చేసేవారు. వాటికి మంచి ఫాలోయింగ్ వస్తుండేది. చదువు పూర్తయ్యాక అమెరికాలోని ప్రముఖ సంస్థల్లో మార్కెటింగ్, బ్రాండింగ్ విభాగాల్లో పనిచేశారు. మహిళలకు గర్భధారణ, ప్రసవ సమయాల్లో తగిన అవగాహన కల్పించే నిపుణురాలిగా సేవలందించారు. ఈ క్రమంలో... ఆసుపత్రి నుంచి ఇంటికి వెళుతున్న ఓ జంట తమ బిడ్డకి పెట్టే పేరు గురించి చర్చించుకోవడం విని వాళ్లతో మాటలు కలిపారు టేలర్. ఆ జంట ఇష్టాయిష్టాలు, కుటుంబ నేపథ్యం అడిగి తెలుసుకుని క్షణాల్లో చక్కని పేరును సూచించారు. వెంటనే ఆ తల్లిదండ్రుల ముఖాల్లో కనిపించిన సంతోషం... ఆమెను ఆలోచనలో పడేసింది. ఆ క్షణమే టేలర్ తన అభిరుచిని కెరీర్‌గా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. 'వాట్స్ ఇన్ ఎ బేబీ నేమ్' పేరుతో ఓ వ్యాపార సంస్థను ప్రారంభించి దాని ద్వారా తన నైపుణ్యాన్ని సమాజానికి తెలియజేయడంలో విజయం సాధించారు ఆమె. కుటుంబ వారసత్వం, వంశ వృక్షాలకు సంబంధించిన వివరాలను పూర్తిగా తెలుసుకుని వాటికి తగ్గట్టుగా కొన్ని పేర్లను జాబితాగా రాసి తల్లిదండ్రులకు ఈ-మెయిల్ చేస్తానంటున్నారు టేలర్. ఇప్పటి వరకూ.. అమెరికాలోని శ్రీమంతులు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తల కుటుంబాలకు చెందిన 500 మంది చిన్నారులకు పేర్లు సూచించానని ఆమె చెబుతున్నారు. జన్మ రాశులకు అనుగుణంగా... పలకడానికి సులభంగా ఉండే స్టయిలిష్ పేర్లను డిజైన్ చేయడంలో ఆమె నిష్ణాతురాలు. ఒక చిన్నారికి పేరు పెట్టడానికి కనీసం 26 లక్షలు వసూలు చేస్తుండడం విశేషం. "పేరంటే వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాదు వారసత్వానికి ప్రతిబింబం, ఓ బ్రాండ్ కూడా!" అంటారామె. టేలర్‌కు సామాజిక మాధ్యమాల్లో లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్నారు.

నేమ్ కన్సల్టెంట్స్ సర్వీసులు...

ఒకప్పుడు తల్లిదండ్రులు తమ ప్రాథమిక పరిజ్ఞానంతో కుటుంబంలోని పెద్దల సూచనల మేరకు పిల్లల పేర్లు నిర్ణయించేవారు. కానీ నేటి తల్లిదండ్రులు మాత్రం పిల్లలకు తేలిక పదాలతో కూడిన విలక్షణమైన పేర్లు పెట్టాలనుకుంటున్నారు. అలాంటి పేర్లను వెతకడానికి పరిశోధించడానికి సమయం వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుత జీవన విధానంలో ఎప్పుడూ బిజీగా ఉండే తల్లిదండ్రులకు అది సాధ్యం కావడం లేదు. దీంతో వారు నేమ్ కన్సల్టెంట్స్ సర్వీసులవైపు చూస్తున్నారు. మనదేశంలో ఢిల్లీ, నోయిడా, ముంబై, పుణె, కోల్‌కతా తదితర నగరాల్లో ఇలాంటి సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఢిల్లీకి చెందిన శివాంగి వర్మ... ఏడేళ్లుగా బేబీ నేమింగ్ సంస్థను నిర్వహిస్తున్నారు. విష్ణు, లలిత సహస్రనామాలతోపాటు వేదాలు, పురాణ గ్రంథాల్లోని ఇతర శ్లోకాలను విశ్లేషించి పిల్లల పేర్లను డిజైన్ చేస్తారామె. ఒక్కోసారి తల్లిదండ్రులే కొన్ని పేర్లను ఎంపిక చేసుకుని వాటి అర్థాలు చెప్పమని అడుగుతుంటారని అలాంటి వాటిని కూడా పరిశీలించి అవసరమైతే మార్పులు, చేర్పులు చేసి చక్కని పేర్లను సూచిస్తామని ఆమె తెలియజేస్తున్నారు. ఒక్కో పేరును డిజైన్ చేయడానికి వారం వరకూ సమయం పడుతుందన్నారు. తమ వద్ద రూ.11,000 నుంచి రూ.51,000 మధ్య మూడు ప్యాకేజీలు అందుబాటులో ఉంటాయనీ, వాటి కింద 25 ఐడియాలతో కూడిన పేర్లు సూచిస్తామనీ, తల్లిదండ్రుల ఇష్టానుసారం మార్పులు చేస్తామనీ శివాంగి చెబుతున్నారు.



ఎన్నారైల కోసం కూడా...

విదేశాల్లో నివసించే భారతీయ కుటుంబాలకు చెందిన పిల్లల కోసం కొంతమంది కన్సల్టెంట్లు ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నారు. వీరు... ఎన్నారైలు కోరుకున్నట్లుగా భారతీయత ఉట్టిపడేలా, సులభంగా పిలుచుకొనేట్లుగా వినసొంపుగా, ఉండే పేర్లను డిజైన్ చేస్తున్నారు.

- కోల్‌కతాలోని 'డస్బన్ నామకరణ్' సంస్థ... జ్యోతిష శాస్త్రం, సంఖ్యాశాస్త్రం ఆధారంగా ఆధునిక, సంప్రదాయ పేర్లను డిజైన్ చేస్తోంది. అన్ని వర్గాలవారికి అందుబాటులో ఉండేలా డైమండ్ (రూ.10,999); గోల్డ్ (రూ.6,000); సిల్వర్ (రూ.4,500) ప్యాకేజీలను అందిస్తోంది.
- పుణెలో 'నేమ్ ఇట్ రైట్' సంస్థను నిర్వహిస్తున్న జయ వర్మ... మధ్యతరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకుని రూ.4,000కే ప్యాకేజీని అందిస్తున్నారు. ఈ ప్యాకేజీ కింద 15 పేర్లను సూచించడంతోపాటు వాటి అర్థాలు, మతపరమైన సూచనలు, ఆ పేరు పిల్లలకు ఎలా సూటవుతుందో తెలిపే వివరణ ఉంటాయి. ఈ సంస్థకు రోజుకు 40 దాకా ఆర్డర్లు వస్తుంటాయి.

ఆత్మస్థైర్యమే ఆయుధం...

ఊహించని ప్రమాదం ఆమెను ఏడేళ్లు మంచానికి పరిమితం చేసినా... క్యాన్సర్ మహమ్మారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నా... ఆత్మస్థైర్యమే ఆయుధంగా పోరాటం సాగించారు పూజా గార్గ్. పారా అథ్లెట్‌గా ఎన్నో పతకాలు సాధించడంతోపాటు... క్యాన్సర్ పై అవగాహన కలిగించడానికి బైక్‌పై 4,500 కిలోమీటర్ల యాత్ర చేశారు. మరోవైపు సామాజిక కార్యకర్తగా, వక్తగా వేలమంది జీవితాల్లో మార్పునకు దోహదం చేస్తున్న పూజ కథ... ఆమె మాటల్లోనే...

"అది 2020 సెప్టెంబర్. అంతకు కొన్నాళ్ల క్రితమే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బిఇ పూర్తి చేశాను. నోయిడాలోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం వచ్చింది. కోరుకున్న కెరీర్‌ను ఆకర్షణీయమైన జీతంతో ప్రారంభించబోతున్నాననే ఆనందం నన్ను నిలవనివ్వడం లేదు. కానీ విధి నిర్ణయం వేరేగా ఉంది. ఒక రోజు స్నేహితుల్ని కలుసుకోడానికి బయలుదేరాను. అంతకుముందు పడిన వర్షం వల్ల తడిగా ఉన్న మెట్ల మీద నుంచి జారి పడిపోయాను. వెంటనే స్పృహ తప్పింది. ఆ ఏడాది అక్టోబర్ అయిదో తేదీన నేను జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలి. కానీ ఆ రోజు ఆపరేషన్ టేబుల్ మీద... అపస్మారక స్థితిలో ఉన్నాను.

కొత్త దారి తెలిసింది...



మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నేను పుట్టి పెరిగాను. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలనేది నా లక్ష్యం. దానికోసం కష్టపడి చదివాను. కోరుకున్న ఉద్యోగంలో చేరబోతున్న దశలో... ఊహించని ప్రమాదంతో నా కలలన్నీ కరిగిపోయాయి. వెన్నుకు ఫ్రాక్చర్ కావడంతో మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. ఏడేళ్లలో.. దేశంలోని వివిధ నగరాల్లో నాకు పదమూడు సర్జరీలు జరిగాయి. నా తల్లితండ్రులు ఎంతో డబ్బు ఖర్చు చేశారు. కానీ ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. హోలీ, దీపావళి లాంటి పండుగలను అందరూ సందడిగా చేసుకుంటూ ఉంటే... నేను నా గదికే పరిమితం కావడం ఎంతో బాధ కలిగించేది. మంచం మీద నుంచి నా అంతట నేను లేచి కూర్చోవడం చాలా కష్టంగా ఉండేది. దాదాపు మూడేళ్ల పాటు ఒకవైపు నుంచి మరోవైపు కదలలేకపోయేదాన్ని. అయితే ఆత్మస్థైర్యాన్ని మాత్రం కోల్పోలేదు. దానికి కారణం నా కుటుంబం. నా తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్లు నన్ను కనిపెట్టుకొని ఉన్నారు. నా ప్రతి అవసరం తీర్చారు. క్రమంగా వీల్‌చైర్‌లో అటూ ఇటూ తిరగడం అలవాటు చేసుకున్నాను. 'నడవలేకపోతేనేం... నేను ఎన్నో సాధించగలను' అని నన్ను నేను ప్రేరేపించుకున్నాను. పారా-షూటింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టాను. కొన్ని నెలలలో నైపుణ్యం సాధించాను. మధ్యప్రదేశ్ రాష్ట్రస్థాయి పారా-షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలిచాను. నేను పయనించాల్సిన కొత్త దారి ఏమిటో అప్పుడు నాకు స్పష్టమయింది.

పాతికకు పైగా పతకాలు

ఆ తరువాత.. కేరళలో జరిగిన ప్రీ-నేషనల్స్‌లో, నేషనల్-పారా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు గెలిచాను. 2000 సంవత్సరానికల్లా మన దేశంలోని టాప్-8 పారా షూటర్స్‌లో ఒకరుగా నిలిచాను. ఈ క్రమంలో నా దృష్టి కెనోయింగ్ మీద పడింది. తీవ్ర సాధన తరువాత... ఉజ్బెకిస్తాన్, జపాన్‌లలో నిర్వహించిన ఆసియన్ ఛాంపియన్‌షిప్స్‌లో వరుసగా పాల్గొన్నాను. ఆ రెండిటిలో నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కానీ ఈ ఏడాది థాయిలాండ్‌లో జరిగిన 'ఆసియన్ పారా-కెనోయింగ్' పోటీల్లో... రెండు ఈవెంట్లలో కాంస్య పతకాలు సాధించాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఇప్పటివరకూ పాతికకు పైగా పతకాలు నా ఖాతాలో ఉన్నాయి. మరోవైపు సామాజిక సేవను కూడా నా జీవితంలో భాగం చేసుకున్నాను. 'పంకోంకీ ఉడాన్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాను. దివ్యాంగులకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాన్ని కల్పించి, వారు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయం ద్వారా ఆదాయ మార్గం చూపించడం, అణగారిన వర్గాల పిల్లలకు, వయోధికులకు అవసరమైన సాయాలు అందించడం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాను. అలాగే విద్యాసంస్థల్లో వర్క్‌షాప్‌లు, సమావేశాలు నిర్వహిస్తూ... పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాను. 'పంకోంకీ ఉడాన్' ఇప్పటి వరకూ దాదాపు అయిదు వేల మంది జీవితాల్లో మార్పునకు దోహదం చేసింది. ఇది నాకు ఎంతో సంతృప్తి కలిగిస్తోంది.


తొలి మహిళను నేనే...

ఈలోగా మరో సవాల్ ఎదురయింది. రెండేళ్ల క్రితం తరచూ అనారోగ్యానికి గురవుతూ ఉండడంతో... వైద్య పరీక్షలు చేయించుకున్నాను. నాకు ఎముకల క్యాన్సర్ ఉందని వైద్యులు నిర్ధారించారు. అయితే నేను భయపడలేదు. చికిత్స చేయించుకుంటూనే నా కార్యక్రమాలన్నీ కొనసాగిస్తున్నాను. ప్రజల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం కోసం... కిందటి ఏడాది ఇండోర్ నుంచి... దేశంలో మోటార్ సైకిళ్ల మీద ప్రయాణించగలిగే అత్యంత ఎత్తైన రోడ్లలో ఒకటైన నాథూలా పాస్ వరకూ... 4,500 కిలోమీటర్ల దూరం మోటార్ బైక్‌పై ప్రయాణించాను. జాతీయ పతాకాన్ని చేతపట్టుకొని... అక్కడ శిఖరాగ్రానికి చేరాను. అక్కడికి చేరుకున్న తొలి 'పారాప్లెజిక్' మహిళను నేనే. ఇది ప్రపంచ రికార్డుగా... 'లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నా పేరు చోటుచేసుకుంది. ప్రస్తుతం... వచ్చేఏడాది ఆసియా క్రీడల కోసం, 2028లో జరగబోయే పారాలింపిక్స్ కోసం సన్నద్ధం అవుతున్నాను. ఆత్మవిశ్వాసంతో, నిజాయితీగా పని చేస్తే విజయం తథ్యం అని నేను నమ్ముతాను. నా కథ కొందరిలోనైనా స్ఫూర్తి నింపుతుందనే నమ్మకం నాకుంది."



దిక్సూచి

ఇండియన్ ఆర్మీలో
టెక్నికల్ ఎంట్రీ స్కీమ్



మొత్తం ఖాళీలు: 90

ఇండియన్ ఆర్మీలోని 10 ప్లస్ 2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశాల కోసం అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నారు. ఇందులో ఎంపికైన వారికి బీటెక్ డిగ్రీతోపాటు, సైన్యంలో లెఫ్టినెంట్ ఉద్యోగంలో చేరవచ్చు.

కోర్సు:

టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 55 కోర్సు(టీఈఎస్) - 2025 జూలై 2026

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అయితే ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ తప్పనిసరిగా చదివి ఉండాలి. దీనితోపాటు జేఈఈ మెయిన్ 2025 స్కోరు సాధించాలి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి పదహారున్నర సంవత్సరాల నుంచి పంతొమ్మిదిన్నర సంవత్సరాల మధ్యలో ఉండాలి.

వేతనం: మిలిటరీ సర్వీస్ పే కింద చదువుకునే కాలంలో స్టైపెండ్ నెలకు 15,500/- రూపాయలు లభిస్తుంది. తర్వాత 56,000/- వేతనంతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి.

ఎంపిక విధానం: జేఈఈ(మెయిన్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

కోర్సు శిక్షణ: కోర్సు కాల వ్యవధి నాలుగు సంవత్సరాలు. ఇందులో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్, బీటెక్ టెక్నికల్ శిక్షణ ఇస్తారు. మొదటి మూడేళ్లు పుణె, సికింద్రాబాద్, మావ్‌లోని ఆర్మీ కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుంది. తరవాత డెహ్రాడూన్‌లోని 'ఇండియన్ మిలిటరీ అకాడమీ'లో శిక్షణ కొనసాగుతుంది. ఆపై డిగ్రీతోపాటు, లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో విధుల్లోకి తీసుకుంటారు.

చివరి తేదీ: 2025 నవంబర్ 13

వెబ్‌సైట్: joinindianarmy.nic.in



డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి యూసీడ్ - 2026

డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్'(యూసీడ్)- 2026 నోటిఫికేషన్ వెలువడింది. దీనిని బాంబే ఐఐటీ నిర్వహిస్తోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఐఐటీలు సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లలోని బీడిజైన్ కోర్సుల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఇంటర్ పూర్తి చేసిన వారు యూసీడ్ ఎంట్రెన్స్ రాయడానికి అర్హులు. 'యూసీడ్ స్కోరు వాలిడిటీ ఏడాది. వరుసగా రెండు సంవత్సరాలు మాత్రమే అభ్యర్థులు ఈ ఎంట్రెన్స్ రాయవచ్చు.

వయస్సు: దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2001 అక్టోబర్ 10 తరువాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఇతర రిజర్వేషన్ల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

పరీక్ష తేదీ: 2026 జనవరి 18 **ఫలితాలు:** 2026 మార్చి 6

పరీక్ష సెంటర్లు: తెలుగు రాష్ట్రాల్లో యూసీడ్ పరీక్ష సెంటర్లు హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

వెబ్‌సైట్: www.uceed.iitb.ac.in/2026/

UCEED 2026

పారా మెడికల్‌లో
పీజీ, పీజీ డిప్లొమా

ఆంధ్రా యూనివర్సిటీ, బొల్లినేని మెడ్‌స్కిల్స్ కలిసి పీజీ, పీజీ డిప్లొమా(సెల్ఫ్ సపోర్టెడ్) కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: రెండు సంవత్సరాల కోర్సు ఇది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. కోర్సు ఫీజు 55000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ క్రిటికల్ కేర్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ గ్యాస్ట్రోఎంట్రాలజీ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 40000 రూపాయలు.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 నవంబర్ 7

ఫోన్: 7995013421, 7207953919

వెబ్‌సైట్: www.audoa.andhrauniversity.edu.in



డీఆర్‌డీఈలో అప్రెంటిస్‌షిప్

బెంగళూరులోని డీఆర్‌డీఓ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఏడాది కాలానికి గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

ఖాళీల వివరాలు:

- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(ఇంజనీరింగ్)- 23
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(జనరల్) - 27
- డిప్లొమా(ఇంజనీరింగ్) అప్రెంటిస్‌షిప్ - 27
- ఐటీఐ అప్రెంటిస్‌షిప్ - 30

మొత్తం ఖాళీలు 105

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీబీఏ, బీఎస్సీ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఆటోమొబైల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫోటోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్ తదితరాలు ఉన్నాయి.

అర్హతలు: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.

వయస్సు: 18 సంవత్సరాలు పూర్తి కావాలి.

దరఖాస్తు విధానం: ఐటీఐ అభ్యర్థులు ఎన్ఏపీఎస్ పోర్టల్‌లో, ఇతరులు ఎన్ఏటీఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటర్వ్యూ హాజరు కావాల్సిన తేదీ: 2025 నవంబర్ 4

చిరునామా: ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు.

వెబ్‌సైట్: drdo.gov.in/

SCHOLARSHIP ALERT

Mahindra Big Boss Nayi Pehchan Scholarship

Description: The Mahindra Big Boss Nayi Pehchan Scholarship 2025-26 is designed to empower children of freelance tractor mechanics by offering a scholarship of INR 6,000 annually to support their educational journey.

Eligibility:

- Children of freelance tractor mechanics.
- Aged 7 to 21 years, enrolled in school, college, or vocational courses.
- 50% marks (or equivalent) in the previous class/semester.
- Open to students across India.
- SC/ST/OBC reservations available.
- Children of Buddy4Study or Mahindra & Mahindra Ltd. employees are not eligible.

Prizes & Rewards: Students will receive a scholarship amount of INR 6000/-.

Last Date to Apply: 15-11-2025

Application mode: Online applications only

L'Oréal For Young Women in Science Program

Description: L'Oréal India offers the L'Oréal For Young Women in Science Program 2025-26 for young women who have passed Class 12 and wish to pursue higher education in scientific fields.

Eligibility: Open to female students only.

- Annual family income should not exceed INR 6,00,000.
- **UG students:** Must have secured at least 85% marks in Class 12 (Science Stream) and be pursuing an undergraduate degree in a science-related field (except final-year students).
- **PG/PhD students:** Must have secured at least 60% marks in their undergraduate course and be pursuing post-graduation (any year) in fields such as Technology, Science, Pharma, Life Sciences, Biotechnology, etc. (except final-year students).
- Students from PAN India are eligible.
- Children of L'Oréal India and Buddy4Study employees are not eligible.

Prizes & Rewards:

- **UG students:** Fixed scholarship of INR 62,500
- **PG and PhD students:** Upto scholarship of INR 1,00,000

Last Date to Apply: 03-11-2025 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/LIS6

Muskaan Scholarship Program 2.0

Description: An initiative by Valvoline Cummins Private Ltd. (VCPL) to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/HMV), mechanics and children belonging to the Economically Weaker Sections (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students in Classes 9 to 12 from the southern, eastern, and northeastern states of India are eligible to apply for the scholarship. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), children of mechanics, and students belonging to the Economically Weaker Sections (EWS) category. To be eligible, applicants must have scored above 60% in their previous class. Additionally, the total family income from all sources should not exceed INR 8 lakh per annum. However, children of employees of Valvoline Cummins Private Ltd. (VCPL) and its implementation partner organisations are not eligible for this scholarship.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date: 05-11-2025 *Application:* Online only

Short Url: www.b4s.in/aj/MKSP2

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నా పరువుకు భంగం కలుగుతోంది

● సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు



తన రూపాన్ని పోలిన ఏఐ డీప్‌ఫేక్ చిత్రాలను, వీడియోలను సృష్టించి.. వాటికి అసభ్య, అశ్లీల కంటెంట్‌ను జోడించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని హీరో చిరంజీవి శనివారం సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధనార్జనే ధ్యేయంగా నా రూపాన్ని మార్ఫింగ్ చేస్తూ, అసభ్యకరమైన కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తున్న పలు అక్రమ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ చానల్స్‌ను వెంటనే బ్లాక్ చేయాలని కోరారు. తన దృష్టికి వచ్చిన కొన్ని వెబ్ లింక్స్‌ను ఆయన పోలీసులకు అందజేశారు. 'దశాబ్దాల పాటు కష్టపడి నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాను. ఇలాంటి చర్యలతో నా పరువుకు భంగం కలుగుతోంది. కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న నన్ను కించపరిచేలా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నీచపు పనులకు పాల్పడుతున్నారు. వారిని కఠినంగా శిక్షించండి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

హీరో నారా రోహిత్, శిరీషల వివాహం ఈ నెల 30న జరగనుంది. ఆదివారం హల్దీ వేడుకతో పెళ్లి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీషతో దిగిన ఫొటోను నారా రోహిత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.



పోరాటాలే ప్రత్యేకాకర్షణగా

గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్ రెడ్డి ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'గోపీచంద్ 33' అనేది వర్కింగ్ టైటిల్. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కథానాయకుడు గోపీచంద్, ఇతర తారాగణం పాల్గొంటుండగా వెంకట్ మాస్టర్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే హైలెట్‌గా నిలవనుందని యూనిట్ తెలిపింది. కాగా, మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ పోస్టర్, గ్లింప్స్ వీడియోకు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఆ పోస్టర్‌లో యోధుడిలా కనిపించిన గోపీచంద్ తన పాత్రలోని ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేశారు. మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో గోపీచంద్ కనిపించబోతున్నట్లు ప్రచార చిత్రాలను చూస్తే అర్థమవుతోంది. విభిన్నమైన కథలతో, సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందిన సంకల్ప్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం వల్ల అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ డీఓపీగా వ్యవహరిస్తుండగా, అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.





రజనీ - కమల్ మూవీ పక్కా

రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం కాబోతోంది? దర్శకుడు ఎవరు? అనే విషయాలు మాత్రం ఇప్పటి వరకూ వెల్లడి కాలేదు. మొదట్లో ఈ ప్రాజెక్టుకు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తారనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథన్ పేరు వినిపించింది. కానీ తాను డైరెక్ట్ చేయడంలేదని ప్రదీప్ తెలిపారు. దీంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుందా అన్న అనుమానాలు అభిమానుల్లో కలిగాయి. అయితే రజనీకాంత్ కూతురు సౌందర్య మాత్రం కచ్చితంగా ఈ సినిమా తెరకెక్కుతుందని అంటున్నారు. ఇటీవల ఓ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆమె ఈ సినిమాని రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తారని స్పష్టం చేశారు. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ కలసి నటిస్తే చూడాలనే ఆశ తనకూ ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి, వివరాలను నాన్నగారు త్వరలో స్వయంగా వెల్లడిస్తారు అని సౌందర్య తెలిపారు. ఆ మధ్య సైమా అవార్డుల వేడుకలో కూడా కమల్ హాసన్ ఈ విషయంపై స్పందించారు. 'ప్రేక్షకులు మా కాంబినేషన్‌ని ఇష్టపడితే మంచిదే కదా, వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలసి నటించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే మీ ముందుకు కలసి రానున్నాం' అని అన్నారు. కాగా, వీరిద్దరూ కెరీర్ తొలినాళ్లలో 'అపూర్వ రాగంగళ్', 'మూండ్రు ముడిచ్చు', 'అంతులేని కథ' వంటి హిట్ చిత్రాలతోపాటు సుమారు ఇరవైకి పైగా చిత్రాల్లో కలసి నటించారు. 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' తర్వాత రజనీ, కమల్ కలసి నటించలేదు.



నెపోలియన్ రిటర్న్స్

కొన్నేళ్ల క్రితం 'నెపోలియన్' చిత్రంలో 'నా నీడ పోయింది సార్..' అంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అందర్నీ ఆకర్షించిన ఆనంద్ రవి ఈసారి మరో ఉత్కంఠభరితమైన కథతో వస్తున్నారు. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కొత్త చిత్రం 'నెపోలియన్ రిటర్న్స్'. ఆచార్య క్రియేషన్స్ పతాకంపై భోగేంద్ర గుప్త నిర్మిస్తున్నారు. దివి కథానాయికగా నటిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన వేడుకలో టైటిల్‌ను ఆవిష్కరించి, గ్లింప్స్ విడుదల చేశారు. భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ 'ఆనంద్ ఈ కథ కోసం చాలా కష్టపడ్డారు. ఏడాదిన్నరకు పైగా ప్రీ ప్రొడక్షన్ కోసమే పని చేశారు. మంచి కథతో అందరి ముందుకు రాబోతున్నాం' అని చెప్పారు. ఆనంద్ రవి మాట్లాడుతూ 'నేను పేరెంట్స్, ప్రతినిధి, నెపోలియన్, కొరమీను వంటి విభిన్న కథా చిత్రాలను తీశాను. కానీ సరైన సక్సెస్, గుర్తింపు రాలేదు. 'నెపోలియన్ రిటర్న్స్'తో ఆ రెండూ వస్తాయనే నమ్మకం ఇప్పుడు కలుగుతోంది. సినిమా మంచి ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. తొమ్మిది నెలల పిల్లాడు ఆత్మగా మారే పాయింట్‌తో ఇంతవరకూ ఎక్కడా సినిమా రాలేదు' అని పేర్కొన్నారు. 'ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కు మంచి పేరు వస్తుంది' అని చిత్ర కథానాయిక దివి అన్నారు.



లార్డ్ మార్కో?


మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కొత్త చిత్రం ఖరారైంది. 'మార్కో', 'కట్టలాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ విషయాన్ని నిర్మాత షరీఫ్ మహ్మద్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతోందో తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. మునుపెన్నడూ పోషించని ఓ విభిన్నమైన పాత్రలో మమ్ముట్టి కనిపించనున్నట్లు షరీఫ్ తెలిపారు. దర్శకుడు, ఇతర తారాగణం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. అయితే ఈ చిత్రం పేరు 'లార్డ్ మార్కో' అయి ఉంటుందని పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 'మార్కో' డైరెక్టర్ హనీఫ్ అదేని, క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలిసి నెల రోజుల క్రితం కేరళ ఫిల్మ్ ఛాంబర్‌లో 'లార్డ్ మార్కో' టైటిల్‌ని రిజిస్ట్రేషన్ చేయించడం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. కాగా, మమ్ముట్టి నటించి, నిర్మించిన 'కలమ్ కావల్' సినిమా నవంబరు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదల తర్వాతే మమ్ముట్టి కొత్త ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలున్నట్లు సమాచారం.



లవ్ అండ్ వార్ ఇటలీలో క్లైమాక్స్‌కు

దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ గ్రాండియర్‌గా తెరకెక్కిస్తోన్న బాలీవుడ్ చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్, అలియాభట్ ప్రధాన తారాగణం. త్వరలో ఇటలీలో ఈ చిత్రం షెడ్యూల్ జరగాల్సి ఉంది. అయితే ఆ షెడ్యూల్‌ను రద్దు చేసి ముంబైలోనే షూటింగ్ జరిపేందుకు మేకర్స్ సిద్ధమైనట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. భారీ సెట్స్ నిర్మించి అందులో ఇటలీకి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించనున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే ఆ వార్తల్లో నిజం లేదని మేకర్స్ తెలిపారు. అయితే ఆ షెడ్యూల్ రద్దు కాలేదని మేకర్స్ తెలిపారు. కథానుసారం రియల్ లొకేషన్లలోనే చిత్రీకరించనున్నట్లు తెలిపారు. నవంబర్‌లో పది రోజుల షెడ్యూల్‌ను ముంబైలో ప్లాన్ చేస్తున్నారు. అది పూర్తయ్యాక 20 రోజుల పాటు సాగే గ్రాండ్ క్లైమాక్స్ షెడ్యూల్‌ను డిసెంబర్‌లో ఇటలీలో చేయనున్నారు. అక్కడ 45 రోజుల షెడ్యూల్‌ను ప్లాన్ చేసినా చివరకు 20 రోజులకు కుదించినట్లు మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.





ఆర్యన్ ప్రణయ గీతం



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఈనెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి(శ్రేష్ఠ మూవీస్) విడుదల చేస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. తాజాగా చిత్రబృందం 'పరిచయమే...' అంటూ హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రణయ గీతాన్ని విడుదల చేసింది. సామ్రాట్ రాసిన ఈ గీతానికి జిబ్రాన్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. వరుస హత్యల నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు. కాగా, ఈ చిత్రానికి హరీశ్ కన్నన్ డీఓపీగా వ్యవహరిస్తున్నారు.

స్పోర్ట్స్



దీక్ష, షైనాలకు స్వర్ణాలు

● ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్

చెంగ్డు: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో దీక్ష సుధాకర్, షైనా మణిముత్తు స్వర్ణాలతో మెరిశారు. బాలికల అండర్-17 కేటగిరీలో సహచర భారత ప్లేయర్ల మధ్య జరిగిన ఫైనల్లో దీక్ష 21-16, 21-9తో లక్ష్య రాజేష్‌పై గెలిచింది. దీంతో ఈ చాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం నెగ్గిన తొలి భారత షట్లర్‌గా దీక్ష రికార్డు లకెక్కింది. అండర్-15 తుదిపోరులో షైనా 21-14, 22-20తో చిహారు టోమిటా (జపాన్)పై నెగ్గింది. సెమీస్‌లో ఓడడంతో జగ్‌షేర్ సింగ్, మిక్స్‌డ్ జోడీ జగ్జీత్ సింగ్-జననిక రమేష్ కాంస్యాలు దక్కాయి. టోర్నీలో భారత్ రెండు స్వర్ణ, రజత, రెండు కాంస్యాలు సాధించింది. అత్యధిక పతకాల పరంగా ఈ టోర్నీలో భారత జట్టుకిదే అత్యుత్తమ రికార్డు.

వెంకట్రామ్ రెడ్డికి కాంస్యం



రాంచీ: దక్షిణాసియా సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో కర్నూలు అథ్లెట్ ఎం. వెంకట్రామ్ రెడ్డి కాంస్యం కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లోని 800 మీటర్ల పరుగును వెంకట్రామ్ 1 నిమిషం 52.56 సెకన్లలో పూర్తి చేశాడు. హర్ష (శ్రీలంక) స్వర్ణం, బహదూర్ (నేపాల్) రజతం సాధించారు. భారత్ 32 మెడల్స్ గెలిచి పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలవగా, శ్రీలంక 23 పతకాలతో రెండో స్థానం దక్కించుకుంది.

పసిడిపోరుకు సుజీత్

● అండర్-23 ప్రపంచ రెజ్లింగ్

నోవి సాద్ (సెర్బియా): భారత సుజీత్ కల్కాల్ అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండోసారి పతకం ఖాయం చేసుకున్నాడు. నిరుడు కాంస్యం సాధించిన సుజీత్ ఈసారి ఏకంగా పసిడి పోరులో నిలిచాడు. ఆదివారం జరిగిన ఫ్రీస్టయిల్ 65 కిలోల విభాగం సెమీఫైనల్లో సుజీత్ 3-2తో నిషియచి (జపాన్)ను ఓడించాడు. సోమవారం జరిగే ఫైనల్లో ఉజ్బెకిస్థాన్ రెజ్లర్ ఉమిజాన్ జలోలోవ్‌తో సుజీత్ తలపడనున్నాడు.

వరుణుడిదే ఆట



భారత్-బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు

మహిళల వన్డే వరల్డ్‌కప్

నవీ ముంబై: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్ ఆడిన చివరి గ్రూప్ మ్యాచ్‌కు వరుణుడు అడ్డుతగిలాడు. దీంతో ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ నామమాత్రపు మ్యాచ్ రద్దవడంతో ఇరు జట్లకు చెరో పాయింట్‌ను కేటాయించారు. హర్మన్‌ప్రీత్ సేన ఇప్పటికే సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. వర్షంతో అర్ధగంట ఆలస్యంగా ఆరంభమైన ఈ మ్యాచ్‌లో..బంగ్లా ఇన్నింగ్స్ సమయంలో దాదాపు రెండున్నర గంటలపాటు అంతరాయం కలిగించింది. దీంతో మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించారు. నిర్ణీత ఓవర్లలో బంగ్లా 9 వికెట్ల నష్టానికి 119 పరుగులకే పరిమితమైంది. తాజా ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడిన స్పిన్నర్ రాధా యాదవ్‌కు మూడు, శ్రీచరణికి రెండు వికెట్లు దక్కాయి. బంగ్లా ఇన్నింగ్స్‌లో షర్మీన్ అక్తర్ (36), సొభానా మోస్తరి (26) మాత్రమే రాణించారు. స్పిన్నర్ల ధాటికి ఆ జట్టు వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత ఛేదనలో భారత్‌కు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 126 పరుగుల టార్గెట్‌ను విధించారు. ఓపెనర్ మంధాన (34 నాటౌట్) ఆరంభం నుంచే చెలరేగి నాలుగో ఓవర్‌లో నాలుగు ఫోర్లతో 16 రన్స్ రాబట్టింది. అయితే 8.4 ఓవర్లలో భారత్ వికెట్ నష్టపోకుండా 57 పరుగులు చేసిన వేళ వర్షం మరోసారి ఆటంకం కలిగించింది. ఆ తర్వాత పరిస్థితులు ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ప్రతీకా స్థానంలో అమన్‌జోత్ (15 నాటౌట్) ఓపెనర్‌గా బరిలోకి దిగింది.

ప్రతీకా రావల్‌కు గాయం



ఆస్ట్రేలియాతో కీలక సెమీఫైనల్స్‌కు ముందు భారత్‌కు ఝలక్ తగిలింది. బంగ్లా ఇన్నింగ్స్ సమయంలో ప్రతీకా రావల్ గాయపడింది. బౌండరీ లైన్ దగ్గర బంతిని ఆపే ప్రయత్నంలో మోకాలికి గాయం కావడంతో పాటు చీలమండ మెలి తిరగడంతో ఆమె మైదానంలోనే కుప్పకూలింది. ఆ వెంటనే ఫిజియో వచ్చి పరిశీలించిన తర్వాత రావల్ నడవడానికి ఇబ్బందిపడుతూనే డగౌట్‌కు వెళ్లింది.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్: సుమయా అక్తర్ (సి) శ్రీచరణి (బి) రేణుక 2, రుబియా హైదర్ (సి) హర్లీన్ (బి) దీప్తి 13, షర్మిన్ అక్తర్ (సి/సబ్) అరుంధతి (బి) శ్రీచరణి 36, నిగర్ సుల్తానా (రనౌట్) 9, సొభానా మోస్తరీ (సి) హర్లీన్ (బి) రాధ 26, షోర్నా అక్తర్ (బి) అమన్‌జోత్ 2, నహిదా అక్తర్ (బి) రాధ 3, రబేయా ఖాన్ (బి) రాధ 3, రీతూ మోని (సి) జెమీమా (బి) శ్రీచరణి 11, నిషితా అక్తర్ (నాటౌట్) 4, మరూఫా అక్తర్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 27 ఓవర్లలో 119/9; వికెట్ల పతనం:** 1-3, 2-34, 3-53, 4-91, 5-94, 6-99, 7-101, 8-105, 9-117; **బౌలింగ్:** రేణుక 5-0-23-1, దీప్తి శర్మ 5-2-24-1, అమన్‌జోత్ 5-0-18-1, శ్రీచరణి 6-0-23-2, రాధా యాదవ్ 6-0-30-3.

భారత్: స్మృతి మంధాన (నాటౌట్) 34, అమన్‌జోత్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 8.4 ఓవర్లలో 57/0; బౌలింగ్:** మరూఫా అక్తర్ 2-0-15-0, నిషితా అక్తర్ 2-0-18-0, నహిదా అక్తర్ 2-0-12-0, రబేయా ఖాన్ 1.4-0-7-0, రీతూ మోని 1-0-5-0.

ఓటమితో ముగించిన కివీస్

రెండో స్థానానికి ఇంగ్లండ్



విశాఖపట్నం: మహిళల వరల్డ్‌కప్‌ను న్యూజిలాండ్ ఓటమితో ముగించింది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఈ జట్టు 8 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. కివీస్ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క విజయం మాత్రమే దక్కగా.. రెండు వర్షార్పణమయ్యాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 38.2 ఓవర్లలో 168 పరుగులకు కుప్పకూలింది. ప్లిమ్మర్ (43), అమేలియా కెర్ (35) రాణించారు. లిన్సేకు మూడు, బ్రంట్.. కాప్సీలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 29.2 ఓవర్లలో 172/2 స్కోరుతో నెగ్గింది. ఎమీ జోన్స్ (86 నాటౌట్), బ్యూమాంట్ (40), హీథర్ (33) ఆకట్టుకున్నారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ఆస్ట్రేలియా	7	6	0	1	13	2.102
ఇంగ్లండ్	7	5	1	1	11	1.233
దక్షిణాఫ్రికా	7	5	2	0	10	-0.379
భారత్	7	3	3	1	7	0.628
శ్రీలంక	7	1	3	3	5	-1.035
న్యూజిలాండ్	7	1	4	2	4	-0.876
బంగ్లాదేశ్	7	1	5	1	3	-0.578
పాకిస్థాన్	7	0	4	3	3	-2.651

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

సోఫీ డివైన్ వీడ్కోలు

కివీస్ మహిళల క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన కెప్టెన్ సోఫీ డివైన్ తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌తో కెరీర్‌ను ముగిస్తానని 36 ఏళ్ల సోఫీ ఇదివరకే ప్రకటించింది. 2006లో అరంగేట్రం చేసిన తను 159 వన్డేల్లో తొమ్మిది సెంచరీలతో 4,279 రన్స్ 111 వికెట్లు.. అలాగే 146 టీ20ల్లో ఓ సెంచరీతో 3,431 పరుగులు, 119 వికెట్లు తీసి అద్భుత ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకుంది. 2011-12లో క్రికెట్‌కు బ్రేక్ ఇచ్చి కివీస్ హాకీ జట్టుకు ఆడడం విశేషం. మ్యాచ్ ముగిశాక ఇంగ్లండ్ ఆటగాళ్లు తమ సంతకాలతో కూడిన జెర్సీని డివైన్‌కు బహుమతిగా ఇచ్చారు.

హైదరాబాద్ 435

పుదుచ్చేరితో రంజీ

పుదుచ్చేరి: బ్యాటర్లు రాణించడంతో గ్రూప్-డిలో పుదుచ్చేరితో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 255/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 435 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ రాధేష్ (81), హిమతేజ (66), రోహిత్ రాయుడు (34) రాణించారు. సాగర్ ఉదేషి 4.. జయంత్ యాదవ్, కరణ్ కన్నన్ రెండేసి వికెట్లు దక్కించుకొన్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో పుదుచ్చేరి 25/1 స్కోరు చేసింది.

63 ఏళ్ల రికార్డు బద్దలు: అత్యంత వేగంగా (540 బంతుల్లోనే) ముగిసిన మ్యాచ్‌గా సర్వీసెస్-అసోం పోరు.. 63 ఏళ్లనాటి రికార్డును బద్దలు కొట్టింది. గ్రూప్-సిలో సర్వీసెస్ 8 వికెట్ల తేడాతో అసోంను చిత్తు చేసింది. ఆటకు రెండో రోజు అసోం నిర్దేశించిన 71 పరుగుల లక్ష్యాన్ని సర్వీసెస్ 13.5 ఓవర్లలో 73/2 స్కోరు చేసి గెలిచింది. అసోం 103, 75 స్కోర్లు చేయగా.. సర్వీసెస్ తొలి ఇన్నింగ్స్‌లో 108 పరుగులకు ఆలౌటైంది. అయితే, మ్యాచ్ ఫలితం 90 ఓవర్ల లోపే.. అంటే 540 బంతుల్లోనే తేలిపోయింది. 1962లో ఢిల్లీ-రైల్వేస్ మధ్య జరిగిన మ్యాచ్ 547 బంతుల్లో ముగిసింది.

రెండు హ్యాట్రిక్‌లతో రికార్డు

ఈ మ్యాచ్‌లో సర్వీసెస్ బౌలర్లు ఏకంగా రెండు హ్యాట్రిక్‌లు నమోదు చేశారు. అసోం స్కోరు 45 వద్ద తొలుత అర్జున్ శర్మ, 103 పరుగులవద్ద మోహిత్ జాంగ్రా హ్యాట్రిక్‌లతో చెలరేగారు. ఇలా ఒకే మ్యాచ్‌లో ఇద్దరు బౌలర్లు హ్యాట్రిక్‌లు సాధించడం రంజీల్లో ఇదే తొలిసారి. కాగా ఓ రంజీ మ్యాచ్‌లో ఒకే బౌలర్ (జోగిందర్‌సింగ్ రావ్-సర్వీసెస్) రెండు హ్యాట్రిక్‌లు తీసిన రికార్డు 1963లో నమోదైంది.

వాలీబాల్ విజేత బెంగళూరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సీజన్-4 టైటిల్‌ను బెంగళూరు టార్పెడోస్ జట్టు సొంతం చేసుకుంది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో బెంగళూరు 3-0 (15-13, 16-4, 15-13)తో ముంబై మీటియర్స్‌పై ఘన విజయం సాధించింది. జోయెల్ బెంజిమిన్, సేతు, మాట్‌వెస్ట్ బెంగళూరు గెలుపులో ముఖ్యభూమిక పోషించారు. పీవీఎల్‌లో బెంగళూరు టైటిల్ నెగ్గడం ఇదే తొలిసారి. ఈ సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తొమ్మిదో స్థానంతో ముగించింది.



రో-కో మళ్లీ ఆడేదెప్పుడంటే..



న్యూఢిల్లీ : టీమిండియా దిగ్గజ బ్యాటింగ్ ద్వయం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాతో చివరి వన్డేలో అద్భుత బ్యాటింగ్‌తో తమ అభిమానులను అలరించారు. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీసే కావడంతో..అక్కడ వారి పర్యటన ముగిసింది. రోహిత్, కోహ్లీ కేవలం వన్డేలకే పరిమితం కావడంతో వారు మళ్లీ భారత జట్టు తరపున బరిలోకి దిగేదెప్పుడనే చర్చ ఫ్యాన్స్‌లో మొదలైంది. టీమిండియా తదుపరి వన్డే సిరీస్‌ను స్వదేశంలో దక్షిణాఫ్రికాతో ఆడనుంది. వచ్చే నెల 30న రాంచీలో జరిగే మ్యాచ్‌తో ఈ సిరీస్ ఆరంభమవుతుంది. డిసెంబరు మూడు, ఆరు తేదీలలో మిగిలిన రెండు వన్డేలు జరుగుతాయి.

న్యూజిలాండ్ బోణీ

● బ్రూక్ శతకం వృధా
● తొలి వన్డేలో ఇంగ్లండ్ ఓటమి

మౌంట్ మాంగనూ: ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో పేసర్లు రాణించడంతో కివీస్ నాలుగు వికెట్లతో నెగ్గింది. ముందుగా ఇంగ్లండ్ 35.2 ఓవర్లలో 223 పరుగులకు కుప్పకూలింది. 56/6 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ హ్యారీ బ్రూక్ (135) శతకంతో ఆదుకోగా ఒవర్టన్ (46) సహకరించాడు. మిగతా తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం గమనార్హం. పేసర్లు జకారీ ఫోక్స్‌కు 4, డఫీకి 3, హెన్రీకి 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్ 36.4 ఓవర్లలో 224/6 స్కోరుతో నెగ్గింది. మిచెల్ (78 నాటౌట్), బ్రేస్‌వెల్ (51) అర్ధసెంచరీలు సాధించారు. కార్స్‌కు 3 వికెట్లు తీశాడు. తమ జట్టు ఓటమిపాలైనా ఒంటరి పోరాటం చేసిన బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' లభించింది.

కేకేఆర్ కోచ్‌గా అభిషేక్ నాయర్?



కోల్‌కతా: ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రధాన కోచ్‌గా అభిషేక్ నాయర్ ఎంపిక దాదాపుగా ఖరారైంది. మూడేళ్ల నుంచి కోచ్‌గా ఉన్న చంద్రకాంత్ పండిట్‌ను గత జూలైలో కేకేఆర్ తొలగించింది. వారం రోజుల క్రితమే కోచ్ పదవిపై కేకేఆర్ నాయర్‌తో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. అయితే ఈ విషయమై ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. పండిట్ శిక్షణలో జట్టు 2024లో విజేతగా నిలిచినప్పుడు నాయర్ బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నాడు. అలాగే ఈ ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ జట్టుకు చీఫ్ కోచ్‌గా పనిచేశాడు.

క్వాలిఫయర్‌లో టైటాన్స్ గెలుపు



న్యూఢిల్లీ: ఉత్కంఠభరితంగా జరిగిన ప్రొ కబడ్డీ మినీ క్వాలిఫయర్‌లో తెలుగు టైటాన్స్ గెలుపొందింది. ఆదివారం జరిగిన ఈమ్యాచ్‌లో టైటాన్స్ 37-32తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. ఆల్‌రౌండర్ భరత్ హుడా 12 పాయింట్లతో, కెప్టెన్ విజయ్ మాలిక్ 10 పాయింట్లతో టైటాన్స్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో నెగ్గిన టైటాన్స్ మంగళవారం జరిగే ఎలిమినేటర్-3 పోరుకి అర్హత సాధించింది. ఇక, ఎలిమినేటర్-1 మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-32తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలిచింది.

బిజినెస్

ఏఐ ఇన్‌ఫ్రాపై రిలయన్స్ రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడి

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతులపై దృష్టి సారిస్తోంది. రాబోయే కొన్నేళ్లలో ఒక గిగావాట్ డేటా సెంటర్ ప్రారంభించడం సహా ఏఐ మౌలిక సదుపాయాలపై 1,200 నుంచి 1,500 కోట్ల డాలర్ల (రూ.1.03-1.29 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేయనుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. రిలయన్స్ ఇంటలిజెన్స్ పేరిట ఒక కొత్త అనుబంధ సంస్థ ప్రారంభించడంతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా తాము ఏఐకి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు గత ఆగస్టులో జరిగిన వాటాదారుల సమావేశంలో అంబానీ తెలిపారు. రిలయన్స్ ప్రతి దశాబ్దికి ఒకసారి తన సామ్రాజ్యాన్ని అప్పటి పరిస్థితులకు అనుగుణంగా పునర్నిర్మించుకుంటుందని, ఇప్పుడు కంపెనీ ఈక్విటీ కథనాన్ని ఏఐ పునర్నిర్మించనుందని మోర్గాన్ స్టాన్లీ ఆ నివేదికలో తెలిపింది. దేశంలోనే అతి పెద్దదైన డేటా సెంటర్ తొలి దశ నిర్మాణం జామ్‌నగర్‌లో వేగంగా సాగుతోందని, వ్యాపార సంస్థల డిమాండ్‌కు అనుగుణంగా దాన్ని మరింతగా విస్తరించుకుంటూ పోతామని అప్పట్లో రిలయన్స్ చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	575
వరంగల్	562	గోదావరి	570
చిత్తూరు	583	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	109
కర్నూలు	117	నెల్లూరు	114
విశాఖపట్నం	119	అనంతపురం	114
గోదావరి	123		

బులియన్ మార్కెట్లో అనిశ్చితి

ధరలు మరింత కిందికే!

● లాభాల స్వీకరణకు అవకాశం
● కేంద్ర బ్యాంకుల వైఖరే కీలకం



న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో ఈ వారం కూడా ధరల పతనం కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. గత సోమవారం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి (24 క్యారట్స్) బంగారం రికార్డు స్థాయిలో 4,398 డాలర్లకు (సుమారు రూ.3.87 లక్షలు) చేరింది. ఆ మరుసటి రోజే గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు 266.4 డాలర్లు (6.11%) పడిపోయింది. వెండిదీ ఇదే పరిస్థితి. ఈ నెల 17న ఔన్స్ వెండి ధర రికార్డు స్థాయిలో 53.76 డాలర్లను తాకింది. ఈ నెల 21న ఈ ధర 47.12 డాలర్లకు పడిపోయింది.

అదే బాటలో దేశీ మార్కెట్

గత వారం బంగారం, వెండికి దేశీయ మార్కెట్ కూడా కలిసి రాలేదు. గత వారం 10 గ్రాముల మేలిమి బంగారం ఒక దశలో రూ.1.32 లక్షలకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి ధర రూ.1.90 లక్షలు తాకింది. వారాంతానికల్లా లాభాల స్వీకరణతో రూ.1.70 లక్షలకు దిగొచ్చింది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌పైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. డిసెంబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం గత వారం రూ.3,557 (2.8%) నష్టంతో ముగిసింది. వెండిదీ ఇదే పరిస్థితి. ఎంసీఎక్స్‌లో డిసెంబరులో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర గత వారం రూ.9,134 (5.83%) నష్టపోయింది.

మరింత దిద్దుబాటు? ఈ వారం కూడా లాభాల స్వీకరణతో బంగారం, వెండి ధరలు మరింత దిద్దుబాటుకు లోనవుతాయని మార్కెట్ వర్గాల అంచనా. ఈ నెల 28-29న జరిగే అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ సమావేశం, ఈ నెల 30న జరిగే యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) సమావేశాల్లో వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు వచ్చే కొద్ది రోజులు బులియన్ మార్కెట్‌ను నడిపిస్తాయని మార్కెట్ వర్గాల అంచనా. ఈ రెండు సంఘటనలకు తోడు గురువారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగే భేటీతో రెండు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధం చల్లబడుతుందని భావిస్తున్నారు. భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) చర్చలు కూడా దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బంగారం, వెండి ధరలు ఈ వారం మరో 5% వరకు పతనమయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

కేంద్ర బ్యాంకులు ఎందుకు కొంటున్నాయంటే?

- డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మారడం
- వడ్డీ రేట్లు భారీగా తగ్గించినా సంపన్న దేశాల్లో వృద్ధి రేటు 2% దిగువకు చేరడం
- ప్రభుత్వ రుణ పత్రాల కంటే పసిడిపై రాబడులు ఎక్కువగా ఉండడం
- అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై నమ్మకం సన్నగిల్లడం
- ఎగవేతలు, దివాలా బాధ లేకపోవడం
- విలువ పెద్దగా హెచ్చు తగ్గులకు లోనయ్యే అవకాశం లేకపోవడం
- ద్రవ్యోల్బణ సమయంలోనూ పెట్టుబడుల విలువ క్షీణించక పోవడం
- కష్ట సమయాల్లో అమెరికా వంటి దేశాల ఆర్థిక ఆంక్షల నుంచి కాపాడుతుందనే భరోసా
- ఆర్థిక మాంద్యం వంటి ఆర్థిక సంక్షోభాల సమయంలోనూ ఫారెక్స్ నిల్వల విలువకు రక్షణ
- బహుళ ధ్రువ ప్రపంచంలో స్వతంత్ర ద్రవ్య విధానానికి వెసులుబాటు
- డాలర్, పౌండ్ వంటి కరెన్సీలతో పోలిస్తే ఫారెక్స్ నిల్వలకు అధిక రక్షణ
- డాలర్ ఆధిపత్యంపై సన్నగిల్లుతున్న ఆశలు

దిద్దుబాటు తాత్కాలికమే

అయితే బంగారం, వెండి ధరల్లో ఈ దిద్దుబాటు తాత్కాలికమేనని మార్కెట్ వర్గాల అంచనా. దీర్ఘకాలానికి చూస్తే ఈ రెండు లోహాలకు ఢోకా లేదని నిపుణులు చెబుతున్నారు. 'గత వారం బంగారం, వెండి ధరలు తీవ్ర దిద్దుబాటుకు లోనయ్యాయి. అయినా దీర్ఘకాలిక పెట్టుబడులకు ఈ రెండు లోహాలు ఇప్పటికే అనుకూలంగానే ఉన్నాయి' అని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ అనలిస్ట్ రియా సింగ్ తెలిపారు.

26,000 వద్ద అప్రమత్తం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ప్రారంభమై కీలక నిరోధం 26,000 కూడా దాటింది. కాని ఆ స్థాయిలో నిలదొక్కుకోలేక పోయింది. గత ఏడాది సెప్టెంబరులో ఏర్పడిన గరిష్ఠ స్థాయి 26,100 సమీపంలో రియాక్షన్‌కు గురి కావడం అప్రమత్త సంకేతం. అయితే ముందు వారంతో పోల్చితే మాత్రం 85 పాయింట్ల స్వల్ప లాభంతో 25,800 సమీపంలో క్లోజైంది. నాలుగు వారాల నిరంతర ర్యాలీలో 1,600 పాయింట్ల మేరకు లాభపడిన అనంతరం గరిష్ఠ స్థాయిల్లో ఆకస్మికంగా ఏర్పడిన రియాక్షన్ ఇది. కీలక నిరోధ స్థాయిలో ఏర్పడిన ఈ రియాక్షన్ కారణంగా ఈ వారంలో మరింత అప్రమత్త లేదా కన్సాలిడేషన్ ట్రెండ్‌కు ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఉండవచ్చు. పాజిటివ్ ట్రెండ్‌లో పురోగమించినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 26,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, జీవితకాల గరిష్ఠ స్థాయి 26,300.

బేరిష్ స్థాయిలు: మరింత రియాక్షన్‌కు గురైనా భద్రత కోసం మద్దతు స్థాయి 25,500 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,000.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ ఫ్లాట్‌గా ట్రేడయి 57,700 వద్ద క్లోజయింది. ముందు వారం జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకిన అనంతరం ఏర్పడిన పుల్‌బ్యాక్ రియాక్షన్ ఇది. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ప్రధాన నిరోధం 58,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 59,000. రియాక్షన్‌లో పడినా భద్రత కోసం మద్దతు స్థాయి 57,000 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనత తప్పదు.

పాటర్న్: సానుకూలత కోసం 25,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశించిన తర్వాత రియాక్షన్ ఏర్పడినందు వల్ల గరిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,920, 26,000
మద్దతు	25,700, 25,620

25,500 దిగువన బేరిష్

(అక్టోబరు 27-31 తేదీల మధ్య వారానికి)

టెక్ వ్యూ



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,718-26,099 పాయింట్ల మధ్యన కదలాడి 85 పాయింట్ల లాభంతో 25,795 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,500 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,230, 25,035, 25,030, 24,269 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,500
నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200 (25,900 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400 (25,500 దిగువన బేరిష్)

ఆచితూచి వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. మారుతున్న అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం, అనిశ్చితి ఇందుకు కారణాలు. మరోవైపు మదుపరులు కూడా కొనుగోళ్లకు పెద్దగా ఆసక్తి చూపించటం లేదు. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

టాటా ఎలెక్సీ: రెండేళ్లుగా పతనమవుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయికి చేరుకుంది. ఇక్కడ కాస్త బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.5,544 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.5,500 స్థాయిలో అక్యుములేట్ చేసుకుంటూ రూ.5,750/6,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.5,380.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్: ఈ కౌంటర్ ఆరు నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం బ్రేకౌట్ అయ్యింది. పైగా రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.1,036 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,080/1,150 టార్గెట్ ధరతో రూ.1,020 వద్ద పడుతున్నప్పుడు కొనుగోలు చేయాలి. రూ.990 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా కన్స్యూమర్: ఏడాది గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన ఈ కౌంటర్ ప్రస్తుతం పుల్‌బ్యాక్ అయ్యింది. గత శుక్రవారం రూ.1,896 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,860 శ్రేణిలో ప్రవేశించి రూ.2,050/2,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,810.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్: గత ఆరు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. ట్రెండ్ రివర్సల్ అయ్యే అవకాశం ఉంది. రక్షణ రంగం మళ్లీ పుంజుకుంటుండటంతో మదుపరులు మళ్లీ ఆసక్తి కనబరుస్తున్నారు. గత శుక్రవారం రూ.1,544 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,500 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,650/1,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,450 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కేపీఐటీ టెక్నాలజీస్: రెండేళ్లుగా జీరో రిటర్నులు ఇచ్చిన ఈ కౌంటర్ ఏడాది కాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. గత శుక్రవారం రూ.1,178 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,150 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,120.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఎస్‌బీఐలో మరో 3,500 ఆఫీసర్ల కొలువులు

న్యూఢిల్లీ: దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) తన వ్యాపార, ఖాతాదారుల సేవలను మరింత విస్తృతం చేస్తోంది. ఇందుకోసం వచ్చే ఐదు నెలల్లో మరో 3,500 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ) పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం మూడు దశల పరీక్ష తర్వాత వీరి ఎంపిక ఉంటుందని ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీ (హెచ్‌ఆర్) కిశోర్ కుమార్ పోలుదాసు చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికే 505 పీఓ పోస్టుల భర్తీ పూర్తయిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఫీసర్లు, క్లరికల్ పోస్టులతో కలుపుకుని 18,000 పోస్టులు భర్తీ చేయబోతున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఇంతకు ముందే ప్రకటించారు. ఐటీ, సైబర్ సెక్యూరిటీ విభాగాల కోసం ఎస్‌బీఐ ఇప్పటికే 1,300 నిపుణుల నియామకం పూర్తి చేసింది.


చెంచు జంటలను ఆశీర్వదిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బండారు దత్తాత్రేయ, హైకోర్టు జడ్జి మాధవీ లత

కులాంతర వివాహాలే సామాజిక న్యాయానికి మార్గం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అచ్చంపేటలో 111 చెంచు జంటలకు వివాహాలు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కులాంతర వివాహాలను ప్రోత్సహించే సంస్కృతి బలపడాలని, దీని ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిలషించారు. ఆదివాసీలకు అండగా నిలబడాల్సిన బాధ్యత అన్ని వర్గాలపై ఉన్నదని, వారి ఉన్నతి కోసం నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. వనవాసీ కల్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో చెంచు తెగకు చెందిన 111 జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జిష్ణుదేవ్ వర్మతో పాటు హర్యాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైకోర్టు జడ్జి మాధవీ లత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కులాలు, మతాలు లేని సమాజం ఏర్పడాలని ఆకాంక్షించారు. ఇందుకోసం కుటుంబంలోనే మార్పు మొదలు కావాలని సూచించారు. ఆదిమ జాతి చెంచులను అక్కున చేర్చుకుని వారికి అండగా నిలబడాలని ఆయన కోరారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, చెంచుల జీవితాల్లో సమూలమైన మార్పు కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలన్నింటినీ ప్రోత్సహించాలన్నారు. 111 జంటలను ఏకం చేసిన వనవాసీ కల్యాణ్ పరిషత్ సభ్యులను ఆయన అభినందించారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. భక్తులు కార్తిక మాసం సందర్భంగా దీపాలు వెలిగించడంతో పాటు సత్యదేవుడి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మ దర్శనానికి 2 గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. 713 జంటలు సత్యదేవుడి వ్రతాలు ఆచరించగా, వివిధ విభాగాల ద్వారా రూ.52,37,284 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో రవినాయక్ తెలిపారు.

ప్రాణాలైనా వదిలేస్తాం.. భూములు ఇవ్వం

- తెగేసి చెప్పిన మొండిగౌరెల్లి రైతులు

యాచారం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రాణాలైనా వదిలేస్తాం కానీ ప్రభుత్వానికి భూములు అప్పగించే ప్రసక్తే లేదని రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లి రైతులు స్పష్టం చేశారు. ఏళ్లతరబడి వీటిపైనే ఆధారపడి బతుకుతున్నామని గట్టిగా గళమెత్తారు. ఆదివారం గ్రామంలో రాజకీయాలకతీతంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అసైన్డ్ భూములు తీసుకునేందుకు ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా సహించేది లేదన్నారు. కలెక్టర్, టీజీఐఐసీ అధికారులు రైతుల అభిప్రాయాలను పట్టించుకోకుండా బలవంతంగా తీసుకునేందుకు యత్నిస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆయుర్వేదాన్ని అల్లోపతిని మిక్స్ చేయడమే ప్రిజమ్

- ఐ-ప్రిజమ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదాన్ని అల్లోపతితో మిళితం చేసి అందించే వైద్య ప్రక్రియే పాలీ సైంటిఫిక్ రీజనరేటివ్ ఇంటిగ్రేటివ్ సిస్టమ్స్ మెడిసన్(ప్రిజమ్) అని ఐ-ప్రిజమ్ వ్యవస్థాపకుడు డాక్టర్ రవిశంకర్ పొలిశెట్టి అన్నారు. వ్యాధుల పరంగా చివరి దశలో ఉన్న రోగులకు ఇలా మిళితం చేసిన ఔషధాలతో చికిత్స అందించడం ద్వారా వారిని కాపాడవచ్చని చెప్పారు. అయితే, ఈ ఔషధాలకు శాస్త్రీయ సమ్మతి అవసరమైన నేపథ్యంలో ఐఐటీ-హైదరాబాద్‌తో కలిసి కోర్సును ప్రారంభించినట్లు వివరించారు. మాదాపూర్‌లోని టీ-హబ్‌లో ఆదివారం 'ప్రిజమ్' వైద్య విధానంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్‌తో పాటు ఐఐటీ-హెచ్ బయోటెక్నాలజీ విభాగం డీన్ డాక్టర్ నరహరి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ.. "ప్రిజమ్ వైద్య విధానంపై నమ్మకం రావాలంటే ఐఐటీల్లాంటి సంస్థల ధ్రువీకరణ తప్పనిసరి. మూడేళ్లుగా మేము ప్రయత్నిస్తుంటే ఐఐటీ హైదరాబాద్ వాళ్లు మమ్మల్ని పలు రకాలుగా పరీక్షించి, వారికి నమ్మకం ఏర్పడిన తరువాత ప్రిజమ్ బేసిక్, అడ్వాన్స్‌డ్ కోర్సులను రూపొందించడానికి అంగీకరించారు. బేసిక్ కోర్సు 4 నెలలు ఉంటుంది. ఈ కోర్సులో ఆయుర్వేదం, అల్లోపతి, సంస్కృతం, డాటా సైన్స్, పైథాన్ కోడింగ్, బయో ఇన్ఫర్మేటిక్ కోడింగ్, ల్యాబ్ టెక్నీషియన్ విధానాల్లాంటి 12 విభాగాలుంటాయి. దీనివల్ల ఇప్పుడున్న డాక్టర్లు ఇంటిగ్రేటివ్ డాక్టర్లుగా మారతారు. అంటే, శాస్త్రీయంగా ఆయుర్వేదం, అల్లోపతి లాంటి వైద్య పద్ధతులను మిళితం చివరి దశలో ఉన్న రోగుల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు కృషి చేయగలరు" అని వివరించారు. ఈ కోర్సు చేయడానికి ఎంబీబీఎస్‌తో పాటుగా లైఫ్ సైన్సెస్ గ్రాడ్యుయేట్లు, టెక్నోక్రాట్స్, ఆయుష్ డాక్టర్లు అందరూ అర్హులేనని చెప్పారు. దేశంలో ప్రస్తుతం 4కోట్ల మంది వివిధ వ్యాధుల బారిన పడి చివరిదశలో ఉన్నారని, 33వేల ప్రిజమ్ డాక్టర్ల అవసరం ఉందని చెప్పారు. తామిప్పుడు నేషనల్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ అసోసియేషన్(నిమా)తోనూ భాగస్వాములుగా మారామని చెప్పిన రవిశంకర్.. నిమాలోని 4.5 లక్షల మంది డాక్టర్లకు ప్రిజమ్ శిక్షణ అందిస్తామని తెలిపారు.

21 మంది మావోయిస్టుల లొంగుబాటు

- నేడు అధికారికంగా ప్రకటించనున్న పోలీసులు
- అడవుల్లో 'ఆపరేషన్ హిడ్మా' ప్రారంభం

చర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టులు లొంగుబాట పడుతున్నారు. మొన్న మావోయిస్టు నేతలు అభయ్, ఆశన్నతో పాటు 251 మంది మావోయిస్టులు లొంగిపోతే, ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో రామ్‌దేవ్ దళానికి చెందిన 21 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో నలుగురు డీవీసీఎం సభ్యులు కాగా, 13 మంది మహిళలు ఉన్నారు. వీరిని అత్యంత భద్రత నడుమ ప్రత్యేక వాహనాల్లో కాంకేర్ జిల్లా భానుప్రతాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు వీరంతా ఆదివారం తుపాకులు పట్టుకుని లొంగిపోయేందుకు బరేబెడా గ్రామానికి చేరుకున్నారు. సుమారు 15 కి.మీ. అడవి గుండా నడుచుకుంటూ వచ్చి.. పోలీసుల ఎదుట లొంగిపోయారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు వారికి తాగునీరు, ఆహారం అందించి భానుప్రతాపూర్ స్టేషన్‌కు తరలించారు. అలాగే 3 ఏకే 47, 2 ఇన్‌సాస్, 4 ఎస్ఎల్ఆర్, ఆరు 303, రెండు సింగ్ బోర్ తుపాకులను మావోయిస్టులు పోలీసులకు అప్పగించారు. వీరి లొంగుబాటును సోమవారం పోలీసులు అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా, గత పది రోజుల్లో వరుసగా 271 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

హిడ్మా అన్వేషణలో బలగాలు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా కోసం బలగాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. నేషనల్ పార్కు, కర్రె గుట్ట, పామేడు అడవుల్లో హిడ్మా ఉన్నట్లు అందిన సమాచారంతో బలగాలు గాలిస్తున్నాయి. ఇప్పటికే అనేక సార్లు కేంద్ర బలగాల నుంచి హిడ్మా తప్పించుకున్నాడు. హిడ్మాకు రక్షణగా సుమారు 200 మంది పైగా బలమైన సెక్యూరిటీ ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, హిడ్మా లొంగిపోవడం జరగదని, ప్రాణాలతో దొరకడం అసాధ్యమని కొంత మంది లొంగిపోయిన సానుభూతి పరులు చెబుతున్నారు. అలాగే సుకుమా అడవుల్లో మావోయిస్టు పాపారావును పట్టుకునేందుకు గాలింపు చేపట్టాయి.

దేశ రక్షణతోపాటు రైతు రక్షణ అవశ్యం

- రైతు సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- రైతునేస్తం వార్షికోత్సవం సందర్భంగా ఐవీ సుబ్బారావు స్మారక అవార్డుల ప్రదానం

హైదరాబాద్ సిటీ/శంషాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణతోపాటు రైతు రక్షణ అత్యంత అవశ్యమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. పట్టణాలు, పరిశ్రమలకు ఇస్తున్నంత ప్రాధాన్యం గ్రామాలు, రైతులకు ఇవ్వడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లెల అభివృద్ధి, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అన్నదాతలు సేంద్రీయ సాగు దిశగా పయనిస్తూ ఆరోగ్య భారతావని నిర్మాణంలో భాగమవ్వాలని పిలుపునిచ్చారు. రైతునేస్తం 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఐవీ సుబ్బారావు స్మారక పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడుతోపాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. భూమి హక్కుల కార్యకర్త ఎం.సునీల్ కుమార్‌కు భూమి రత్న, ఐఎఫ్ఎస్ అధికారి జేపీసీఎస్ రావుకు కృషి రత్న బిరుదులు ప్రదానం చేశారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఆచార్య కొసరాజు చంద్రశేఖర్ రావుకు జీవన సాఫల్య పురస్కారాన్ని అందించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలలో పని చేస్తున్న మరి కొందరిని అవార్డులతో సత్కరించారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. రైతుల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి పార్టీలకతీతంగా ప్రభుత్వాలు పని చేయాలన్నారు. రాజకీయ జీవితంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేయాలన్న కోరిక నెరవేరకపోయినా గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా సేవలు అందించడంతో ఆ లోటు కొంతమేర తీరిందని చెప్పారు. మోదీ విదేశీ విధానంతో అంతర్జాతీయ యవనికపై భారత్ పరపతి పెరిగిందన్నారు. అన్నదాతలను చైతన్యపరిచే బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల కోసం 20 ఏళ్లుగా మాస పత్రిక నిర్వహించడం అసాధారణ విషయమంటూ రైతు నేస్తం వెంకటేశ్వరరావును అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం రైతులను, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత రైతునేస్తం వెంకటేశ్వరరావు, ముప్పవరపు ఫౌండేషన్ ట్రస్టీ ముప్పవరపు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


సునీల్ కుమార్‌కు భూమి రత్న బిరుదు ప్రదానం చేస్తున్న వెంకయ్యనాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చిత్రపురిపై విచారణ ఎప్పుడో!?

(మొదటిపేజీ తరువాయి)

వద్ద తీసుకున్న అప్పును చెల్లించడం కోసం ప్రముఖ సినీ ఫైనాన్షియర్ చదలవాడ శ్రీనివాసరావు దగ్గర రూ.22 కోట్లు తీసుకుంది. ఆయన కుమారుడు రాజేశ్ పేరుతో ఇచ్చిన ఈ మొత్తానికి చాంబర్ పాలక మండలి సభ్యుడొకరు మధ్యవర్తిగా వ్యవహరించారు. "చట్టరీత్యా ఇది చెల్లదని మేం అనేక సార్లు కమిటీకి చెప్పాం. ఉత్తరాలు రాశాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు" అని చిత్రపురి హౌసింగ్ సొసైటీ సభ్యుడు సతీశ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిత్రపురి సమస్య ప్రముఖంగా మారడంతో కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగింది. చిత్రపురి వ్యవహారాలన్నీ కొలిక్కి తీసుకొస్తామని పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. దీంతో చిత్రపురి హౌసింగ్ సొసైటీ పాలకమండలి సభ్యుల్లో కొంత అలజడి చెలరేగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చిత్రపురి సొసైటీ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరుగుతుందని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా ఫిల్మ్ చాంబర్ పాలక మండలికి చెందిన ఇద్దరు వ్యక్తులు రంగంలోకి దిగారని కొందరు ఆరోపిస్తున్నారు. వీరు ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులతో మాట్లాడి చిత్రపురి సొసైటీ పాలక మండలి వ్యక్తులను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. అప్పటి దాకా చిత్రపురి వ్యవహారాలపై కోర్టుల్లో కేసులు వేసిన ఐదుగురికి.. సినీ రంగానికి చెందిన వారని చాంబర్ ముందు నిరూపించుకోవాలంటూ జిల్లా సహకార అధికారి నుంచి నోటీసులు అందాయి. వారు చాంబర్‌కు వెళ్లి వివరణ ఇచ్చారు. అయినా ఆ ఐదుగురి సభ్యత్వాలను చిత్రపురి హౌసింగ్ సొసైటీ రద్దు చేసింది. దీంతో చిత్రపురి కాలనీ పాలక మండలిని వ్యతిరేకించే వారిలో భయాందోళనలు నెలకొన్నాయి.

తెరపైకి 'సఫైర్ సూట్'..!

ఈ పరిణామాలు జరుగుతున్న సమయంలోనే చిత్రపురి హౌసింగ్ సొసైటీ తమ వద్ద ఖాళీగా ఉన్న 3.5 ఎకరాల భూమిలో సఫైర్ సూట్ అనే 45 అంతస్తుల భవంతిని నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. దీని విలువ రూ.200 కోట్ల వరకూ ఉంటుంది. దీనికి హెచ్ఎండీఏ అనుమతులూ లభించాయి. అయితే హైడ్రా ఏర్పాటైన తర్వాత ఈ భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండడంతో అనుమతులు రద్దు చేశారని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే, సఫైర్ సూట్ భవంతికి అనుమతులు ఉన్నట్లు చెబుతూ ఫిల్మ్‌నగర్ క్లబ్‌లో బ్రోచర్ ఆవిష్కరించారు. "ఆ సమయంలోనే ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడికి ఒక రోహౌస్ కేటాయించారు. దీని మార్కెట్ విలువ రూ.3కోట్లు ఉంటుంది. గతంలో మా వద్ద భరత్‌భూషణ్ అనే ఒక సభ్యుడు ఉండేవారు. ఆయన పేరును వాడి తప్పుడు పత్రాలతో ఈయనకు రోహౌస్ ఇచ్చారు. మేం వారిద్దరి వివరాలు సేకరించాం. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు సహా వివరాలన్నింటినీ అధికారులకు అందించాం. కానీ, దానిపై ఇప్పటిదాకా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు" అని కస్తూరి శ్రీనివాస్ చెప్పారు. ఈ ఏడాది అమెరికాలో జరిగిన తానా సమావేశాలకు చిత్రపురిపాలక మండలిలో కొందరు, ఫిల్మ్ చాంబర్‌కు సంబంధించిన మరికొందరితోపాటు ఓ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిసి వెళ్లారని.. అక్కడ సఫైర్ సూట్‌లో ఫ్లాట్లు కొనాలంటూ ఎన్నారైలను కోరారని సభ్యులు పేర్కొంటున్నారు. "ప్రస్తుతం మణికొండలోని అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగు రూ.10వేల వరకు ఉంది. సఫైర్ సూట్‌లో రూ.7వేలకే ఇస్తామని చెప్పడంతో కొందరు ఎన్నారైలు నన్ను సంప్రదించారు. సఫైర్ సూట్‌కి అనుమతులే లేవనిచెప్పాను" అని చిత్రపురి కాలనీకి చెందిన రమేశ్ చెప్పారు. జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒకప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు, ప్రస్తుత చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడికి సన్నిహితుడని..వీరందరూ రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో భాగస్వాములని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు.



అందుకే చాంబర్ ఎన్నికల్లో జాప్యం..!

మెజారిటీ సభ్యులు కోరుకుంటున్నట్లు ఫిల్మ్‌చాంబర్‌కు ఎన్నికలు జరిగితే కొత్త కమిటీ ఏర్పడుతుంది. అప్పుడు చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీతో ఫిల్మ్‌చాంబర్ లావాదేవీలన్నీ బయటికి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. "చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీ చదలవాడ శ్రీనివాసరావుకు ఇంకా సొమ్ము చెల్లించలేదు. ఈ సొమ్ము చెల్లించకపోతే ఆ ఒప్పందానికి మధ్యవర్తిగా ఉన్న ఫిల్మ్‌చాంబర్ పాలక మండలి సభ్యుడికి ఇబ్బంది ఎదురవుతుంది. ఈ సమస్య పరిష్కారానికి కొంత సమయం పడుతుంది. సఫైర్ సూట్ నిర్మాణం ప్రారంభమైతే చిత్రపురి హౌసింగ్ సొసైటీకి సొమ్ములు వస్తాయి. దాంతో సొసైటీ అప్పులు కొంతవరకు తీరతాయి. అప్పటి దాకా చాంబర్ ఎన్నికలు జరగకుండా జాప్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారు" అని పేరు చెప్పడానికి ఇష్టపడని చాంబర్ సభ్యుడు ఒకరు పేర్కొన్నారు. వీటన్నింటిపైనా సమగ్ర దర్యాప్తు జరిపించాలని చిత్రపురి హౌసింగ్ సొసైటీ, ఫిల్మ్‌చాంబర్ సభ్యులు కొందరు డిమాండ్ చేస్తున్నారు.

ఎఫ్‌సీఐలో బియ్యం నిల్వలు.. 23 లక్షల టన్నులు

- ఇవన్నీ ఇతర రాష్ట్రాల పీడీఎస్‌కు వినియోగించేవే
- ప్రతి నెల 6 లక్షల టన్నులు బయటికెళ్తే సరి
- కానీ 3 లక్షల టన్నులు మాత్రమే వెళ్తున్న పరిస్థితి
- జాగా లేకపోవటంతో తగ్గిన 'సీఎంఆర్' డెలివరీ

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)లో బియ్యం నిల్వలు భారీగా పేరుకపోయాయి. ఇతర రాష్ట్రాల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) అవసరాలకు పంపించాల్సిన 23 లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పుడు బియ్యం(బాయిల్డ్ రైస్) రాష్ట్రంలోని గోదాముల్లో నిల్వ ఉన్నాయి. రైల్వే రేకుల కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేకపోవటంతో.. రాష్ట్రంనుంచి బియ్యం బయటికి వెళ్లటంలేదు. ప్రతినెల 6 లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పుడు బియ్యం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి ఉండగా.. ప్రస్తుతం కేవలం 3లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఎఫ్‌సీఐ తరలిస్తోంది. దీంతో రాష్ట్రంలో బియ్యం నిల్వలు పేరుకపోయి స్టోరేజీ సమస్య ఏర్పడుతోంది. దీంతో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ రాష్ట్రంలో మందగించింది. ఇదివరకు సీఎంఆర్ కోసం పౌరసరఫరాల శాఖ అధికారులు రైస్‌మిల్లర్ల వెంటపడేవారు. ఇప్పుడు మిల్లర్లు సీఎంఆర్ అప్పగిస్తామంటే.. స్థలం లేదు! కాస్త ఆగండి! అనే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో 23 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను ఎఫ్‌సీఐ అద్దెకు తీసుకుంది. ఇప్పుడా ఆ గోదాములన్నీ బియ్యం నిల్వలతో నిండిపోయి ఉన్నాయి. ఏమాత్రం ఖాళీజాగా లేకపోవటంతో సీఎంఆర్ సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే రేకుల కేటాయింపులు పెరిగి, ఉప్పుడు బియ్యం బయటికి వెళ్తేనే రాష్ట్రంలోని గోదాముల్లో కొత్త బియ్యం నిల్వలకు ఖాళీ స్థలం దొరుకుతుంది. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న బియ్యం నిల్వలను ఇతర రాష్ట్రాలకు తరలించాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కేంద్ర ప్రభుత్వానికి ఇటీవల లేఖ రాశారు. కార్పొరేషన్ అధికారులు కూడా ఎఫ్‌సీఐ అధికారులను కలిసి రైల్వే రేకులు కేటాయించాలని కోరుతున్నా సమస్య పరిష్కారం కావటంలేదు. ఈలోగా కొత్తగా ధాన్యం సేకరణ ప్రక్రియ మొదలుకావటం గమనార్హం.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమం ఉధృతం

- నవంబరు 2న బీసీ జేఏసీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం
- నవంబరు రెండో వారంలో నిరసన దీక్షలు, మూడో వారంలో ర్యాలీలు, ప్రదర్శనలు
- బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం
- బీసీ జేఏసీ ప్రతినిధులు
- బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించం : జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం తరహాలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి బీసీలకు రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో సాధించే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తేలేదని వారు స్పష్టం చేశారు. బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని, కో చైర్మన్ దాసు సురేష్, కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణలతో కలిసి ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18న బీసీల రాష్ట్ర బంద్ విజయవంతం కావడంతో రిజర్వేషన్ వ్యతిరేకుల గుండెల్లో గుబులు రేగిందని, తెలంగాణలో బీసీల బలం, బలగాన్ని దేశమంతా చూసిందన్నారు. బీసీల రిజర్వేషన్ల ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉధృతం చేసే కార్యాచరణ రూపకల్పనకు నవంబరు2న హైదరాబాద్ కళింగభవన్‌లో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబరు రెండో వారంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన దీక్షలు, మూడో వారంలో పల్లె నుంచి పట్నం వరకు పెద్ద ఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలు చేపడతామన్నారు. బిహార్ ఎన్నికలు ముగిసిన వెంటనే ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులను కలిసి బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని కోరుతామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించే ప్రసక్తేలేదన్నారు. దాసు సురేష్ మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ స్వతంత్ర ఉద్యమాన్ని చేపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రైలు రోకో, రహదారుల దిగ్బంధంలాంటి కార్యక్రమాలు చేపట్టి 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నారగోని మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతంగా తమతో కలిసి వచ్చే అందరిని కలుపుకొని రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. మండల్ కమిషన్, మురళీధర్ రావు కమిషన్ ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమ తరహాలోనే బీసీ ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు. సమావేశంలో బీసీ జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి జాజుల లింగం గౌడ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు జిల్లాల విద్యార్థులకు స్థానికత చిక్కు!

ఒకటి నుంచి టెన్త్ దాకా రాష్ట్రంలోనే.. ఇంటర్మీడియట్ మాత్రం పొరుగు రాష్ట్రంలో

- ఆ కారణంగా వైద్య విద్యలో సీటు మిస్
- నీట్‌లో మంచి ర్యాంకు వచ్చినా నో యూజ్
- ఇలాంటి దురదృష్టవంతులు 30 మంది
- ఆదుకోవాలని సర్కారుకు వినతి

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఐజకు చెందిన ఆర్. కవిత.. ఒకటి నుంచి పదో తరగతి వరకు స్థానికంగానే చదువుకున్నారు. పొరుగునే ఉన్న ఏపీలోని కర్నూలులో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. ఈ ఏడాది నీట్‌లో తనకు 360 మార్కులొచ్చాయి. ఎస్సీ కేటగిరిలో తనకు కన్వీనర్ కోటాలో కచ్చితంగా సీటు వస్తుందని అనుకున్నారామె. అయితే ఇంటర్‌ను వేరే రాష్ట్రంలో చదవడంతో ఆమె స్థానికురాలు కాకుండా పోయింది. కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన రావూరి హర్షిత కూడా టెన్త్ వరకు సొంత ఊర్లోనే చదివారు. నీట్‌లో మంచి ర్యాంకు సాధించడం కోసం ఇంటర్మీడియట్ కోసం ఏపీలోని విజయవాడలో ఓ ప్రైవేటు కళాశాలలో చేరారు. నిరుడు ఆమె ఇంటర్ పూర్తి చేశారు. ఈ ఏడాది నీట్‌లో మంచి ర్యాంకు సాధించారు. ఆమెకూ కన్వీనర్‌కోటాలో సీటు వచ్చి ఉండేది. స్థానికంగా ఇంటర్మీడియట్ చేయలేదన్న ఒక్క కారణంతో ఆమెకు ఎంబీబీఎస్‌లో సీటు దక్కలేదు.

ఆర్. కవిత, రావూరి హర్షిత మాదిరిగానే వైద్యవిద్యలో సీట్ల విషయంలో తెలంగాణ రాష్ట్రంలోని ఏపీ సరిహద్దు జిల్లాలైన ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్‌కు చెందిన ఎందరో విద్యార్థులకు 'స్థానికత' కష్టాలు తీవ్ర ఇబ్బందుల్లో పడేశాయి. రాష్ట్రంలోనే పుట్టి, రాష్ట్రంలోనే పెరిగి, రాష్ట్రంలోనే పదో క్లాసుదాకా చదువుకున్నా ఇంటర్ విద్యను మాత్రం బయట రాష్ట్రంలో చేశారన్న ఒకేఒక్క కారణంతో వారంతా స్థానికులు కాకుండాపోతున్నారు. సమీపంలో మెరుగైన విద్యా సౌకర్యాలు లేకపోవడంతో పొరుగు రాష్ట్రంలోని జిల్లాలకు వెళ్లి చదువుకోవడమే తమకు శాపంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా 'జీవో 33'తో వచ్చిపడిన చిక్కు! వాస్తవానికి రాష్ట్ర విభజన సమయంలో పదేళ్ల పాటు ఉన్నత విద్యా సంస్థల్లో ఉమ్మడి ప్రవేశాలకు అవకాశం కల్పించారు. దాంతో ఏపీ విద్యార్థులు తెలంగాణలో, తెలంగాణ విద్యార్థులు ఏపీలో ప్రవేశాలు పొందడానికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు. గత బీఆర్ఎస్ సర్కారు జీవో నంబరు 114 తెచ్చింది. దీని ప్రకారం ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు వరుసగా ఏడేళ్లలో నాలుగేళ్లపాటు తెలంగాణలో చదివి ఉంటే స్థానికులే అవుతారు అయితే మెరుగైన విద్య కోసం హైదరాబాద్ కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల్లో వరుసగా నాలుగేళ్ల పాటు చదివిన పొరుగు రాష్ట్రాల విద్యార్థులకు కూడా స్థానికత వర్తిస్తోందని, ఈ కారణంగా స్థానిక విద్యార్థులకు నష్టం జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో కాంగ్రెస్ సర్కారు 2017లోని రూల్ 3 (ఏ)ను సవరిస్తూ 2024 జూలై 19న జీవో 33ని తీసుకొచ్చింది. దీనిప్రకారం ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివిన విద్యార్థులకే వైద్య విద్యా కోర్సుల్లో స్థానికత కోటా 85శాతం వర్తిస్తుంది. ఈ క్రమంలో టెన్త్ దాకా రాష్ట్రంలోనే చదివి.. మెరుగైన విద్య కోసం ఏపీలో చదివిన సరిహద్దు జిల్లాల విద్యార్థులకు ఈ 33 జీవో స్థానికతను గల్లంతు చేసింది. పాత జీవో 114 ప్రకారం తమకు ఇబ్బంది ఉండదనుకునే ఇంటర్ విద్యను పొరుగు రాష్ట్రాల్లో చదివించామని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంటర్మీడియట్ అయ్యేలోగా కొత్త జీవో 33 రావడంతో శాశ్వతంగా స్థానికత వర్తించకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడో విడత కౌన్సెలింగ్‌లోనైనా..

రెండు రోజుల క్రితం సరిహద్దు జిల్లాలకు చెందిన పలువురు నీట్ అభ్యర్థులు సచివాలయంలోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కార్యాలయానికి వచ్చారు. అక్కడ తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆరోగ్యశాఖ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చినట్లుగా నీట్ అభ్యర్థులు తెలిపారు. కన్వీనర్ కోటా మూడో విడత కౌన్సెలింగ్ ఇంకా జరగాల్సి ఉందని, ఇప్పటికైనా తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటే చివరి అవకాశమైనా దక్కుతుందని వారు చెబుతున్నారు. నీట్ రాసి, మంచి స్కోరు సాధించి, స్థానికులు కారన్న ఒక్క కారణంతో వైద్యవిద్య ప్రవేశాలకు దూరం కావాల్సివచ్చిందని సరిహద్దు ప్రాంతాలకు చెందిన 30 మంది విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్, బీఆర్ఎస్‌ను అంశాల వారీగానే విమర్శిస్తా

- వారు కాదనుకున్నాకే రాజీనామా చేశా
- మోసపూరిత వ్యక్తులదే పైచేయి అయ్యింది
- 'జూబ్లీహిల్స్'పై నిర్ణయం తీసుకోలేదు
- బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ బిల్లు అదే వస్తుంది: ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొంతమంది కారణంగానే కేసీఆర్‌కు చెడ్డ పేరు వస్తోందని.. బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను అంశాల వారీగా మాత్రమే విమర్శిస్తానని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు ఎందుకు బయటకు వచ్చారో తనకు తెలియదని.. ఆ సమయంలో తాను జైల్లో ఉన్నానన్నారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఎవరైనా ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉంటే వారితో మాట్లాడేదాన్నని.. వారిని పార్టీలోనే ఉంచే ప్రయత్నం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తన విషయంలో పార్టీ ఏకపక్ష నిర్ణయం తీసుకుందని.. అసలు తాను బయటకు రావాలని అనుకోలేదన్నారు. నిజామాబాద్‌లో జనంబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆదివారం ఓ హోటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. అనివార్య పరిస్థితుల్లోనే పార్టీ బయటకు వచ్చానని.. వారు కాదనుకున్న తర్వాతే రాజీనామా చేశానని తెలిపారు. పార్టీలో ఉండగా మాట్లాడాల్సిన అన్ని చోట్ల మాట్లాడానని.. కానీ పార్టీకి నష్టం చేసే, బాధ్యత మరిచిన మోసపూరిత వ్యక్తులదే పైచేయి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్ల కారణంగానే బీఆర్ఎస్, కేసీఆర్‌కు నష్టం జరగనుందన్నారు. ఐదేళ్ల క్రితమే ఎవరి పనితీరు ఏంటని తెలుసుకొని ఉంటే మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయేది కాదని చెప్పారు. తాను బీఆర్ఎస్‌లో తిరుగుబాటు చేయలేదని..అంత అవకాశమివ్వకుండానే బయటకు పంపారని చెప్పారు.



నా బాధ చెబుతా.. వారి బాధ వింటా!

'నా బాధ ప్రజలకు చెబుతా.. వాళ్ల బాధ వింటా.. పరిష్కార మార్గానికి ప్రయత్నం చేస్తా..' అని కవిత అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఏ పార్టీకి ఓటేయాలన్నది స్థానిక జాగృతి కార్యకర్తలే నిర్ణయం తీసుకుంటారన్నారు. పార్టీ పెట్టుడు పెద్ద పని కాదని, కానీ పార్టీ కన్నా కూడా ప్రజల సమస్యలు తీరడం ముఖ్యమని చెప్పారు. కేసీఆరే తనతో పార్టీ పెట్టిస్తున్నారని వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ వాళ్లు తనకు మద్దతు తెలుపుతున్నారన్న దాంట్లో వాస్తవం లేదని.. వాళ్లకే ప్రజల్లో ఏ ఆదరణ లేదని ఎద్దేవా చేశారు. అనుకోకుండా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. దాన్ని కూడా కాపాడుకోలేకపోతోందని విమర్శించారు. స్థానిక ఎన్నికలు వచ్చినప్పుడు ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ బిల్లు నడుచుకుంటూ వస్తుందన్నారు. తాను జనంబాటకు వస్తున్నానని తెలిసి ఓ బీజేపీ ఎంపీ తన గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని.. ఆయన అవినీతిని త్వరలోనే బయటపెడతానన్నారు.

గ్రామాల్లో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

» ప్రాథమిక దశలోనే గుర్తించాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తోన్న ఆరోగ్య శిబిరాల్లో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో ఆదివారం జరిగిన రొమ్ము క్యాన్సర్ అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. సినీనటి డాక్టర్. శ్రీ లీల, యశోద ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. జి.ఎస్. రావుతో కలిసి పింక్ పవర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రొమ్ము క్యాన్సర్ సమాజాన్ని పట్టిపీడిస్తోందని, తొలి దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ మహమ్మారిని సులభంగా నివారించగలమని చెప్పారు. క్యాన్సర్ రాగానే జీవితం ముగిసిందనే అపోహ అవసరం లేదని, ప్రస్తుతం అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ లీల మాట్లాడుతూ.. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తేలికగా జయించవచ్చన్నారు. మహిళలు సంకోచం లేకుండా తమ సమస్యలను బయటకు చెప్పుకోవాలని సూచించారు. పింక్‌పవర్ పుస్తకం రొమ్ము క్యాన్సర్‌ను ఓడించడంలో అవగాహన కల్పిస్తుందని డా. జి.ఎస్. రావు అన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో బీఆర్ఎస్ భూస్థాపితం

ఎవరి గూబ గుయ్‌మనేది 11న హరీశ్‌కు తెలుస్తుంది: చామల

బీఆర్ఎస్‌ను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదు: అద్దంకి

హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎవరి చెంప చెళ్లు మంటది.. ఎవరి గూబ గుయ్‌మంటదో.. నవంబర్ 11న హరీశ్‌రావుకు తెలుస్తుందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై.. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా తెచ్చుకుని, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో చిత్తయిన బీఆర్ఎస్.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలతో భూస్థాపితం కానుందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ జెండా కట్టేవారే ఉండబోరన్న భయంతో కేటీఆర్, హరీశ్.. నోటికొచ్చింది మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో కేసీఆర్ లక్ష ఇళ్లు ఎక్కడ కట్టారో హరీశ్ చూపించాలన్నారు. చెరువులు ఆక్రమించి కట్టిన ఇళ్లు, నాలాలపై ఆక్రమణలను మాత్రమే హైడ్రా తొలగించిందని చెప్పారు. అభివృద్ధిపై కాకుండా సెంటిమెంట్ మీద ఓట్లు తెచ్చుకునే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తోందని విమర్శించారు. సర్కారుపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని, బీఆర్ఎస్ హయాంలో అవినీతిని వారు ఇంకా మరిచిపోలేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు కట్టారో హరీశ్ చెప్పాలన్నారు. పార్టీ నుంచి కవితను ఎందుకు బయటకు పంపారో కేసీఆర్ ఒక ప్రకటన ఇవ్వగలరా అని నిలదీశారు. మంత్రి శ్రీధర్‌బాబును బద్నాం చేసేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. రాజకీయ దురుద్దేశంతోనే ఆయనపై పుట్టా మధు అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీ పేరిట బయటి వ్యక్తులు నకిలీ లెటర్ హెడ్‌లను సృష్టించి.. ఐటీ ప్రాజెక్టులు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి రూ.1.77కోట్ల మేర వసూళ్లు చేశారని, ఇందులో మంత్రి పేషీకి, వ్యక్తిగత సిబ్బందికి ఏ సంబంధం లేదని స్పష్టం చేశారు.

వచ్చే నెల 1 లోపు రూ.900 కోట్లు ఇవ్వాల్సిందే

» లేకుంటే 3 నుంచి కళాశాలలు బంద్

» ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం నెల రోజులుగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘాల సమాఖ్య సమ్మె తేదీలను ప్రకటించింది. నవంబర్ 3 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటిస్తాయని సమాఖ్య ప్రతినిధులు వెల్లడించారు. ఆదివారం నగరంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్ల బకాయిలు చెల్లించాలని నెల రోజులుగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ స్పందన లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హామీ ఇచ్చినా దీపావళి ముందు రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమ్మెకు సంబంధించి ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు అందించామన్నారు. సర్కారు తీరుతో కళాశాలలు నడిపించలేని స్థితిలో ఉన్నాయని, మరో మార్గం లేకనే సమ్మె చేస్తున్నామని అన్నారు. వచ్చే నెల 1 లోపు ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ. 900 కోట్లు విడుదల చేయకుంటే 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, వృత్తివిద్య కళాశాలలన్నీ సమ్మెలో పాల్గొంటాయని సమాఖ్య అధ్యక్షుడు నిమ్మగడ్డ రమేష్ బాబు తెలిపారు. నవంబర్ మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులతో సచివాలయానికి లాంగ్ మార్చ్ నిర్వహిస్తామని, మూడు లక్షల బోధన సిబ్బందితో ఓఆర్ఆర్ సమీపంలో బహిరంగ సభ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

బీసీల ఆత్మగౌరవ భవనాలకు రేవంత్ ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు

» వడ్డెరల అభివృద్ధి బీఆర్ఎస్ బాధ్యత: హరీశ్‌రావు



హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం విలువైన భూములు కేటాయించినప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఆ నిర్మాణాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలుపెట్టిన ఈ పనులకు వెంటనే నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, వడ్డెరలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అందుకే వారు అడగకపోయినా హైదరాబాద్‌లో ఆ సంఘం భవన నిర్మాణానికి ఎకరం భూమి కేటాయించడంతో పాటు నిధులు కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలన 'ఇంట్లో ఈగలమోత.. బయట పల్లకిల మోత' అన్నట్లుగా మారిందని, పంపకాల్లో తేడావచ్చి మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకుంటున్నారని విమర్శించారు. వాటాలు పంచుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ విజయయాత్ర జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం కావాలని, కారుకు ఓటేసి మాగంటి సునీతను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

రామ్మోహన్‌నాయుడు కుమారుడి బారసాలలో సీఎం రేవంత్ రెడ్డి

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఇంట సందడి నెలకొంది. ఆదివారం ఢిల్లీలోని రామ్మోహన్ అధికారిక నివాసంలో ఆయన కుమారుడి బారసాల వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, మనోహర్ ఖట్టర్, ప్రహ్లాద్ జోషి, శ్రీనివాస వర్మ, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

- ఆంధ్రజ్యోతి, న్యూఢిల్లీ



హైదరాబాద్-విజయవాడ స్మార్ట్ రోడ్డు

(మొదటి పేజీ తరువాయి)

లభించింది. దాని ప్రకారం.. హైదరాబాద్-విజయవాడ రోడ్డు విస్తరణ కోసం దాదాపు రూ.10,391.53 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. వీటిలో నిర్మాణ వ్యయం రూ.6,775.47 కోట్లు, వివిధ అవసరాలకు మరో రూ.3,616.06 కోట్లు కావాల్సి ఉందని తేల్చారు.



భద్రతే ప్రామాణికంగా..

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు వరుసలతో ఉంది. ట్రాఫిక్ పెరగడం, విజయవాడ వెళ్లేందుకు ఈ రోడ్డే కీలకం కావడంతో దీని విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విస్తరణతోపాటు రోడ్డును భద్రతా పరంగానూ పటిష్ఠం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న పలు జాతీయ రహదారులను డిజిటల్, స్మార్ట్ హైవేలుగా మార్చేలా చర్యలు చేపట్టిన కేంద్రం.. తెలంగాణ పరిధిలోనూ పలు కీలక రహదారులను డిజిటల్, స్మార్ట్ రోడ్లుగా మార్చనుంది. ఇందులో భాగంగానే హైదరాబాద్-విజయవాడ హైవేను కూడా పూర్తిస్థాయిలో స్మార్ట్ రోడ్డుగా మార్చాలని నిర్ణయించింది. రహదారిపై అత్యంత అధునాతనమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానిస్తారు. ఏఐతో అనుసంధానమై ఉన్న కెమెరా వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేస్తారు. ఫలితంగా రహదారిపై నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపిన వివరాలు తెలియడంతోపాటు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయనేది కూడా తెలిసిపోతుంది. దాంతో రోడ్డుపై వెళ్తున్న ప్రతీ వాహనం వివరాలు తెలియడంతోపాటు ప్రమాదాల నియంత్రణకు ఇది ఉపయోగపడనుంది. ఈ విధానంలో రహదారిపై 360 డిగ్రీల కోణంలో పనిచేసే అత్యాధునిక సీసీ కెమెరాలను ప్రతి కిలోమీటర్‌కు (రెండు వైపులా) ఒకటి చొప్పున 231 కెమెరాలను అమర్చుతారు. ఇవి అత్యంత శక్తిమంతంగా ఉండడంతోపాటు 24 గంటలూ రోడ్లపై నిఘా ఉంచుతాయి. వీటి పర్యవేక్షణకు ప్రత్యేక మానిటరింగ్ కేంద్రాలను హైవే పైనే ఒకటి, రెండు చోట్ల ఏర్పాటుచేస్తారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వివరాలు..

రహదారిపై ఎక్కడైనా ప్రమాదం జరిగితే.. వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు లొకేషన్‌తోపాటు కిలోమీటర్ నంబర్‌తో కూడిన అన్ని వివరాలను సీసీ కెమెరాలు వీడియోతో సహా పంపుతాయి. స్పీడ్ డిటెక్షన్, రాంగ్ రూట్, ప్రమాదాల వీడియోను చిత్రీకరించడంతోపాటు పలు రకాల సేవలను వీటి ద్వారా అందించనున్నారు. ఫలితంగా రహదారి అత్యంత భద్రతగా ఉండడంతోపాటు ప్రమాదాలు తగ్గేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు రహదారికి ఇరువైపులా అతివేగంతో వెళ్లే వాహనాలు అదుపుతప్పినా రోడ్డుపైనుంచి కిందికి పడిపోకుండా ఉండేలా బారికేడ్లు (ఆర్‌సీసీ క్రాస్ బ్యారియర్స్, మెటల్ బీమ్స్, క్రాష్ బ్యారియర్స్) ఏర్పాటు చేయనున్నారు. దారిలో సోలార్ వీధిదీపాలను కూడా అమర్చనున్నారు. అలాగే వర్షపునీటిని ఒడిసి పట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఒక్కసారి రోడ్డు పనులు పూర్తయ్యాక మళ్లీ ఏ ఇతర అవసరాల కోసం రోడ్డును తవ్వకుండా ఉండేలా మంచినీటి సరఫరా, బోరు లైన్లు, హ్యాండ్ పంప్స్, గ్యాస్ పైపులైన్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లను అవసరమైన చోట ఏర్పాటు చేస్తున్నారు. ఇక ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన 38 చోట్ల ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తుండగా, మరో 17 బ్లాక్‌స్పాట్‌ల వద్ద కూడా రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు సహా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం మొదటి దశలో భాగంగా హైదరాబాద్-నాగపూర్ మార్గం (ఎన్.హెచ్-44)లో స్మార్ట్ హైవే విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

వాణిజ్య కార్యకలాపాలకు ఊతంగా..

వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు ఊతమిచ్చేలా హైదరాబాద్- విజయవాడ రహదారిని తీర్చిదిద్దనున్నారు. ఇతర జాతీయ, రాష్ట్ర రహదారులతోపాటు, పలు ఇండస్ట్రియల్ కారిడార్లు, పలు వ్యాపార కేంద్రాలకు దీనిని అనుసంధానం చేయనున్నారు. దీని ప్రకారం తెలంగాణ నుంచి ఏపీ వరకు కలిపి మార్గం మధ్యలో నుంచి ఇతర రహదారులు, ప్రాంతాల్లో ఉన్న దాదాపు 50 ఇండస్ట్రియల్ పార్కులకు ఈ రహదారి అనుసంధానం కానుంది. అలాగే 20 ఎకనామిక్ నోడ్స్, 4 నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఐసీడీసీ)లకు, రెండు చోట్ల ఉన్న టెక్స్‌టైల్ క్లస్టర్‌లకు, రెండు మేజర్ రైల్వేస్టేషన్లు, రెండు విమానాశ్రయాలకు రహదారి అనుసంధానంగా ఉండనుంది. తద్వారా వ్యాపార లావాదేవీలు, రవాణా రంగం మరింత బలోపేతమవుతుందని అంచనా వేస్తున్నారు. రహదారి అందుబాటులోకి వచ్చిన తరువాత నుంచి ప్రతిరోజూ లక్షల మందికి వివిధ రంగాలు, పలు రూపాల్లో లబ్ధి చేకూరుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లేందుకు ప్రయాణ సమయం కూడా తగ్గనుంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై రోజుకు 43,742 వాహనాలు తిరుగుతుండగా.. ఇవి 2035నాటికి 71,251కు చేరుతాయని, అలాగే 2048 నాటికి దాదాపు 1,71,251కి పెరుగుతాయనే అంచనాలు ఉన్నాయి. రహదారి విస్తరణ పనులను వచ్చే ఏడాది ఏప్రిల్, మేలో ప్రారంభించే అవకాశాలున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

జూబ్లీహిల్స్‌లో ప్రచారానికి సీఎం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావునూ సన్మానించనున్నారు. ఆ సభలో.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నట్లు సమాచారం. అలాగే ఈ నెల 30, 31 తేదీల్లోను మళ్లీ నవంబర్ 4, 5 తేదీల్లోనూ ఆయన రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీటికి మధ్యలో బిహార్ ఎన్నికల ప్రచారానికీ ఆయన వెళ్లనున్నట్లు చెబుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 22 నెలల పాలనకు ఈ ఉప ఎన్నిక కొలమానంగా మారడం, ఇక్కడ గెలిస్తే దాని ప్రభావం జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా పడే అవకాశమున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపుల్లో మార్పులు: పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి పథకం కింద ఇల్లు మంజూరై నిర్మించుకునే లబ్ధిదారులకు నాలుగు దశల్లో చెల్లించే బిల్లుల్లో స్వల్ప మార్పులు చేసినట్టు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేవలం బిల్లుల్లో అందించే నిధుల్లోనే మార్పులు జరిగాయని, రూ.5 లక్షల ఆర్థిక సాయంలో మార్పులు లేవని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద బేస్‌మెంట్ పూర్తయితే రూ.లక్ష, రూఫ్ లెవల్‌కు వచ్చాక రూ.లక్ష, స్లాబ్ పూర్తయిన తరువాత రూ.2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మిగిలిన రూ.లక్షను అందిస్తున్నారు. అయితే వీటిలో స్లాబ్ పూర్తయిన తరువాత అందించే రూ.2లక్షల్లో మార్పులు జరిగాయని, ఇక నుంచి స్లాబ్ పూర్తయ్యాక రూ.1.40లక్షలను అందించనున్నట్టు తెలిపారు. మిగిలిన రూ.60వేలను ఇంటి నిర్మాణం పూర్తయ్యాక ఇచ్చే రూ.లక్ష మొత్తంలో కలిపి రూ.1.60 లక్షలను జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఉపాధి హామీ కింద 90 రోజుల పనిదినాలను కల్పిస్తుండడం, వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి కేంద్రం అనుమతి ఇవ్వడంతో ఈ మార్పులు చేయాల్సి వచ్చిందని తెలిపారు.

రాష్ట్రంలో రౌడీషీటర్ల పాలన నడుస్తోంది!

» రాష్ట్రాన్ని దోచుకుంటున్న రేవంత్‌రెడ్డి కుటుంబం, మంత్రులు: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రౌడీషీటర్ల పాలన నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం, మంత్రులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హోటల్స్ యూనియన్ కార్మిక నాయకులు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బ్రతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చిన కార్మికులను బీఆర్ఎస్ ఎటువంటి ఇబ్బంది కలిగించలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి ఓఎస్డీ తుపాకీతో బెదిరించారని మంత్రి ఇంటికి పోలీసులు వెళ్లారని.. ఆ సమయంలో మంత్రి కూతురు బయటకు వచ్చి తుపాకీ ఇచ్చిందే రేవంత్‌రెడ్డి అని చెప్పారని అన్నారు. మంత్రి భర్తే తుపాకీ ఇచ్చారని పోలీసులు అంటున్నారని చెప్పారు. అలీబాబా దొంగల ముఠా లాగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తయారయిందని కేటీఆర్ విమర్శించారు. లిక్కర్ బాటిళ్ల స్టిక్కర్ కాంట్రాక్టు కోసం సీఎం అల్లుడు, మంత్రి కొడుకు పోటీపడ్డారని.. ఈ వ్యవహారంలో ఎవరికీ చెప్పలేక ఓ ఐఏఎస్ అధికారి రాజీనామా చేశారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నేరచరిత్ర ఉన్న వాళ్లను, బెదిరింపులకు పాల్పడే వాళ్లను గెలిపిస్తారా..? అని ప్రశ్నించారు. కాగా, జహీరాబాద్ మైనార్టీ గురుకులంలో చదివి వైద్య కళాశాలల్లో సీట్లు సాధించిన ఎంబీబీఎస్ విద్యార్థులను కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు సత్కరించారు. జహీరాబాద్ గురుకులం నుంచి మాత్రమే 16 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. కాగా, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న అన్ని జిల్లాల కలెక్టరేట్లను ముట్టడించనున్నట్లు బీఆర్ఎస్‌విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలకూ డీసీసీ పదవులు!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో మీడియాతో మహేశ్‌గౌడ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఐదుగురు ఎమ్మెల్యేలు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ బలోపేతం కోసం అవసరమనుకున్న చోట ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తాం. వేరే పదవుల్లో ఉన్నవారైతే.. రాజీనామా చేయించి డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తాం. ఎమ్మెల్యేలకు డీసీసీ పదవులను డబుల్ పోస్టులుగా చూడటం లేదు. అలాగే, ఒకే కుటుంబంలో రెండు పదవులు తీసుకోవడంలో తప్పేమీ లేదు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ కోసమే కష్టపడేవాళ్లు ఒకే కుటుంబంలో ఉండొచ్చు. అలాంటప్పుడు వాళ్లకు పదవులు వద్దని ఎలా అంటాం? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి వంటి వాళ్ల ఇళ్లల్లో రెండు పదవులు వాళ్ల పనికి గుర్తింపుగా వచ్చినవే. ఉత్తమ్ పద్మావతి కూడా డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసినట్టు తెలిసింది. ఈసారి భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. కొన్ని జిల్లాల్లో ఏఐసీసీ పరిశీలకులు ఇచ్చిన పేర్లే కాకుండా.. సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కతో పాటు నేను ఇచ్చిన పేర్లు వేరుగా ఉన్నాయి. అన్నింటినీ అధిష్ఠానం పరిశీలిస్తోంది. అవసరమనుకుంటే మళ్లీ నన్ను ఢిల్లీకి పిలవొచ్చు. లేదంటే.. వారం, పది రోజుల్లో డీసీసీ అధ్యక్షుల పేర్లను అధిష్ఠానమే ప్రకటిస్తుంది" అని మహేశ్ గౌడ్ తెలిపారు.

సమన్వయ లోపంతోనే వివాదాలు..

మంత్రుల మధ్య సమన్వయ లోపంతోనే వివాదాలు వస్తున్నాయని మహేశ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. "మంత్రి కొండా సురేఖ దగ్గర పనిచేసిన సుమంత్ ఒక ఇంట్లోకి వెళ్లాడు. ఆయనను వెంబడిస్తూ పోలీసులు వెళ్లారు. అది మంత్రి అధికారిక నివాసం కాదు. ఇంతలోనే సురేఖ కుమార్తె కిందికి వచ్చి పానిక్ అయి అలా మాట్లాడారు. ఎవరు, ఎవరినైనా కులం పేరుతో విమర్శిస్తే ఊరుకోం. ఆమెను మందలించాం. అసలు.. ఆమె కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు కాదు. పొన్నం ప్రభాకర్ విషయంలోనూ ఇటువంటిదే జరిగింది. ఇక జీవన్‌రెడ్డి శిష్యుడే అడ్లూరి లక్ష్మణ్. ఇవన్నీ.. సమన్వయలోపంతో వచ్చినవే. అన్నీ సద్దుమణిగాయి. కాంగ్రెస్ పార్టీలో ఓపికగా ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది. కాంగ్రెస్‌లో కార్యకర్త నుంచి మంత్రి వరకు ఎవరైనా పార్టీ నియమాలకు లోబడే ఉండాలి. నాతో సహా అందరం హైకమాండ్ రాడార్‌లో ఉన్నాం" అని పీసీసీ చీఫ్ అన్నారు. మంత్రుల మధ్య వివాదం హరీశ్‌రావు, కేటీఆర్‌లకు కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టే అయ్యిందన్నారు. ముందుగా వారి కుటుంబంలోని పంచాయితీని సరిదిద్దుకోవాలని హితవు పలికారు. క్యాబినెట్ భేటీలో మంత్రుల పని తీరు, సమన్వయలోపం వంటి అంశాలన్నింటిపైనా సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారని తెలిపారు.

కవిత పాదయాత్రను స్వాగతిస్తున్నాం

ఎమ్మెల్సీ కవిత పాదయాత్రను స్వాగతిస్తున్నట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు. గత పదేళ్ల పాలనలోని అవినీతి గురించి కవిత చెప్పినవన్నీ నిజాలేనన్నారు. అయితే, కవిత సగం మాత్రమే నిజాలు చెప్పారని, మరో సగం చెప్పాల్సి ఉందని అన్నారు. అలాగే, గత పదేళ్ల పాపపు పాలనలో కవితకూ భాగస్వామ్యం ఉన్నందున ఆమెను ప్రశ్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలన్నారు. "రాముడి పేరుతో రాజకీయం చేయడం తప్ప.. కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ అభివృద్ధికి ఏం చేశారు? జూబ్లీహిల్స్‌లోనూ బీజేపీ మతం పేరుతో రాజకీయం చేయాలని చూస్తోంది. పీజేఆర్ నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయం ఉండగా.. మళ్లీ ఇప్పుడు బండి సంజయ్ పెద్దమ్మ ఆలయం నిర్మిస్తాననడమేంటి? గుళ్లు, గోపురాలను బీజేపీ వాడుకుంటోంది. వేల ఏండ్ల కిందటే శ్రీరాముడు ఏలాడు. కానీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 40 ఏండ్లకు బీజేపీ పుట్టింది. అలాంటప్పుడు బీజేపీకి శ్రీరాముడితో ఏం సంబంధం? ఎవరెన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్ లో భారీ మెజార్టీతో గెలిచి తీరుతాం. మాగంటి కుటుంబ విషయాలు మీడియాలో చూసిన తర్వాతే మాకు తెలిసింది. అంతే తప్ప.. కేటీఆర్‌లా వేరేవాళ్ల కుటుంబాల్లోకి తొంగిచూసే అలవాటు మాకు లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీనే జూబ్లీహిల్స్‌లో ఓటు చోరీ చేసింది. ఓటు చోరీ గురించి తొలిసారి ఫిర్యాదు చేసిందే రేవంత్‌రెడ్డి" అని మహేశ్‌గౌడ్ అన్నారు.

ఉద్యమ నేతగా కేసీఆర్ అంటే గౌరవమే...

తెలంగాణ ఉద్యమ నేతగా కేసీఆర్ అంటే తనకెప్పుడూ గౌరవమేనని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆయనతోపాటు ఉద్యమంలో పాల్గొన్నామని, ప్రత్యేక తెలంగాణ సాధనకు పోరాడామని చెప్పారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ పాలనపైనే తమ అభ్యంతరమని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్ వద్ద తాకట్టు పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ ఉదాసీనత వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చిందన్నారు. కాగా, ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో మహేశ్ గౌడ్ భేటీ అయ్యారు. 15 జిల్లాల్లో డీసీసీ అధ్యక్ష పదవులకు తీవ్ర పోటీ ఉన్నందున ఇరువురూ సమాలోచనలు చేసినట్టు సమాచారం.

నిర్లక్ష్యంగా ఉంటే ఇంటికే!

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. రోగులు ఇబ్బందిపడే పరిస్థితి తెస్తే ఎంతటి వారి విషయంలోనైనా కఠినంగా ఉంటామని తేల్చి చెప్పింది. ఆస్పత్రుల సూపరింటెండెంట్లపై చాలా సీరియస్‌గా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వారి పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. బోధనాస్పత్రుల్లో పాలన వ్యవహారాలపై హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, వైద్యవిద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్రకుమార్‌తో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. పని తీరును మెరుగుపరుచుకోవాలని సూచించినా ఏమాత్రం మారని వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏడుగురు సూపరింటెండెంట్లపై చర్యలు తీసుకోవడం పరిస్థితికి నిదర్శనం. ఈ నెల 25న వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌పై సర్కారు వేటు వేసింది. ఆయన్ను ఆ పోస్టు నుంచి తప్పించింది. ఇటీవలికాలంలో ఎంజీఎంలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు, వాటిని పరిష్కరించడంలో సూపరింటెండెంట్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని సర్కారు భావించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఇక నుంచి ప్రతీ వారం ఎంజీఎంపై సమీక్ష చేసి తనకు నివేదిక ఇవ్వాలని డీఎంఈను ఆదేశించారు. కొద్ది రోజుల క్రితమే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిని ఆ పోస్టు నుంచి మంత్రి తప్పించారు. ఆస్పత్రి పాలనా వ్యవహారాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించడం, రోగులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోకపోవడం, వైద్యులు విధులకు రాకున్నా నిమ్మకు నీరెత్తినట్టుగా ఆమె వ్యవహరించడంతో వేటు వేశారు. ఆమె స్థానంలో ఇంచార్జి డీఎంఈగా పనిచేసిన డాక్టర్ ఎస్.వాణికి బాధ్యతలు అప్పగించారు. రెండు రోజుల క్రితం రామగుండం బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్‌నూ విధుల నుంచి ప్రభుత్వం తప్పించింది. రామగుండం వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా ఆమె భర్త ఉన్నారు. వారానికి ఒకటి రెండుసార్లే విధులకు హాజరుకావడం, ఏకకాలంలో ప్రిన్సిపల్, సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆమెపై అక్కడి వైద్యులు సర్కారుకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఆమెను విధులను నుంచి తప్పించారు. కొద్ది రోజుల క్రితం నిజామాబాద్ బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌ను సర్కారు తప్పించింది. ఆస్పత్రిలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం, కొవిడ్ సమయంలో రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు అమ్ముకున్నారని, దీర్ఘకాలంగా ఆ ఆస్పత్రి బాధ్యురాలుగా ఉండటంతో ఆస్పత్రిపై గుత్తాధిపత్యం చెలాయించారన్న ఆరోపణలున్నాయి. దాంతో ఆమెను తప్పించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ పిల్లల ఆస్పత్రి నీలోఫర్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ రవికుమార్ ఒంటెద్దు పోకడలు అవలంబించారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో అవకతవకలు పాల్పడటంతో పాటు ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో రక్తాన్ని బయటకు అమ్ముకున్న ఉద్యోగులకు కొమ్ము కాశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు.



ఆస్పత్రి ప్రాంగణంలో ఓ ప్రైవేటు సంస్థ నిర్మిస్తున్న మందుల షాపు భవనం కోసం అక్రమంగా అనుమతులిచ్చారన్న అభియోగాలున్నాయి. దీనిపై పెద్దయెత్తున విమర్శలు రావడంతో సర్కారు ఆయన్ను సస్పెండ్ చేసింది. పేట్ల బురుజు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ రజనీరెడ్డిపై తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చాయి. వైద్య కళాశాల తనిఖీల విషయంలో డబ్బులు తీసుకుని నివేదికలిచ్చారని సీబీఐ నమోదు చేసిన వైద్యుల జాబితాలో ఆమె పేరుంది. దీంతో ఆమెపై వేటు వేశారు. జగిత్యాల బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వం ఆయన్ను పక్కనపెట్టింది.

ఇష్టారాజ్యంగా వ్యవహారం..

రాష్ట్రంలో 35 ప్రభుత్వ వైద్య కళాశాలలున్నాయి. వాటికి అనుబంధ ఆస్పత్రులున్నాయి. కళాశాలలకు ప్రిన్సిపల్స్, బోధనాస్పత్రులకు సూపరింటెండెంట్లుగా అదనపు వైద్యవిద్య సంచాలకుల హోదా (అడిషనల్ డీఎంఈ) ఉన్నవారినే నియమించారు. కొన్నిచోట్ల ఇంచార్జి సూపరింటెండెంట్లు ఉన్నారు. బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లు ఉన్నవారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు హైదరాబాద్‌లోనే ఉంటూ రోజూ వెళ్లివస్తున్నారు. మరి కొందరు చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారు. మరికొందరు తీవ్ర అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. ఔషధ కొనుగోళ్లు, డైట్, మ్యాన్ పవర్ ఏజెన్సీ కాంట్రాక్టర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోధనాస్పత్రుల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన కొందరు ఉద్యోగులు సూపరింటెండెంట్లకు అమ్యామ్యాలు ఇవ్వడం, వారి బెదిరించడంలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మెజార్టీ బోధనాస్పత్రుల్లో అధ్యాపకులు రాకున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా లేనివారిని తప్పిస్తోంది. సర్కారు చర్యలతో రాష్ట్రంలోని బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లు వణుకుతున్నారు.

నేడు మద్యం షాపులకు లక్కీడ్రా

» ఏర్పాట్లు పూర్తిచేసిన ఎక్సైజ్ శాఖ

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు అనుమతి లభించడంతో మద్యం షాపుల లక్కీ డ్రా కోసం ఎక్సైజ్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఆయా జిల్లాల కలెక్టర్లు దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీయనున్నారు. ఎలాంటి అసౌకర్యాలకు చోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం షాపులకు 95,137 మంది దరఖాస్తు చేసుకున్నారు.

పండుగల వేళ ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పండుగలు, ఇతర సందర్భాల్లో ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి పలు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. నవంబర్ 6 నుంచి 27 వరకు (ప్రతి గురువారం) సికింద్రాబాద్-అనకాపల్లి (07055) 4 రైళ్లు, నవంబర్ 7 నుంచి 28 వరకు (ప్రతి శుక్రవారం) అనకాపల్లి-సికింద్రాబాద్ (07056) 4 రైళ్లు, నవంబర్ 6 నుంచి 27 వరకు (ప్రతి గురువారం) కాచిగూడ-తిరుచానూరు (07787) 4 రైళ్లు, నవంబర్ 7 నుంచి 28 వరకు (ప్రతి శుక్రవారం) తిరుచానూరు-కాచిగూడ (07788) మధ్య 4 రైళ్లు అందుబాటులో ఉంటాయి. బరౌని-చెన్నై బీచ్ (06090) నవంబర్ 29న ఒకే ఒక్క రైలు నడుస్తుంది. అలాగే, నవంబర్ 3 నుంచి 28 వరకు (సోమ-శుక్ర) కాకినాడ టౌన్-మైసూర్ (07033) మధ్య 8 రైళ్లు, నవంబర్ 4 నుంచి 29 వరకు (మంగళ, శని) మైసూర్-కాకినాడటౌన్ (07034) మధ్య 8 రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా మరో ఆరు ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 19, 21 తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-గుంతకల్ (06091) మధ్య 2 రైళ్లు, నవంబర్ 20, 22 తేదీల్లో గుంతకల్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06092) మధ్య 2 రైళ్లు నడుస్తాయి. అలాగే, నవంబర్ 13న అనకాపల్లె-యెలహంక (07409) మధ్య ఒకరైలు, నవంబర్ 14న (07410) యెలహంక-అనకాపల్లె (07410) మరో ప్రత్యేక రైలును నడపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రాయి కాదు.. 5 కోట్ల ఏళ్ల అరుదైన శిలాజం!


స్థానికులతో కలిసి శిలాజాన్ని పరిశీలిస్తున్న పురాతత్వ శాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి

మధిర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని ఓ ఆలయం పరిసరాల్లోని మట్టిలో ఐదు కోట్ల ఏళ్ల నాటి అరుదైన దారుశిలాజాన్ని పురాతత్వ శాస్త్రవేత్త, బుద్ధవనం ప్రాజెక్ట్ అధికారి ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఆదివారం మధిరలోని రైల్వేస్టేషన్ శ్రీ కోదండ రామస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులను పరిశీలించేందుకు ఆయన వెళ్లారు. దేవాలయానికి సమీపంలోని యండపల్లిగుట్ట నుంచి తొలిచిన మట్టిలో వైవిధ్యంగా కనిపించిన ఓ రాయిని శివనాగిరెడ్డి చూశారు. ఆ రాయిని పరిశీలించి ఐదు కోట్ల ఏళ్ల నాటి దారుశిలాజమని, పరిశోధనలు చేసేందుకు దాన్ని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ రాయి ఆనవాళ్లు చూస్తుంటే ఆ ప్రదేశంలో 5 కోట్ల ఏళ్ల క్రితమే జీవమున్నట్లు కనిపిస్తోందన్నారు. దీనిపై విస్తృత పరిశోధనతో పాటు లోతైన అధ్యయనం చేసిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు.

తిరుమలేశుడి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



తిరుమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమలదేవి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయక మండపానికి చేరుకున్న జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.


శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులకు ధ్రువపత్రం అందజేస్తున్న వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తెలంగాణ డైరెక్టర్ రాంప్రకాశ్

ఒకే వేదికపైకి రెండు వేలమంది శ్రీనివాసులు

» వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

» ఘనంగా శ్రీనివాస మిత్రుల ద్వితీయ వార్షికోత్సవం

కరీంనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కలియుగ దైవం శ్రీనివాసుడి నామధేయంతో ఉన్న శ్రీనివాసులు ఏకమయ్యారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మంది ఈ పేరు గల వారందరూ ఒకే వేదికపై సందడి చేసి ఆకట్టుకున్నారు. వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో శ్రీనివాస మిత్రుల ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ తెలంగాణ డైరెక్టర్ మడుపు రాంప్రకాశ్ తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పూట్కూరి శ్రీనివాస్‌రెడ్డికి ధ్రువపత్రాన్ని అందజేశారు.

మోసగాళ్ల మాయలో పడకండి

» సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక

డిజిటల్ అరెస్టు అనేది అబద్ధమని, మోసపూరిత ప్రక్రియ అని, మోసగాళ్ల మాయలో పడకండి అంటూ ప్రజలను అప్రమత్తం చేయడానికి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపట్టాయి. ఈ క్రమంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులూ డిజిటల్ అరెస్టుల పేరిట జరుగుతున్న మోసాలు, ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ ఒక ప్రకటన జారీ చేశారు.

బ్యాంకాక్ టు హైదరాబాద్

హైడ్రోపోనిక్ గంజాయి

(మొదటిపేజీ తరువాయి)

విలువైన 53.35 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రయాణికులంతా థాయ్‌లాండ్ నుంచి వచ్చిన వారు, మహిళలే కావడం గమనార్హం. శనివారం రాత్రి బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలికి చెందిన ట్రాలీ సూట్ కేసును తనిఖీ చేసిన డీఆర్ఐ అధికారులు 4.15కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రయాణికురాలిని అరెస్టు చేశారు. ఇక, వారం క్రితం బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద రూ.10 కోట్ల విలువైన 10 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది. అంతకుముందు సెప్టెంబరు 5న బ్యాంకాక్ నుంచి వచ్చిన మరో మహిళ లగేజీలో రూ.13.9కోట్ల విలువైన 13.9కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక, సెప్టెంబరు 20న బ్యాంకాక్‌లో బయలుదేరి దుబాయ్ మీదుగా హైదరాబాద్ చేరుకున్న మరో మహిళ నుంచి 12 కోట్ల విలువైన 12 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది. ఆగస్టు 11న బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ లగేజీలో రూ.13.3 కోట్ల విలువైన 13.3 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి లభించింది. ఇలా మూడు నెలల వ్యవధిలో 53.35 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది. అంతకముందు జూలైలో బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద ఏకంగా రూ.40 కోట్ల విలువైన 40కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలు అన్నింటిలో పట్టుబడిన వారంతా మహిళలే కావడం, అంతా బ్యాంకాక్ నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. బ్యాంకాక్ నుంచి వస్తున్న మహిళలను మత్తుమందుల స్మగ్లర్లు కొరియర్లుగా వాడుతున్నారని, అందుకే బ్యాంకాక్ నుంచి వస్తున్న మహిళా ప్రయాణికులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని డీఆర్ఐ అధికారులు చెబుతున్నారు. అయితే, డీఆర్ఐ నుంచి తప్పించుకునేందుకు స్మగ్లర్లు కొత్త ఎత్తులు వేస్తున్నారని తెలిపారు. కొరియర్లుగా వాడుతున్న మహిళలను బ్యాంకాక్ నుంచి నేరుగా కాకుండా దుబాయ్ మీదుగా హైదరాబాద్‌కు పంపిస్తున్నారని చెప్పారు. కాగా, హైదరాబాద్ చేరుకున్న మహిళల దగ్గర నుంచి గంజాయిని తీసుకుని ముంబైకి


ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డ హైడ్రోపోనిక్ గంజాయి

తరలించడానికి మరో నెట్‌వర్క్ పనిచేస్తుందని, ఆ నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో ఉన్నామని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు తెలిపారు. 3 నెలల్లో హైడ్రోపోనిక్ గంజాయితో పట్టుబడిన మహిళల్లో నలుగురు ముంబైకి చెందిన వారని పేర్కొన్నారు.

కిలో రూ.కోటి.. ఏమిటీ హైడ్రోపోనిక్ గంజాయి?

ఒక గ్రాము రూ.10 వేలు.. ఒక కిలో రూ.కోటి.. ఇది హైడ్రోపోనిక్ గంజాయి ధర. ఎందుకింత రేటు అని అంటే.. సాధారణంగా గంజాయిని పొలాల్లో, మట్టి నేలల్లో పండిస్తారు. ఇందుకు భిన్నంగా హైడ్రోపోనిక్ గంజాయిని ప్రయోగశాలల్లో సాగు చేస్తారు. ప్రత్యేక ల్యాబ్‌ల్లో నియంత్రిత ఉష్ణోగ్రత, తేమల మధ్య పోషకాలను అందించి గంజాయిని సాగు చేస్తుంటారు. ఈ విధానాన్నే హైడ్రో పోనిక్స్ అంటారు. 'మత్తు వదలరా' అనే సినిమాలో ఈ గంజాయి సాగు తీరును చూపిస్తారు. సాధారణ గంజాయి మొక్కలతో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయి మొక్కల ఎదుగుదల చాలా వేగంగా ఉంటుంది. పంట త్వరగా చేతికొస్తుంది. ఈ గంజాయి ఇచ్చే మత్తు కూడా అధికంగా ఉంటుంది. గంజాయిలోని టీహెచ్‌సీ-టెట్రాహైడ్రోకానబినాల్ మత్తును ఇస్తుంది. సాధారణ గంజాయితో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయిలో ఈ టీహెచ్‌సీ 30 శాతం అధికంగా ఉంటుంది. ఇక ఈ హైడ్రోపోనిక్ గంజాయితో హాష్ ఆయిల్, హాషిష్ కూడా తయారు చేస్తుంటారు. అధిక టీహెచ్‌సీ శాతం కలిగిన హైడ్రోపోనిక్ గంజాయి మొక్కల నుంచి తీయడం వల్ల ఈ హాష్ ఆయిల్, హాషిష్ ఇచ్చే మత్తు కూడా అధికంగానే ఉంటుంది.

పత్తి చేలలో గంజాయి ఘాటు!

» మహారాష్ట్ర సరిహద్దులోని గ్రామాల్లో సాగు చేస్తున్న రైతులు

ఆసిఫాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర వ్యాపారుల ప్రోద్బలంతో ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దు గ్రామాల్లోని కొందరు రైతులు పత్తి చేలల్లో అంతరపంటగా గంజాయి సాగు చేస్తున్నారు. ఏజెన్సీ మండలాలైన ఆసిఫాబాద్, జైనూరు, సిర్పూర్ (యు), లింగాపూర్, కెరమెరి, తిర్యాణి, వాంకిడి మండలాల్లో కొన్నాళ్లుగా ఈ తతంగం గుట్టుగా సాగుతోంది. ఇటీవల పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతుండడంతో గంజాయి సాగు చేస్తున్న రైతుల్లో దడ మొదలైంది. ఇటీవల తిర్యాణి మండలం కొద్దుగూడలో ఆత్రం పాపరావు, జైనూరు మండలం జారుగూడకు చెందిన ఆత్రం లక్ష్మణ్, కెరమెరి మండలం ఇందాపూర్‌కు చెందిన వడాయి పోశెట్టితోపాటు మరికొందరి పత్తి చేలలో గంజాయి సాగు చేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు.. వారిపై కేసులు నమోదు చేశారు. వాస్తవానికి మారుమూల గ్రామాల్లో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయిని గుర్తించడం గతంలో పోలీసులకు కష్టంగా ఉండేది. అయితే ప్రస్తుతం డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు.. పత్తి చేలలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించి రైతులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా ఈ ఏడాది ఇప్పటి దాకా 101 మంది నిందితులపై 57 కేసులు నమోదు చేశారు. 14.76 కిలోల ఎండు గంజాయి, 1,050 మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.కోటి దాకా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే గంజాయి పండించినా, విక్రయించినా, రవాణా చేస్తూ పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ హెచ్చరించారు.

'చేనేత పొదుపు'.. సర్కారు మరుపు!

» చేనేత పొదుపు నిధి పథకంపై తీవ్ర నిర్లక్ష్యం

» కార్మికుల ఖాతాల్లో జమకాని ప్రభుత్వ వాటా

» 5 నెలలుగా పెండింగ్.. ఆందోళనలో నేతన్నలు

» రాష్ట్రవ్యాప్తంగా 46కోట్ల వాటాధనం పెండింగ్

జనగామ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత పొదుపు నిధి పథకం అమలుపై ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోంది. చేనేత, మరమగ్గాల కార్మికుల ఆర్థిక భరోసా కల్పించేందుకు గానూ ప్రభుత్వం చేనేతకు అభయహస్తం పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద 'నేతన్న పొదుపు నిధి', నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాలను ఒకే గొడుకు కిందకు చేర్చారు. బీఆర్ఎస్ హయాంలో చేనేత థ్రిఫ్ట్ ఫండ్, చేనేత బీమా, చేనేతకు చేయూత పేరుతో ఉన్న పథకాలను ఈ ఏడాది జనవరి నెలలో ప్రభుత్వం చేనేతకు అభయహస్తం పేరుతో ప్రారంభించింది. రూ.165 కోట్లతో ఈ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పొదుపు నిధికి రూ. 115 కోట్లు, నేతన్న భద్రతకు రూ. 9 కోట్లు, నేతన్న భరోసాకు రూ. 44 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పొదుపు నిధి కింద రాష్ట్రవ్యాప్తంగా 38 వేల మంది చేనేత కార్మికులు, 15 వేల మంది మరమగ్గాల కార్మికులు ఉన్నారు. మొత్తంగా 53 వేల మంది నేత కార్మికులకు సంబంధించి 5 నెలలకు గానూ సుమారు రూ. 46 కోట్ల వాటాధనాన్ని ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. చేనేత కార్మికులకు సంబంధించి 5 నెలలకు గానూ రూ. 45.60 కోట్లు, మరమగ్గాల కార్మికులకు 5 నెలలకు గానూ సుమారు రూ. 45 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో చేనేత పొదుపు నిధి పథకంపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులు తమ వాటాధనాన్ని ఖాతాల్లో జమ చేస్తే ప్రభుత్వం తన వాటాను జమ చేస్తోంది. అయితే, ప్రభుత్వ వాటాధనాన్ని గత 5 నెలలుగా జమ చేయడం లేదు. ఈ క్రమంలో తమ వాటాను జమ చేయాలా వద్దా అన్న సందిగ్ధతకు నేత కార్మికులు లోనవుతున్నారు. దీంతో పథకం అమలుపై నేతన్నల్లో ఆందోళన నెలకొంది. వాస్తవానికి పొదుపు నిధి పథకంలో భాగంగా చేనేత, మరమగ్గాల కార్మికులు ప్రతినెలా రూ. 1200, అనుబంధ కార్మికులు (కండెలు చుట్టడం, రంగుల అద్దడం) కార్మికులు రూ. 600 చొప్పున తమ బ్యాంకు ఖాతాలో జమ చేస్తే అందుకు రెట్టింపు నిధిని సర్కారు వారి ఖాతాలకు జమ చేస్తుంది. రెండేళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత కార్మికుడి వాటా, ప్రభుత్వ వాటా మొత్తాన్ని ఖాతా నుంచి కార్మికులు పొందే వీలుంటుంది. గతంలో మూడేళ్ల కాలపరిమితి ఉండగా ప్రస్తుతం రెండేళ్లకు కుదించారు.


అనారోగ్యంతో బాధ పడుతున్న అపర్ణ.. పక్కన సహాయం చేయాలని వేడుకుంటున్న ఆమె తల్లి

నా కూతురి ప్రాణాలు కాపాడండి

» తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద విద్యార్థిని

» వైద్య సాయం చేసి ఆదుకోవాలని దాతలకు తల్లి వేడుకోలు

బోనకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబాన్ని కష్టాలు వెంటాడుతున్నాయి. కొన్ని నెలల క్రితం ఓ ప్రమాదంలో భర్త చనిపోగా.. ఉన్న ఒక్కగానొక్క కూతురు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయింది. కూలీ పనులు చేసే ఆ తల్లి తన కుమార్తె వైద్యం కోసం ఇప్పటికే శక్తికి మించిన అప్పులు చేసింది. అయినా కూతురి ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో దాతల సాయం కోసం అర్థిస్తోంది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తాటికొండ లాజరు, మరియమ్మ దంపతులకు అపర్ణ ఒక్కగానొక్క కుమార్తె. 2019లో మధిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివే సమయంలో తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లగా తనకు లివర్ సంబంధిత వ్యాధితో పాటు పలు అనారోగ్య సమస్యలు ఉన్నాయని తేలింది. అప్పటినుంచి తప్పని పరిస్థితుల్లో చదువుకు స్వస్తి చెప్పి ఇంటికే పరిమితమైంది. కూతురి వైద్యం కోసం తల్లిదండ్రులు తమ శక్తికి మించి అప్పులు చేశారు. అలాంటి కష్ట సమయాల్లో ఆరు నెలల క్రితం కుటుంబ పెద్ద అయిన అపర్ణ తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి ఒకవైపు కూలీ పనులకు వెళ్తూనే.. మరోవైపు అనారోగ్యంతో ఉన్న కూతురిని చూసుకుంటోంది. కానీ సరైన చికిత్స అందకపోవడంతో అపర్ణ లివర్ పూర్తిగా దెబ్బతిన్నది. దాంతోపాటు ఇతర అవయవాలు కూడా సరిగా పని చేయడం లేదని వైద్యులు తెలిపారు. దీంతో నిమ్స్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు వైద్యం చేయించారు. అయినా ఆరోగ్యం మెరుగు కాకపోవడం, ఆరోగ్యశ్రీ పరిమితి కూడా దాటడంతో ఇప్పుడు పూర్తిగా డబ్బులు కట్టి వైద్యం చేయించుకోవాలని వైద్యులు చెప్పారు. అపర్ణకు లివర్‌తో పాటు మరో మూడు సర్జరీలు చేయాల్సి ఉంటుందని, అందుకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తెలిపారు. చేసిన అప్పులు తీర్చలేక దయనీయ పరిస్థితిలో ఉన్న మరియమ్మ తమ కూతురిని బతికించాలని, వైద్యం చేయించి మానవత్వం చాటుకోవాలని దాతలను వేడుకుంటోంది.

రుతుస్రావ రక్తంతో హెచ్‌పీవీ పరీక్ష

» గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను ముందే గుర్తించే వీలు

» కిమ్స్ ఆస్పత్రి 'పింక్ పిక్నిక్'లో 'ఎం-స్ట్రిప్' ఆవిష్కరణ


ఎం-స్ట్రిప్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రావడానికి ముఖ్య కారణం.. హ్యూమన్ పాపిలోమా వైరస్. దాని బారిన పడిందీ లేనిదీ తెలుసుకోవడానికి ఇకపై మహిళలు ఆస్పత్రులకో, డయాగ్నస్టిక్ సెంటర్లకో వెళ్లక్కర్లేదు! ఇంట్లోనే.. నెలసరి రక్తంతో స్వీయ నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్ష చేయించుకోవచ్చు! గుజరాత్‌కు చెందిన ఐయోటా అనే కంపెనీ అభివృద్ధి చేసిన 'ఎం-స్ట్రిప్'తో ఇది సాధ్యమవుతుంది. గచ్చిబౌలి కిమ్స్ ఆస్పత్రిలోని ఆంకాలజీ విభాగం.. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని బొటానికల్ గార్డెన్స్‌లో 'పింక్ పిక్నిక్' పేరిట ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ స్ట్రిప్‌ను ఆవిష్కరించారు. రుతుస్రావం సమయంలో ఉపయోగించే శానిటరీ ప్యాడ్‌పై వచ్చే రక్తం మీద ఈ స్ట్రిప్ పెడితే చాలు. అది ఆ రక్తనమూనాలను సేకరిస్తుందని.. దాన్ని అయోటా కంపెనీకి సంబంధించిన సిబ్బందికి అందజేస్తే, వారు ల్యాబ్‌లో పరీక్షించి హెచ్‌పీవీ బారిన పడిందీ లేనిదీ నిర్ధారిస్తారని.. ఆంకాలజిస్ట్ డాక్టర్ భవ్య వివరించారు. అలాగే.. ఈ పింక్ పిక్నిక్ కార్యక్రమంలో పలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. రొమ్ములను పరీక్షించుకోవడంపై అవగాహన కల్పించేందుకు ఒక స్టాల్‌ను ఏర్పాటు చేయగా.. కస్టమైజ్డ్ బ్రాసరీలను తయారు చేసే బెంగళూరు కంపెనీ 'బ్యాండ్స్ అండ్ కప్స్' ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అలాగే గతంలో రొమ్ము క్యాన్సర్ బారిన పడి, శస్త్రచికిత్స, ఇతర చికిత్సలు చేయించుకున్న తర్వాత పూర్తి ఆరోగ్యంతో జీవిస్తున్న పలువురు మహిళలు తమ విజయగాథలను వివరించారు. కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, యూనిట్ రీజనల్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, మెడికల్ డైరెక్టర్ అంకిత చావ్లా, వైద్యులు పవన్ జొన్నాడ, మేకల లక్ష్మారెడ్డి, వి.ప్రజ్యోత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన శునకం

» అడ్డు రావడంతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మహిళా బైకర్

» వాహనంతో సహా లారీ కింద ఇరుక్కుపోయి దుర్మరణం



సత్తుపల్లి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రహదారిపై అడ్డంగా పరుగెత్తిన శునకం.. రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ ప్రాణం పోవడానికి కారణమైంది. రోడ్డుపై ద్విచక్రవాహనం(స్కూటర్)లో వెళుతుండగా హఠాత్తుగా ఓ శునకం అడ్డురావడంతో కంగారుపడిన ఓ మహిళ తన వాహనంపై నియంత్రణ కోల్పోయి.. రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ లారీని వెనుక నుంచి ఢీకొట్టి తీవ్రంగా గాయపడింది. తన ద్విచక్ర వాహనంతో సహా ఆ లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన ఆమె అలానే ప్రాణాలు కోల్పోయింది. ఖమ్మం జిల్లాలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సత్తుపల్లికి చెందిన మోరంపూడి స్వర్ణలత (56), రామకోటేశ్వరరావు దంపతులకు కుమార్తె నాగశ్రీ, కుమారుడు నాగశ్యామ్ ఉన్నారు. నాగశ్రీ అమెరికాలో స్థిరపడగా శ్యామ్ హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నారు. బ్రెయిన్ ఆపరేషన్ జరగడంతో రామకోటేశ్వరరావు కొంతకాలంగా ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో స్వర్ణలత వ్యవసాయ పనులు కూడా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో దమ్మపేట మండలం రెడ్యాలపాడులోని పామాయిల్ తోటల వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లిన స్వర్ణలత తిరుగు ప్రయాణంలో తమ్మిలేరు వంతెన ఎక్కుతుండగా ఓ కుక్క అడ్డువచ్చింది. దీంతో వాహనంపై నియంత్రణ కోల్పోయిన స్వర్ణలత.. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టారు. లారీ వెనుక భాగంలో ఆమె ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే ప్రాణం విడిచారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు

రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతవరణ కేంద్రం



హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుపానుగా మారింది. ఈ తుపాను ఈ నెల 28 సాయంత్రం నాటికి తీరం దాటే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో 28 నుంచి 30 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుసే అవకాశం ఉండడంతో, వాతావరణ కేంద్రం రెడ్ అలెర్ట్ జారీ చేసింది. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడేం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. ఈనెల 29న కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.